





www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 21 శుక్రవారం | ఫిబ్రవరి 2025 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 157

Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur







# ఆపరేషన్ షురూ!

- ఆపరేషన్ ఆకర్ష్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్
- ఉప ఎన్నికలు వస్తాయని బీఆర్ఎస్ ప్రకటనలు
- ఉప ఎన్నికలు రాకుండా 16 మంది ఎమ్మెల్యేల విలీనంపై దృష్టి
- కాంగ్రెస్‌లోకి వచ్చే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దృష్టి
- స్థానిక సంస్థల ఎన్నికల్లోగా బీఆర్ఎస్ నిర్వీర్యం

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

తెలంగాణ పాలిటిక్స్ వెరీ ఇంట్రెస్టింగ్‌గా మారుతున్నాయి. ఏదో జరగబోతుందంటూ అధికార కాంగ్రెస్‌తోపాటు ప్రతిపక్ష బీఆర్ఎస్ నుంచి సంకేతాలు అందుతున్నాయి. రేవంత్ ప్రభుత్వం కూలిపోతుందని బీఆర్ఎస్, ప్రతిపక్షం అడ్రస్ గల్లంతు చేస్తామని హస్తం నేతలు సవాళ్లు, ప్రతి సవాళ్లతో హోరెత్తిస్తున్నారు. దీంతో తెలంగాణ గట్టు మీద రాజకీయం సలసల మండుతోంది. వేసవి తాపం ముందే తగిలినట్లు 2 పార్టీల నేతలు వ్యవహరిస్తుండటమే హాట్ టాపిక్ అవుతోంది. తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించి దాదాపు 14 నెలలు కావస్తోంది. ప్రభుత్వపరంగా ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకుంటున్నా, క్షేత్రస్థాయిలో అను కున్న మైలేజ్ రావడం లేదని సీఎం భావిస్తున్నారని చెబుతున్నారు. దీనికి కారణం సొంత పార్టీలో ప్రత్యర్థులతో పాటు ప్రతిపక్షం గట్టిగా పోరాడం కూడా కారణంగా విశ్లేషిస్తున్నారట.. దీంతో ఒకే దెబ్బకు 2 పిట్టలు అన్నట్లు రాజకీయంగా గట్టి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. 14 నెలలుగా సీఎంగా ఉన్నా కాంగ్రెస్ పార్టీలో కొన్ని కీలక విషయాలను సీఎం ఛేదించలేకపోతున్నారనే టాక్ ఉంది. అందులో ప్రధానమైనది మంత్రివర్గ విస్తరణ. ప్రస్తుతం ఎమ్మెల్యేలుగా గెలిచిన వారిలో చాలా మంది సీనియర్లు ఉన్నారు. కానీ మంత్రివర్గంపై ఓ పరిమితి ఉండటంతో అందరికీ పదవులు ఇవ్వడం కుదరలేదని అంటున్నారు. ఇదే సమయంలో ప్రతి విషయాన్ని రాజకీయం చేస్తూ బీఆర్ఎస్ చికాకు చేస్తోందని అంటున్నారు. అయితే తనను ఇబ్బంది పెడుతున్న సీనియర్లను కట్టడి చేయడంతో పాటు ప్రతిపక్షాన్ని నీరుగార్చే ఓ బలమైన అడుగు వేసేందుకు ముఖ్యమంత్రి సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ నుంచి నిలిచిపోయిన వలసలను తిరిగి ప్రారంభించడం ద్వారా పార్టీపైన ప్రతిపక్షం పైనా పట్టుసాధించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనగా చెబుతున్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి 10 మంది ఎమ్మెల్యేలు వచ్చారు. వీరంతా పార్లమెంట్ ఎన్నికలకు కాస్త అటు, ఇటు చేరిన వారే. అయితే పదవులపై క్లారిటీ లేకపోవడంతో మరికొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వస్తామని చెప్పి ఆగిపోయారు. మరోవైపు బీఆర్ఎస్ తనను మాటమాటకు చికాకు పెట్టడం వల్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## నాంపల్లి కోర్టులో హాజరైన సీఎం రేవంత్ రెడ్డి

- ఎన్నికల ప్రచార సమయంలో చేసిన వ్యాఖ్యలతో రేవంత్‌రెడ్డిపై 3 కేసులు
- ఈ కేసులకు సంబంధించిన నాంపల్లి కోర్టుకు సీఎం కేసు విచారణ మార్చి 23కు వాయిదా



హైదరాబాద్-నవభూమిబ్యూరో

హైదరాబాద్ నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి గురువారం హాజరయ్యారు. ఎన్నికల ప్రచార సమయంలో చేసిన వ్యాఖ్యలతో రేవంత్ రెడ్డిపై నల్గొండ టూటౌన్ పోలీస్ స్టేషన్, బేగంబజార్ పోలీస్ స్టేషన్, మెదక్ జిల్లా కౌడిపల్లి పీఎస్ పరిధిలో మొత్తం మూడు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల విచారణ నిమిత్తం రేవంత్ రెడ్డి నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. కాగా, తదుపరి విచారణను మార్చి 23కి వాయిదా వేసింది ప్రజాప్రతినిధుల కోర్టు. సీఎం రేవంత్ నాంపల్లి కోర్టుకు హాజరవడంతో ఆ ప్రాంతంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కేసులు నమోదు చేసిందని టీపీసీసీ లీగల్ సెల్ వైస్ ఛైర్మన్ తిరుపతి వర్మ తెలిపారు.

## రాజలింగమూర్తి హత్యపై సీఎంఓ ఆరా

- మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి కారణం బీఆర్ఎస్ ప్రభుత్వమేనంటూ కేసు వేసిన రాజలింగమూర్తి
- మేడిగడ్డకు హత్యకు సంబంధముందా.. కోణంలో సీఎంఓ ఆరా
- ఈ కేసును సీబీసీఐడీకి అప్పగించే ఆలోచనలో సర్కార్
- భూతగాదాలే కారణమని హతుని భార్య సరళ ఆరోపణ

2




**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి భారాస ప్రభుత్వమే కారణమంటూ కేసు వేసిన రాజలింగమూర్తి (47) హత్యపై తెలంగాణ సీఎం కార్యాలయం (సీఎంవో) ఆరా తీసింది. ఈ హత్యకు గల కారణాలపై నిఘా వర్గాల నుంచి సమాచారం కోరింది. సీఎం. రేవంత్రెడ్డి ఆదేశాల మేరకు సీఎంవో అధికారులు వివరాలు సేకరించారు. మేడిగడ్డ వ్యవహారానికి రాజలింగమూర్తి హత్యకు సంబంధముందన్న ఆరోపణల నేపథ్యంలో ఈ కేసును సీబీసీఐడీకి అప్పగించే యోచనలో ప్రభుత్వమున్నట్లు సమాచారం. అలాగే ఈ కేసుకు సంబంధించి పలువురిని అదుపులోకి

# లంచావతారాలు

- గుత్తాదారుకు బిల్లు చెల్లించేందుకు లక్షన్నర డిమాండ్ చేసిన ఎస్సీ సహకార అభివృద్ధి సంస్థ జీఎం
- రైతును లంచం డిమాండ్ చేసిన మండల వ్యవసాయాధికారి ఇద్దరిని ఏసీబీకి పట్టించిన బాధితులు

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** అవినీతి నిరోధక శాఖకు ఇద్దరు లంచావతారులు చిక్కారు. ఎస్సీ సహకార అభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బొప్పూరి ఆనంద్ కుమార్ లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. గుత్తేదారుకు బిల్లు చెల్లించేందుకు ఆనంద్ కుమార్ రూ. 1.33 లక్షలు డిమాండ్ చేశారు. కాగా, వివిధ నిర్మాణ పనులు చేసినందుకు గుత్తేదారుకు రూ. 33,32,350లు మంజూరయ్యాయి. అయితే, ఆ బిల్లు చెల్లించడానికి ఆనంద్ కుమార్ రూ. 1.33 లక్షలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో గుత్తేదారు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. రూ. లక్ష లంచం ఇస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. అనంతరం ఆనంద్ కుమార్ ను అరెస్ట్ చేసి ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరు పర్చారు. దీంతో కోర్టు రిమాండ్ విధించడంతో అతడ్ని చంచల్‌గూడ జైలుకు తరలించారు.

## తెలంగాణలో 8 మంది ఐఏఎస్‌ల బదిలీ

- ఆరోగ్యశ్రీ సీఈఓగా ఆర్వీ కర్ణన్‌కు అదనపు బాధ్యతలు
- వాణిజ్యపన్నుల డైరెక్టర్‌గా కె.హరిత
- విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా యాస్మిన్ బాషా
- తెలంగాణ ఫుడ్స్ ఎండీగా చంద్రశేఖర్‌రెడ్డి
- నారాయణపేట అదనపు కలెక్టర్‌గా సంచిత్ గంగ్వార్
- మాతృసంస్థకు బి.శ్రీనివాసరెడ్డి బదిలీ

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** తెలంగాణ రాష్ట్రంలో మరోసారి ఉన్నతాధికారుల బదిలీ జరిగింది. ఎనిమిది మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సహకార కమిషనర్, మార్కెటింగ్ డైరెక్టర్‌గా కే సురేంద్రమోహన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆరోగ్యశ్రీ సీఈవో ఎల్ శివకుమార్‌ను జీఏడీలో రిపోర్టు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. బదిలీ అయిన అధికారుల వివరాలు.. ఆరోగ్యశ్రీ సీఈవోగా ఆర్.వీ. కర్ణన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. వాణిజ్య పన్నుల డైరెక్టర్‌గా కే హరిత నియమితులయ్యారు. విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా యాస్మిన్ బాషాకు అదనపు బాధ్యతలు అప్పగించారు. తెలంగాణ ఫుడ్స్ ఎండీగా కే చంద్రశేఖర్ రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. వనపర్తి అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ నారాయణపేట అదనపు కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. టెక్స్ టైల్స్, హ్యాండ్లూమ్స్ డైరెక్టర్ బీ శ్రీనివాస్ రెడ్డి మాతృసంస్థకు బదిలీ అయ్యారు.

సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానించిన యాదగిరిగుట్ట ఆలయ అర్చకులు

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం బంగారు విమాన గోపుర మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవంలో పాల్గొనాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, దేవాదాయ శాఖ కార్యదర్శి శైలజా రామయ్యర్‌లతో పాటు ఆలయ ఈవో, అర్చకులు జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రిని కలిసి ఫిబ్రవరి నెల 23న నిర్వహించే స్వామి వారి బంగారు విమాన గోపుర మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవ కార్యక్రమ ఆహ్వాన

## మిర్చి ధర పతనంపై
# కేంద్రంతో మాట్లాడా

- మిర్చి ధర పతనంపై కేంద్రమంత్రితో మాట్లాడినట్లు వెల్లడి
- రైతులను ఆదుకుంటామన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి
- అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గడంతోనే మిర్చి ధర పతనమైందన్న చంద్రబాబు
- పోలవరం పురోగతి, కేంద్రసాయంపై జలశక్తి మంత్రితో చర్చించినట్లు వెల్లడి
- పోలవరం నీళ్లు బనకచర్లకు తీసుకెళ్లేందుకు కేంద్ర సాయం కోరామన్న సీఎం
- వృథాగా సముద్రంలోకి పోయే నీటినే ఏపీ ఉపయోగించుకుంటోందని స్పష్టీకరణ
- ఢిల్లీలో మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

2



న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో

మిర్చి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ధరలు తగ్గడంపై కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడానని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ధరలు భారీగా పడిపోయాయన్నారు. గతంలో అంతర్జాతీయ మార్కెట్ బాగుండటంతో రైతులకు మంచి ధర వచ్చిందన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గడంతో ధరలు పడిపోయాయని, మిర్చి రైతుల సమస్యలను కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లానని ఆయన అన్నారు. కేంద్రమంత్రి పర్యటనలో ఉన్నందున వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతుల సమస్యలను వివరించినట్లు తెలిపారు. శుక్రవారం అధికారులతో కేంద్రమంత్రి సమీక్ష నిర్వహిస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. మిర్చి ధర పతనంపై సీఎం చంద్రబాబు కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమయ్యారు.

**రైతులను ఆదుకోవాలని కేంద్రాన్ని కోరాం**

ఈ యేడాది 12 లక్షల మెట్రిక్ టన్నుల మిర్చి

## మొన్న చుక్కలు నిన్న దిక్కులు

- దారుణంగా పడిపోయిన టమోటా ధరలు..
- ఇక రోడ్డుపై పారబోతకు సిద్ధమైన రైతులు 2
- కిలో వంద రూపాయలకు పలికిన టమోటా
- కిలో నాలుగు రూపాయలకు కొనే దిక్కులేదు



అమరావతి-నవభూమిబ్యూరో

తెలుగు రాష్ట్రాల్లో గతేడాది కూరగాయల ధరలు చుక్కలు చూపించాయి. మార్కెట్‌కు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితికి తెచ్చాయి. ధరలు అమాంతం పెరిగి పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచాయి. ముఖ్యంగా టమోటా ధర ఆకాశాన్ని అంటింది. చికెన్‌తో పోటీ పడుతుందా? అన్నట్లు కిలో

## ఢిల్లీ సీఎంగా రేఖాగుప్త ప్రమాణస్వీకారం

- ప్రమాణం చేయించిన ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్
- డిప్యూటీ సీఎంగా పర్వేశ్ వర్మ
- మరో ఐదుగురు మంత్రులు ప్రమాణస్వీకారం
- ప్రధాని మోదీ,అమిత్‌షా,కేంద్రమంత్రులు హాజరు

2



**ఢిల్లీ-నవభూమి:** దేశ రాజధాని ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా ప్రమాణ స్వీకారం చేశారు. ఢిల్లీ రామ్ లీలా మైదానం లో రేఖా గుప్తాతో లెఫ్టినెంట్ గవర్నర్ ప్రమాణం చేయించారు. డిప్యూటీ సీఎంగా పర్వేశ్ వర్మ ప్రమాణ స్వీకారం చేయగా.. ఆయనతో పాటు మరో ఐదుగురు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యేలు ఆశిష్ సూద్, మంజిన్దెర్ సింగ్ సిర్సా, రవీంద్ర రాజ్, కపిల్ మిశ్రా, పంకజ్ సింగ్ మంత్రులుగా ప్రమాణం చేశారు.

## ఏపీ ఫైబర్ నెట్ ఉన్నతాధికారులపై వేటు

- 9 నెలలుగా ఒక్క రూపాయి కూడా ఆదాయం రాలేదన్న జీవీ రెడ్డి
- జీఎస్టీ అధికారులు రూ.377 కోట్లు ఫైన్ విధించిన సంగతి చెప్పలేదని వెల్లడి
- అధికారులు సహకరించడంలేదని ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్‌జీవీ రెడ్డి ఆరోపణ



అమరావతి-నవభూమిబ్యూరో


కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు గడిచినా ఫైబర్ నెట్ కు పైసా ఆదాయం రాలేదని ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ జీవీ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సంస్థలో ఉన్నతాధికారులు సహకరించడం లేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు ఉన్నతాధికారులను తొలగిస్తున్నట్లు గురువారం ప్రకటించారు. ఫైబర్ నెట్ బిజినెస్ హెడ్ గంధంచెట్టు సురేష్, ప్రొక్యూర్మెంట్ అసిస్టెంట్ మేనేజర్ శశాంక్ హైదర్ ఖాన్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ భరద్వాజలకు ఉద్వాసన పలికినట్లు తెలిపారు.గత ప్రభుత్వ పెద్దలతో చేతులు కలిపి తొలగించిన ఉద్యోగులకూ జీతాలు చెల్లించారని జీవీ రెడ్డి మండిపడ్డారు. ఫైబర్ నెట్ లో సంస్కరణలు ప్రతిపాదిస్తూ 400 మంది ఉద్యోగులను తొలగించాలని ఆదేశించినా వారు పట్టించుకో లేదని విమర్శించారు. ఈ ఆదేశాలపై ఎండీ, ఈడీ సంతకాలు చేయలేదన్నారు. ఇటీవల జీఎస్టీ అధికారులు ఫైబర్ నెట్ కు రూ.377 కోట్లు జరిమానా విధించిన విషయాన్ని తన దృష్టికి తీసుకురాలేదని చెప్పారు.

ఈ తొమ్మిది నెలల్లో రాష్ట్రంలో ఒక్క కొత్త కనెక్షన్ కూడా ఇవ్వలేదని, సంస్థకు రూపాయి ఆదాయం రాలేదని తెలిపారు. ఎండీ దినేశ్ కుమార్ ఒక్క ఆపరేటర్ ను కూడా కలవడం లేదని, కనీసం సిబ్బందికి టార్గెట్లు కూడా పెట్టడంలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వాన్ని విమర్శలపాలు చేయడానికి గత ప్రభుత్వ పెద్దలతో కలిసి దినేశ్ కుమార్ కుట్ర పన్నినట్లు జీవీ రెడ్డి సందేహం వ్యక్తం చేశారు. తొలగించిన ఉద్యోగులకు చెల్లించిన జీతాల సొమ్మును దినేశ్ కుమార్ సహా ఇతర ఉన్నతాధికారుల నుంచి వసూలు చేయాలంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## శంకర్‌కు ఈడీ భారీ షాక్

**రూ. 10కోట్ల విలువైన 3 స్థిరాస్తులను ఈడీ జప్తు**

2




చెన్నై-నవభూమిబ్యూరో

ప్రముఖ సినీ దర్శకుడు శంకర్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ భారీ షాకిచ్చింది. మనీలాండరింగ్ కేసులో శంకర్‌కు చెందిన దాదాపు రూ. 10కోట్ల విలువైన మూడు స్థిరాస్తులను ఈడీ జప్తు చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం ప్రకారం ఫిబ్రవరి 17న ఆస్తులను అటాచ్ చేసినట్లు ఈడీ గురువారం వెల్లడించింది. కేసుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. తన కథ 'జిగుబా'ను కాపీ కొట్టి శంకర్ 'రోబో' సినిమా రూపొందించారని అరూర్ తమిళనాథన్ అనే వ్యక్తి 2011లో పిటిషన్ దాఖలు చేశారు. శంకర్ కాపీరైట్, ఐటీపీ చట్టాలను ఉల్లంఘించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేస విషయంపై ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా నివేదిక కూడా శంకర్ కు వ్యతిరేకంగా రావడం గమనార్హం. జిగుబా కథకు, రోబో సినిమాకు మధ్య చాలా పోలికలున్నాయని పేర్కొంది. శంకర్

## ఆస్పత్రిలో చేరిన సోనియా గాంధీ

- ఉదర సంబంధిత కారణాలతో అస్వస్థత
- ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆస్పత్రిలో అడ్మిట్
- సోనియా గాంధీ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు పేర్కొన్న డాక్టర్లు

2




న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో

కాంగ్రెస్ అగ్రనేత, రాజ్యసభ సభ్యురాలు సోనియా గాంధీ గురువారం ఆస్పత్రిలో చేరారు. ఉదర సంబంధిత కారణాలతో ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆస్పత్రిలో ఆమె అడ్మిట్ అయ్యారు. ప్రస్తుతం సోనియా గాంధీ ఆరోగ్యం బాగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. రెగ్యులర్ చెకప్‌లో భాగంగానే ఆమె ఆస్పత్రిలో చేరినట్లు సమాచారం. సోనియా గాంధీ బాగా కోలుకుంటున్నారని, శుక్రవారం సాయంత్రం నాటికి ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని తెలిసింది. ప్రత్యేక వైద్యుల బృందం ఆమెను పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. కాగా, గత డిసెంబర్‌లో తన 78వ పుట్టినరోజు జరుపుకున్నారు సోనియా గాంధీ. గురువారం

## కుమారి ఆంటీ పూజ గదిలో సీఎం ఫొటో.. ప్రతి రోజు హారతులిస్తూ..



**హైదరాబాద్-నవభూమి:**కుమారి ఆంటీ మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నారు. తన ఇంట్లోని పూజ గదిలో సీఎం రేవంత్ రెడ్డి ఫొటో పెట్టుకున్న ఆమె.. ప్రతి రోజూ దేవుళ్లతో పాటు నిత్యం హారతులిస్తూ రేవంత్ రెడ్డికి కూడా పూజలు చేస్తున్నారు. ఈ రోజు తాను ఫుడ్ స్టాల్ నడిపిస్తున్నానంటే అందుకు కారణం సీఎం అని, ఆయన తనకు దేవుడితో సమానం అని అందుకే పూజలు చేస్తుంటానని చెప్పుకొచ్చింది. ఇందుకు సంబంధించిన వీడియో తాజాగా నెట్టింట్లో వైరల్ అవుతోంది.
హైదరాబాద్ మాదాపూర్ దుర్గం చెరువు సమీపంలో కుమారి ఆంటీ ఫుడ్ స్టాల్ నడుపుతున్నారు. ఆమె ఫుడ్ స్టాల్‌లో తక్కువ ధరకే ఫుడ్ దొరుకుతుందని, టేస్టీగా ఉంటుందని కొందరు గతంలో సోషల్ మీడియాలో ఆమె వీడియోలో షేర్ చేశారు. ఆ వీడియోలు కాస్త వైరల్ గా మారడంతో కుమారి ఆంటీ సెలబ్రేటీగా మారారు. పలు టీవీ షోలోనూ కనిపించి సందడి చేశారు.అయితే, పోలీసులు కుమారి ఆంటీ ఫుడ్ స్టాల్ తొలగించేందుకు ప్రయత్నించారు. కానీ, సీఎం రేవంత్ స్పందించి తొలగించవద్దని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో కుమారీ ఆంటీ సీఎం రేవంత్ రెడ్డిపై ప్రత్యేక అభిమానాన్ని పెంచుకుంది.





## ఈత కొట్టాలని సరదాగా నదిలో దూకిన హైదరాబాద్ లేడీ డాక్టర్.. కట్ చేస్తే తీవ్ర విషాదం



**హైదరాబాద్-నవభూమి:**హైదరాబాద్‌కు చెందిన ఓ లేడి డాక్టర్.. ఇద్దరు స్నేహితులతో కలిసి కర్ణాటకలోని హంపీకి విహారయాత్రకు వెళ్లగా.. తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విహారయాత్రలో భాగంగా.. సరదాగా ఈత కొట్టాలని భావించిన మహిళా వైద్యురాలు.. తుంగభద్ర నదిలో దూకింది. కాసేపటికే నదిలో ప్రవాహం ఎక్కువవటంతో.. వైద్యురాలు కొట్టుకుపోయింది. రంగంలోకి దిగిన పోలీసులు గాలింపు చేపట్టగా.. గురువారం (ఫిబ్రవరి 20) ఉదయం మృతదేహం లభ్యమైంది. దీంతో.. కుటుంబసభ్యులు, స్నేహితులు బోరున విలపిస్తున్నారు.వృత్తిపరంగా రోజూ పని ఒత్తిడికి గురయ్యే చాలా మంది.. అప్పుడప్పుడు విధుల నుంచి కాస్త బ్రేక్ తీసుకుని విహాహయాత్రలకు వెళ్లి రీఫ్రెష్ అవుతుంటారు. మానసిక ఉల్లాసాన్ని పొంది.. రెట్టింపు ఉత్సాహంతో తిగిరి విధులు నిర్వహిస్తుంటారు. అటు మెదడుకు, ఇటు మనసుకు రిఫ్రెషింగ్‌గా ఉంటుందని వెళ్లే కొన్ని విహారయాత్రలు ఒక్కోసారి విషాదంగా మారుతుంటాయి. అచ్చంగా అలాంటి ఘటనే జరిగింది. హైదరాబాద్‌కు చెందిన యువ వైద్యుల బృందం సరదాగా చేపట్టిన విహారయాత్రలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది.హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రముఖ డాక్టర్ కుమార్తె, యువ వైద్యురాలు అనన్య రావు, మరో ఇద్దరు స్నేహితులు సాత్విన్, హషితతో కలిసి కర్ణాటకలోని హంపీకి టూర్‌కు వెళ్లారు. అక్కడున్న పర్యాటక ప్రదేశాలను చూసిన వీళ్లు.. మంగళవారం (ఫిబ్రవరి 18న) రాత్రి సణాపుర గ్రామంలోని ఓ గెస్ట్ హౌస్‌లో బస చేశారు. బుధవారం (ఫిబ్రవరి 19న) మధ్యాహ్నాం సమయంలో తుంగభద్ర నదికి వెళ్లారు. అక్కడికి వెళ్లిన అనన్యరావు.. సరదాగా ఈత కొట్టాలనుంది. అందుకోసం.. సుమారు 25 అడుగుల ఎత్తు గల బండరాయి నుంచి అనన్యరావు నదిలో దూకింది.కాసేపు సరదాగా ఈత కొడుతూ ఆనందించిన అనన్యరావు.. కాసేపటికే నదిలో నీటి ప్రవాహం పెరగడంతో కొట్టుకుపోయింది. అనన్యరావు కొట్టుకుపోతుండటాన్ని గమనించిన స్నేహితులు.. ఆమెను రక్షించేందుకు ప్రయత్నించారు. కానీ.. ప్రవాహం ఎక్కువగా ఉండటంతో చూస్తుండగానే.. అనన్యరావు కనిపించకుండాపోయింది. అప్రమత్తమైన ఆమె స్నేహితులు.. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు.వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు.. హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. అనన్యరావు దూకిన ప్రదేశంలో.. తుంగభద్ర నది రాతి గుహల్లో ప్రవహిస్తూ ఉంటుంది. అయితే.. అనన్యరావు గుహల్లో చిక్కుకు పోయింటారని పోలీసులు అనుమానించారు. స్థానిక గజ ఈతగాళ్లు, అగ్నిమాపక సిబ్బంది సాయంత్రం వరకు ప్రయత్నించినా ఆమె జాడ కనిపించలేదు. కాగా.. గురువారం (ఫిబ్రవరి 20న) రోజు కూడా గాలింపు చర్యలు చేపట్టగా.. అనన్యరావు మృతదేహం లభించింది.దీంతో.. అనన్యరావు కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. కుటుంబసభ్యులు, ఆమె స్నేహితులు బోరున విలపించారు. అయితే.. అనన్య రావు నదిలో దూకిన దృశ్యాలను ఆమె స్నేహితులు వీడియో తీయగా.. ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మరోవైపు.. అనన్య రావు తండ్రి మెహన్ రావు కూడా డాక్టరే కాగా.. ఆమె వీకేసీ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్నట్టు తెలిసింది.


## గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రికి మాజీ సీఎం కేసీఆర్.. ఉన్నట్టుండి ఏమైంది..?





**హైదరాబాద్-నవభూమి:**బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్.. హైదరాబాద్?లోని గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రికి వెళ్లారు. సాధారణ వైద్య పరీక్షల కోసం గురువారం (ఫిబ్రవరి 20న) ఉదయం ఏఐజీ ఆస్పత్రికి.. సతీమణి శోభతో కలిసి వెళ్లారు. ఆస్పత్రికి వెళ్లిన కేసీఆర్‌కు వైద్యులు పలు వైద్య పరీక్షలు నిర్వహించినట్టు తెలుస్తోంది. ఈ సమయంలో కేసీఆర్ వెంట సంతోష్ రావు కూడా ఉన్నారు. అయితే.. ఉన్నట్టుండి గులాబీ బాస్ కేసీఆర్ ఆస్పత్రికి వెళ్లటంపై రకరకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి విషయంలో గులాబీ శ్రేణులు కాస్త ఆందోళనకు లోనవుతున్నాయి.అయితే.. కేసీఆర్ ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నప్పటికీ సాధారణ వైద్య పరీక్షల్లో భాగంగానే.. ఏఐజీకి వెళ్లినట్టు తెలుస్తోంది. ఇదే క్రమంలో.. మరో ఆసక్తికర వాదన కూడా వినిపిస్తోంది. మాజీ సీఎం కేసీఆర్.. అమెరికా వెళ్లాలనే యోచనలో ఉన్నారని.. అందుకోసమే ముందుగా వైద్య పరీక్షలు చేపించుకునేందుకు ఏఐజీ హాస్పటల్‌కు వెళ్లినట్టు తెలుస్తోంది. అయితే.. బుధవారం (ఫిబ్రవరి 20న) రోజున సికింద్రాబాద్ రీజినల్ పాస్ పోర్టు ఆఫీస్‌కు వెళ్లి తన పాస్‌పోర్టు రెన్యూవల్ చేయించుకోవంట ఈ వాదనకు బలం చేకూరుస్తుంది.అయితే.. మనుమరాలు, కేటీఆర్ కుమార్తె అలేఖ్యకు కూడా అమెరికాలో సీటు రావడంతో ఆమెతో పాటు కేసీఆర్ అమెరికా వెళ్లేందుకు సిద్ధమవుతున్నారని ప్రచారం నడుస్తోంది. ఇందులో భాగంగానే తన పాస్ పోర్టు రెన్యూవల్ చేయించుకున్నారని.. డిప్లమాట్ పాస్ పోర్టును సాధారణ స్థితికి మార్చుకున్నారనే టాక్ నడుస్తోంది. అయితే.. మొన్నటి వరకు అమెరికాలో చదువుకున్న కేటీఆర్ కుమారుడు హిమాన్షు. ప్రస్తుతం సింగపూర్‌లో చదువుకుటున్నాడు.అమెరికాలో ఉన్నప్పుడు తాత (కేసీఆర్) మీద బెంగతో పదే పదే ఇండియా వస్తుండటంతో.. అమెరికా నుంచి సింగపూర్‌కు మార్చినట్టుగా తెలుస్తోంది. కాగా.. అటు మనవరాలితో కొద్ది రోజులు ఉన్న తర్వాత.. మనుమడి వద్ద కొంత కాలం ఉండేందుకు సింగపూర్‌కు కూడా వెళ్లనున్నట్టు చెప్తున్నారు. అయితే.. ఈసారి మాత్రం కేసీఆర్ ఫారిన్ టూర్ పక్కా అన్నట్టుగా వార్తలు వైరల్ అవుతున్నాయి. ఆ మధ్య కూడా హిమాన్షు అమెరికాలో చదువుకుంటున్న సమయంలో.. తన మనవడి దగ్గరికి వెళ్తారంటూ వార్తల వచ్చాయి. కాగా.. ఇప్పుడు మళ్లీ అలాంటి వార్తలే వస్తుంటాయి. అయితే.. ఈసారి నిజంగానే.. ఫారిన్ వెళ్తున్నారా అన్నది ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.


## టెన్త్ విద్యార్థినికి గుండెపోటు.. స్కూల్‌కు వెళ్తూ రోడ్డుపైనే కుప్పకూలి..!



**హైదరాబాద్-నవభూమి:**గుండెపోటుతో మరో విద్యార్థిని ప్రాణాలు వదిలింది. ఈ విషాదకర ఘటన.. కామారెడ్డి జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. రామారెడ్డి మండలం సింగరాయిపల్లి గ్రామానికి చెందిన శ్రీనిధి (14).. కామారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. కామారెడ్డిలోనే ఉంటూ పదో తరగతి చదువుకుంటున్న శ్రీనిధి.. రోజూలాగానే గురువారం (ఫిబ్రవరి 20న) రోజు కూడా ఉదయం పూట పాఠశాలకు బయలుదేరింది. అయితే.. పాఠశాలకు సమీపంలో గుండెలో నొప్పి రావటంతో.. ఒక్కసారిగా స్పృహ కోల్పోయి రోడ్డుపై కుప్పకూలింది. అదే సమయంలో అటుగా వస్తున్న పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనిధిని గమనించి.. వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించాడు.వెంటనే స్పందించిన ఆస్పత్రి సిబ్బంది.. ఆమెను పరీక్షించి ప్రాథమిక చికిత్స అందించినా.. శ్రీనిధి నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో హుటాహుటిన మరో ఆస్పత్రికి తరలించారు. అక్కడ కూడా శ్రీనిధికి సీపీఆర్ చేసినప్పటికీ.. ఫలితం లేకపోవడంతో విద్యార్థిని మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ విషాదకర సమాచారాన్ని శ్రీనిధి తల్లిదండ్రులకు స్కూల్ యాజమాన్యం అందించగా.. గుండెలు బాదుకుంటూ ఆస్పత్రికి వచ్చిన కుటుంబసభ్యులు విద్యార్థిని మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.పాఠశాలకు చెందిన విద్యార్థిని మృతి చెందటంతో.. ఆమె కుటుంబంతో పాటు చదువుకునే పాఠశాలలోనూ విషాదఛాయలు అలుముకున్నాయి. శ్రీనిధి మృతి పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు. పదో తరగతి చదువుతున్న శ్రీనిధి.. చిన్న వయసులోనే గుండెపోటుతో ప్రాణాలు వదలటంతో.. గ్రామంలో కూడా విషాదఛాయలు అలుముకున్నాయి.గతకొంత కాలంగా తెలంగాణ వ్యాప్తంగా గుండెపోటు మరణాలు పెరిగిపోతున్నాయి. అందులోనూ.. చిన్న వయసు వారికి కూడా గుండెపోటు వస్తుండటం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. అది కూడా స్కూల్ పిల్లలకు కూడా హార్ట్ ఎటాక్ వస్తుండటం మరింత టెన్షన్ పెడుతోంది. గతనెలలో మహబూబ్‌నగర్ జిల్లాలోని గురుకులలో చదువుతున్న టెన్త్ విద్యార్థి కూడా హార్ట్ ఎటాక్‌తో ప్రాణాలు వదలగా.. ఇప్పుడు మరో పదో తరగతి విద్యార్థి ప్రాణాలు వదలటం బాధాకరం.ఇదిలా ఉంటే.. హైకోర్టు న్యాయవాదులు గుండెపోటుతో కోర్టులోనే ప్రాణాలు వదిలిన ఘటనలు తీవ్ర విషాదాన్ని నింపాయి. ఓ న్యాయమూర్తి తన వాదనలు వినిపిస్తూ వినిపిస్తూనే గుండె పట్టుకుని కుప్పకూలి ప్రాణాలు వదలగా.. మరో న్యాయవాది కోర్టులో చలానా కట్టేందుకు వచ్చి కుప్పకూలి మృతి చెందారు.

## తెలుగు రాష్ట్రాల్లోనే అతిపెద్ద ఆదియోగి విగ్రహం..

### ఏపీలోని ద్వారపూడిలో మహా శివరాత్రి రోజున ప్రారంభం



**హైదరాబాద్-నవభూమి:**ఆదియోగి విగ్రహం అనే పేరు వినగానే తమిళనాడులోని కోయంబత్తూరులో ఉన్న విగ్రహం గుర్తుకు వస్తుంది. ఎందుకంటే ఆ ఆదియోగి విగ్రహం అత్యంత ఎత్తులో, పెద్దదిగా ఉంటుంది. ఇక ఏటా మహా శివరాత్రి సందర్భంగా చాలా మంది భక్తులు.. దేశం నలుమూలల నుంచి కోయంబత్తూరు ఆదియోగి విగ్రహం వద్దకు చేరుకుని పెద్ద ఎత్తున శివరాత్రి ఉత్సవాలు జరుపుతారు. అయితే తెలుగు రాష్ట్రాల్లోనే అత్యంత పెద్దదైనా ఆదియోగి విగ్రహ నిర్మాణం పూర్తి అయింది. మరికొన్ని రోజుల్లో మహా శివరాత్రి పండగ సందర్భంగా ఈ ఆదియోగి విగ్రహాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు పూర్తి అయ్యాయి.ఆంధ్రప్రదేశ్‌లోని అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని మండపేట మండలం ద్వారపూడిలో ఈ అతిపెద్ద ఆదియోగి విగ్రహాన్ని నిర్మించారు. ఇది రాజమండ్రి నగరానికి అత్యంత సమీపంలో ఉంటుంది. ద్వారపూడిలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయం చాలా ఫేమస్ అని అందరికీ తెలిసిందే. అందుకే ద్వారపూడిని ఆంధ్రా శబరిమలగా కూడా పిలుస్తారు. ఈ నేపథ్యంలోనే అదే అయ్యప్ప స్వామి ఆలయానికి సమీపంలో భారీ ఆదియోగి విగ్రహాన్ని నిర్మించారు. 60 అడుగుల ఎత్తు.. 100 అడుగుల వెడల్పుతో నిర్మించిన ఈ ఆదియోగి విగ్రహం.. ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. అయితే కేవలం 10 నెలల్లోనే ఈ ఆదియోగి విగ్రహ నిర్మాణం పూర్తి చేయడం గమనార్హం.అయ్యప్ప స్వామి ఆలయ గురుస్వామి ఎస్ఎల్ కనకరాజు సమక్షంలో ఈ ఆదియోగి విగ్రహ నిర్మాణం పూర్తి అయింది. ఈ ఆదియోగి విగ్రహం మొత్తాన్ని సిమెంట్‌తో నిర్మించినట్లు గురుస్వామి తెలిపారు. ఇందుకోసం రూ.30 లక్షలు ఖర్చు అయినట్లు చెప్పారు. బిక్కవోలు మండలం కొమరిపాలేనికి చెందిన శిల్పి పెద్ద రాఘవ, తన బృందంతో ఈ ఆదియోగి విగ్రహాన్ని నిర్మించినట్లు ఎస్ఎల్ కనకరాజు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో ఇదే అతిపెద్ద ఆదియోగి విగ్రహం అని ఆయన స్పష్టం చేశారు. ఈనెల 26వ తేదీన మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆ ఆదియోగి విగ్రహాన్ని ప్రారంభించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇక ఈ ఆదియోగి విగ్రహం ప్రారంభోత్సవం జరుపుకోకముందే దాన్ని చూసేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి అనేక మంది భక్తులు తరలివస్తున్నారు. ఈ క్రమంలోనే ఆదియోగి విగ్రహానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.

## మొన్న చుక్కలు నిన్న దిక్కులు

**(1వపేజీ తరువాయి)**టమోటా ధర రూ.100కు పైగా పలికింది. మరోవైపు ఉల్లిపాయ రేట్లు సైతం అమాంతం పెరిగిపోయాయి. టమోటా, ఉల్లి.. నువ్వా, నేనా? అన్నట్లు పోటీ పడుతూ ధరలు కొండెక్కాయి.
అయితే తాజాగా టమోటా ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. ఈసారి టమోటా రైతులు అధికంగా పంటలు పడించడం, దిగుబడీ పెరగడంతో టామోటాలు మార్కెట్లకు పోటెత్తాయి. డిమాండ్, సప్లై సూత్రం ప్రకారం.. సప్లై అధికంగా ఉండడంతో డిమాండ్ తగ్గిపోయింది. దీంతో రేట్లు తగ్గుముఖం పట్టాయి. రెండు వారాల క్రితం కిలో టమోటా రూ.20 పలకగా.. పోయిన వారం అది రూ.10కి చేరింది. అయితే తాజాగా కిలో ధర రూ.4కు పడిపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం పండించిన పంట రేటు మరీ ఇంత దారుణంగా పడిపోవడం చూసి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.
కర్నూలు జిల్లా ఆస్పరి, పత్తికొండ మార్కెట్‌లో కిలో టమోటా ధర రూ.4కు చేరింది. గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. దీంతో పత్తికొండ మార్కెట్‌ను అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. కాగా, ధరలు పడిపోయి పెట్టుబడి డబ్బులు కూడా రాకపోవడంతో ఇక వాటిని పారపోయడం తప్ప చేసేదేమీ లేదని టమోటా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.మరోవైపు బర్డ్ ఫ్లూ దెబ్బకు చికెన్, కోడిగుడ్ల రేట్లు సైతం భారీగా పడిపోయాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో లక్షల కోళ్ల మృతిచెందుతుండడంతో చికెన్, కోడిగుడ్లు కొనేందుకు వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఈ నేపథ్యంలోనే కొండెక్కిన రేట్లు దిగివస్తున్నాయి. అయితే నష్టపోతున్నామంటూ వ్యాపారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## దిల్లీ సీఎంగా రేఖాగుప్త ప్రమాణస్వీకారం

**(1వపేజీ తరువాయి)**ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కేంద్ర హోంమంత్రి అమిత్ షాతోపాటు కేంద్రమంత్రులు, ఎన్డీయే కీలక నేతలు, 20 రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరయ్యారు. మరోవైపు సినీ, పారిశ్రామిక రంగాల పలువురు ప్రముఖులు సైతం విచ్చేశారు. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో బీజేపీ కార్యకర్తలు, నేతలు సంబరాల్లో మునిగితేలుతున్నారు.

**మొదటి రోజు నుంచే ఆఫీస్‌కు..**

తొలిసారి అసెంబ్లీకి ఎన్నికై.. ఢిల్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేఖా గుప్తా నేరుగా రంగంలోకి దిగిపోయారు. ప్రమాణ స్వీకారం కార్యక్రమం పూర్తికాగానే ఆమె నేరుగా సెక్రటేరియట్‌కు పయనమయ్యారు. సెక్రటేరియట్‌లోని ముఖ్యమంత్రి చాంబర్‌లోకి ఆమె ప్రవేశించి.. బాధ్యతలు చేపట్టారు. ఆ క్రమంలో కార్యాలయ సిబ్బందితో ఆమె మాట్లాడారు. అనంతరం సాయంత్రం 5.00 గంటలకు యమునా బజార్‌లోని వాసుదేవ్ ఘాట్‌ను ఆమె సందర్శించారు. అనంతరం మళ్లీ ఆమె సెక్రటేరియట్‌కు చేరుకోనున్నారు. ఆ తర్వాత సాయంత్రం 7.00 గంటలకు సీఎం రేఖా గుప్తా అధ్యక్షతన కేబినెట్ సమావేశం ప్రారంభమైంది. ఆమె ప్రమాణ స్వీకారం కార్యక్రమంలోనే ఆరుగురు బీజేపీ ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే.తొలిరోజే ఇలా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేఖా గుప్తా.. అలా సెక్రటేరియట్‌కు వెళ్లి వెళ్లారు. ఆ క్రమంలో ఆమె ముహూర్త బలాన్ని సైతం చూసుకోలేదు. అందరి ముఖ్యమంత్రుల్లాగా కాకుండా.. ఆమె.. సీఎం చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఆ క్రమంలో కార్యాలయ సిబ్బందిని ఆమె స్వయంగా పరిచయం చేసుకున్నారు. ఇక బీజేపీ ఎన్నికల వేళ ఇచ్చిన హామీల అమలు కోసం పారాటం చేస్తామంటూ ఇప్పటికే ఆమ్ ఆద్మీ పార్టీ అగ్రనేతలు ప్రకటించారు.

## రాజలింగమూర్తి హత్యపై సీఎంఓ ఆరా

**(1వపేజీ తరువాయి)**తీసుకొని ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే భూతగాదాయే హత్యకు కారణమని హతుని భార్య నాగవెల్లి సరళ పోలీసులకు ఫిర్యాదు చేశారు.
రాజలింగమూర్తి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం తన స్వగ్రామం జంగేడు శివారు పకీరుగడ్డలో సోదరుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి రాజలింగమూర్తి వెళ్లారు. ద్విచక్ర వాహనంపై భూపాలపల్లికి తిరిగి వస్తుండగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కార్యాలయం ఎదురుగా నలుగురు నుంచి ఐదుగురు గుర్తుతెలియని వ్యక్తులు మంకీ క్యాపులు చరించి అయన్ను చుట్టుముట్టారు. ఒక్కసారిగా కత్తులు, గొడ్డళ్లతో నరికారు.



స్థానికులు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.
ఈ హత్య వెనుక బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హస్తం ఉందని మృతుడి కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ భవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో గండ్ర మాట్లాడుతూ... రాజలింగమూర్తి హత్యపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన హత్యను తీవ్రంగా ఖండిస్తున్నానని చెప్పారు.
రాజలింగమూర్తి హత్యను బీఆర్ఎస్‌కు అంటగట్టేందుకు యత్నిస్తున్నారని గండ్ర మండిపడ్డారు. లింగమూర్తిని తానే చంపించానని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధాకరమని అన్నారు. హత్యారాజకీయాలను బీఆర్ఎస్ ఎప్పుడూ ప్రోత్సహించలేదని చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీ కేసును చట్టపరంగానే ఎదుర్కొంటామని తెలిపారు. ఈ హత్యతో తనకు కానీ, బీఆర్ఎస్ కు కానీ ఎలాంటి సంబంధం లేదని... హత్యపై సీబీఐతో లేదా సీఐడీతో విచారణ జరిపించి, దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

## ఆపరేషన్ షురూ!

**(1వపేజీ తరువాయి)**వ్యూహం మార్చు కున్నారని అంటున్నారు. బీఆర్ఎస్ నుంచి రావాల్సిన ఎమ్మెల్యే పేర్లను రెడీ చేయాలని తన అనుయాయులను సీఎం ఆదేశించారని గాంధీభవన్‌లో టాక్ వినిపిస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసిన వెంటనే ఈ ఆపరేషన్ ను స్టార్ట్ చేయాలని సీఎం నిర్ణయించారంటున్నారు. స్థానిక ఎన్నికలకు ముందే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకోవాలని భావిస్తున్నారు. అయితే ఒకరో ఇద్దరో కాకుండా ఏకంగా 16 మందిని ఒకేసారి కాంగ్రెస్లోకి తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న పది మంది.. కొత్తగా వచ్చే 16 మందితో కలిపితే బీఆర్ఎస్ కు ప్రతిపక్ష హోదా తీసేయవచ్చిని అంతేకాకుండా ఆ పార్టీ శాసనసభాపక్ష హోదాను లాగేయడం ద్వారా వలస వచ్చిన ఎమ్మెల్యేలు అందరినీ న్యాయ వివాదాల నుంచి రక్షించవచ్చని సీఎం భావిస్తున్నారని అంటున్నారు. ప్రస్తుతం పది మంది జంపింగ్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ వేసిన పిటిషన్ పై సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతుంది. త్వరలో ఈ వివాదంపై తీర్పు వెలువడే అవకాశం ఉంది. బీఆర్ఎస్ శాసనసభాపక్షం విలీనం చేయడం ద్వారా ఎమ్మెల్యేలను చట్టం ద్వారా రక్షణ కల్పించవచ్చని న్యాయ నిపుణుల సలహాతో సీఎం పావులు కదుపుతున్నట్లు చెబుతున్నారు. తాను అనుకున్నట్లు బీఆర్ఎస్ నుంచి 16 మంది ఎమ్మెల్యేలు వస్తే.. పార్టీలో గొణుగుతున్న నేతల నోళ్లు మూయించొచ్చని సీఎం వ్యూహంగా చెబుతున్నారు. మొత్తానికి ఆపరేషన్ - 16 దిశగా వేస్తున్న అడుగులు బీఆర్ఎస్ పార్టీని టచ్ చేస్తాయా? అనే ఆసక్తిని పెంచుతున్నాయి.

## లంచావతారాలు

**(1వపేజీ తరువాయి)** రైతు వద్ద లంచం డిమాండ్ చేసిన అధికారి ఓ రైతు వద్ద లంచం తీసుకుంటూ మరో అధికారి అవినీతి నిరోధక శాఖకు చిక్కాడు. ఆరుగాలం కష్టపడి పంటను పండించే రైతును లంచం కోసం వేధించిన సదరు అధికారిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల వ్యవసాయ అధికారి డి శాంతన్ కుమార్.. పత్తి పంటను విక్రయించడానికి అవసరమైన కూపన్ల జారీ కోసం ఓ రైతు నుంచి రూ. 30 వేలు లంచం డిమాండ్ చేశాడు. ప్రభుత్వ అధికారిగా తను చేయాల్సిన బాధ్యతను మరిచి రైతు నుంచి లంచం డిమాండ్ చేయడంతో బాధిత రైతు ఏసీబీని ఆశ్రయించారు. ఈ క్రమంలో ఈ డబ్బు తీసుకుంటుండగా.. అధికారి శాంతన్ కుమార్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కాగా, ఎవరైనా ప్రభుత్వ అధికారి లంచం అడిగితే.. 1064కు డయల్ చేయండి అని ఏసీబీ అధికారులు ప్రజలకు సూచించారు.

## తెలంగాణలో 8 మంది

**(1వపేజీ తరువాయి)** పత్రికను అందించారు.
పీఏ కూతురు వివాహానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పీఏ కూతురు వివాహానికి హాజరయ్యారు. రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ మున్సిపాలిటీ మన్నెగూడలో బీఎంఆర్ సార్థ గార్డెన్స్‌లో గురువారం జరిగిన ఈ వివాహ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా హాజరయ్యారు. సీఎం పర్సనల్ అసిస్టెంట్ పురుషోత్తంరెడ్డి కూతురు వివాహానికి హాజరై నూతన వధూవరులను ముఖ్యమంత్రి దంపతులు ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకకు ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, బుయ్యని మనోహర్ రెడ్డి, చిలుక మధుసూదన్ రెడ్డి సహా పలువురు నాయకులు వివాహానికి హాజరయ్యారు. మంచి మనసు చాటుకున్న సీఎం రేవంత్ సీఎం రేవంత్ రెడ్డి తన మంచి మనసును చాటుకున్నారు. కండరాల వ్యాధితో బాధపడుతూ వైద్యం చేయించుకోలేకపోతున్న నిరుపేద యువకుడు గూళ్ల రాకేష్ గురించి తెలుసుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చలించిపోయారు. తక్షణమే రాకేష్‌కు కావాల్సిన వైద్య సాయం అందించాలని అధికారులను ఆదేశించారు.

## శంకర్‌కు ఈడీ భారీ షాక్

**(1వపేజీ తరువాయి)**కాపీరైట్ చట్టంలోని సెక్షన్ 63ని ఉల్లంఘించినట్లు ఆ వివరాల ఆధారంగా ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని ఈడీ వెల్లడించింది. కాగా, తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా రూపొందిన రోబో సినిమా 2010లో విడుదలై భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. ప్రపంచ వ్యాప్తంగా సుమారు రూ. 300 కోట్ల వసూళ్లను రాబట్టింది. ఈ చిత్రానికి శంకర్ పారితోషికంగా రూ. 15 కోట్లు అందినట్లు కోలీవుడ్ మీడియాలో వార్తలు వచ్చాయి.

## ఆస్పత్రిలో చేరిన సోనియా

**(1వపేజీ తరువాయి)**సోనియా గాంధీ ఆరోగ్యం అకస్మాత్తుగా క్షీణించడంతో ఆమెను సర్ గంగారాం ఆస్పత్రికి తరలించారు. పీటీఐ కథనం ప్రకారం.. ప్రస్తుతం సోనియా గాంధీ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉంది. 'ఉదర సంబంధిత సమస్య కారణంగా ఆమె ఆసుపత్రిలో చేర్చారు. అయితే, పెద్దగా ఆందోళన చెందాల్సిన విషయం ఏమీ లేదు. శుక్రవారం ఉదయం నాటికి ఆయన ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉంది. ఆమె డాక్టర్ సమీరాన్ నంది సంరక్షణలో ఉన్నారు' అని సర్ గంగా రామ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ బోర్డు చైర్మన్ డాక్టర్ అజయ్ స్వరూప్ వెల్లడించారు. గతంలో అనారోగ్య కారణాల వల్ల 2024 డిసెంబర్ నెలలో కర్ణాటకలోని బెల్గాంలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి సోనియా గాంధీ హాజరుకాలేదు. గత సెప్టెంబర్ నెలలో కూడా సోనియా గాంధీ అనారోగ్య కారణంగా సర్ గంగారాం ఆస్పత్రిలో చేరారు. ఆ తర్వాత పూర్తిగా కోలుకుని రాజకీయ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నారు. సోనియా గాంధీ చివరిసారిగా ఫిబ్రవరి 13న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా బహిరంగంగా కనిపించారు.

## నిందితులు మరణించే వరకు కఠిన కారాగార శిక్ష!

**విజయవాడ-నవభూమి:** తొమ్మిదో తరగతి బాలికను కిడ్నాప్ చేసి, సామూహిక అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితులకు విజయవాడ పోక్సో కోర్టు మరణించే వరకు కఠిన కారాగార శిక్ష విధించింది.విజయవాడ పటమట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ బాలిక.. తల్లిదండ్రులు చనిపోవడంతో తాత వద్ద నివసిస్తోంది. ఇంటికి దగ్గర్లోని స్కూల్లో 8వ తరగతి చదువుతున్న సమయంలో అదే ప్రాంతానికి చెందిన సాయి పరిచయమై తరచూ ఫోన్లో మాట్లాడుతుండేవాడు. తర్వాత బాలిక కృష్ణా జిల్లా పెదన వెళ్లిపోయి అక్కడ 9వ తరగతిలో చేరింది. 2022 మేలో సెలవులకు బాలిక తాత ఇంటికి రాగా, రాత్రి సమయంలో సాయి వచ్చి బాలికను బయటికి పిలిచి బైక్‌పై దగ్గరలోని ఓ పాఠశాలకు తీసుకెళ్లి గదిలో అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం ఆమెను ఇంటి వద్ద వదిలి వెళ్లిన సాయి మళ్లీ రెండ్రోజుల తర్వాత వచ్చి బయటికి రావాలని పిలిచాడు. ఆమె నిరాకరించడంతో తన వద్ద ఇద్దరం కలిసిన ఫొటోలు ఉన్నాయని, రాకుంటే అందరికీ చూపిస్తానని బెదిరించాడు. దీంతో బాలిక బయటికి రాగా, మళ్లీ పాఠశాల గదికి తీసుకెళ్లాడు. అప్పటికే ఉన్న మరో ఇద్దరితో కలిసి బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డాడు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 హైదరాబాద్ శుక్రవారం 21 । ఫిబ్రవరి । 2025




## మన తెలుగు హీరోయిన్ ఇలా మారిపోయిందేంటి? ఎవరో గుర్తు పట్టారా?



నల్ల లుంగీ, చొక్కాతో కాలు పై కాలు వేసుకొని స్టైల్ గా కళ్లజోడు పెట్టుకొని సోఫాలో డైనమిక్ గా మాస్ లుక్ తో కనిపిస్తున్నదెవరో గుర్తు పట్టారా? ఆమె టాలీవుడ్ క్రేజీ హీరోయిన్. తెలుగుతో పాటు తమిళ్ సినిమాల్లోనూ వరుసగా సినిమాలు చేస్తోంది. ఇప్పటివరకు దాదాపు లవ్ స్టోరీలు, ఫ్యామిలీ ఎంటర్ టైనర్లలోనే నటించింది. ఎక్కువగా క్లాస్, క్యూట్ పాత్రలతోనే మెప్పించింది. అయితే ఇప్పుడు తొలిసారి ఓ ఊర మాస్ పాత్రలో కనిపించుంది. పై ఫొటో అదే. ప్రస్తుతం ఈ ఫొటో నెట్టింట వైరలవుతోంది. దీనిని చూసిన చాలామంది ఆశ్చర్యపోతున్నారు. మొదట ఇందులో ఉన్నదెవరో చాలామంది గుర్తు పట్టలేకపోయారు. ఆ తర్వాత తెలుసుకుని షాక్ అయ్యారు. మరి ఈ ముద్దుగుమ్మ ఎవరో గుర్తు పట్టారా? ఈ బ్యూటీ మరెవరో కాదు మన ఈ రోజుల్లో, బస్ స్టాప్, జాంబిరెడ్డి సినిమాలతో మెప్పించిన హీరోయిన్ ఆనంది. ప్రస్తుతం ఆమె శివంగి అనే సినిమాలో నటిస్తోంది. తాజాగా ఈ సినిమా నుంచి ఆనంది పాత్ర ఫస్ట్ లుక్ పోస్టర్ ని రివీల్ చేశారు మేకర్స్.దేవరాజ్ భరణి ధరణ్ తెరకెక్కిస్తోన్న శివంగి సినిమాలో ఆనందితో పాటు వరలక్ష్మి శరత్‌కుమార్ మరో ముఖ్య పాత్రలో కనిపించనుంది. ఫస్ట్ కాపీ మూవీస్ బ్యానర్ పై నరేష్ బాబు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. లేడీ ఓరియంటెడ్ మూవీగా ఈ సినిమా తెరకెక్కనుంది. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ పూర్తిచేసుకొని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. మార్చి 7న ఈ శివంగి సినిమా రిలీజ్ కానున్నట్లు ప్రకటించారు.

## వైరల్ అవుతున్నఢిల్లీ సీఎం 30 ఏళ్ల నాటి ఫొటో.. షేర్ చేసిన కాంగ్రెస్ నేత..



**న్యూఢిల్లీ-నవభూమి:**ఎన్నికల ఫలితాల వెలువడిన 11 రోజుల తర్వాత సస్పెన్స్‌కు తెరదించుతూ నిన్న ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తాను ప్రకటించింది బీజేపీ అధిష్ఠానం. దీంతో రేఖాగుప్తా ఎవరా అన్న చర్చ అందరిలో మొదలైంది. ఈ క్రమంలోనే కాంగ్రెస్ నేత అల్కా లాంబా కొత్త ఢిల్లీ సీఎంకు శుభాకాంక్షలు చెప్తూ రేఖా గుప్తా 30 ఏళ్ల క్రితం నాటి ఫొటో సోషల్ మీడియాలో షేర్ చేశారు. విద్యార్థి నేతలుగా ఇద్దరు కలిసి ప్రమాణస్వీకారం చేస్తున్న ఆ పాత ఫొటో ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతోంది.

**30 ఏళ్ల నాటి చిరస్మరణీయ క్షణాలవి : అల్కా లాంబా**

రేఖా గుప్తాను ముఖ్యమంత్రిగా ప్రకటించిన వెంటనే, అల్కా లాంబా సోషల్ మీడియాలో ఒక చిత్రాన్ని పోస్ట్ చేశారు. అల్కా లాంబా, రేఖ గుప్తా కలిసి ఉన్న ఈ ఫోటో దాదాపు 30 సంవత్సరాల నాటిది. నుంచి ఢిల్లీ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షురాలిగా అల్క, నుంచి ప్రధాన కార్యదర్శిగా రేఖ ఎన్నికైన సందర్భంలో తీసుకున్న ఫొటో. ఈ విషయాన్ని గుర్తుచేసుకుంటూ 'రేఖా గుప్తా, నేను కలిసి ప్రమాణస్వీకారం చేసిన 1995 నాటి చిరస్మరణీయ ఫొటో ఇది. ఢిల్లీకి నాల్గవ మహిళా ముఖ్యమంత్రిగా ఎంపికైనందుకు రేఖ గుప్తాకు అభినందనలు శుభాకాంక్షలు. ఇకనుంచైనా యమునా తల్లి పరిశుభ్రంగా ఉంటుందని.. కుమార్తెలు సురక్షితంగా ఉంటారని ఢిల్లీ వాసులను ఆశిస్తున్నారు' అని అల్కా పోస్ట్‌లో రాశారు.

ఢిల్లీ సీఎం రేఖా గుప్తా నేపథ్యం ఏంటి..1992లో విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లోకి అడుగుపెట్టారు ఢిల్లీ నూతన ముఖ్యమంత్రి రేఖా గుప్తా. తరపున 1996-97 మధ్య అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. తర్వాత కూడా ప్రజా సమస్యలపై గ్రౌండ్ లెవెల్లో చురుగ్గా ఉండేవారు. 2007లో నార్త్ పితంపురా కౌన్సిలర్‌గా ఆ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు, సౌకర్యాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. 2025 ఎన్నికల్లో తొలిసారి షాలిమార్ బాగ్ ఎమ్మెల్యేగా ఆప్ అభ్యర్థి బందన కుమారిపై 29 ఓట్ల స్వల్ప తేడా గెలిచిన రేఖాకు.. ఢిల్లీ సీఎంగా అవకాశం ఇచ్చింది కాషాయపార్టీ. సుష్మా స్వరాజ్, షీలా దీక్షిత్, ఆతిషీ తర్వాత ఢిల్లీ 4వ మహిళా సీఎం రేఖా గుప్తానే. ఈమె భర్త మనీష్ గుప్తా కూడా బీజేపీ పార్టీ సభ్యుడే.

## వేసవి సెలవులు.. రైల్వే రిజర్వేషన్ ప్రారంభం



**చెన్నై-నవభూమి:** వేసవి సెలవుల రైల్వే రిజర్వేషన్ ప్రారంభమైంది. పాఠశాలలు, కళాశాలలకు వార్షిక పరీక్షలు ముగిసి ఏప్రిల్ మూడో వారం నుంచి సెలవులు ప్రారంభం కానున్నాయి. సెలవుల్లో అధిక శాతం మంది తమ తమ స్వగ్రామాలకు వెళుతుంటారు. ఈ నేపథ్యంలో, గతంలో రైళ్లలో ప్రయాణించేందుకు 120 రోజుల ముందుగా రిజర్వేషన్ చేసుకొనే సదుపాయం ఉండగా, ఆ గడువును 60 రోజులకు తగ్గించారు.

దీంతో, ఏప్రిల్‌లో ప్ర యాణానికి రిజర్వేషన్ ప్రారంభమైంది. దక్షిణ జిల్లాలైన తిరునల్వేలి, కన్నియాకుమారి, పాండ్యన్ ఆనందపురం, గురువాయూర్ తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఏప్రిల్ రెండవ వారంలో ప్రయాణించేందుకు అధిక శాతం మంది రిజర్వేషన్ చేసుకుంటున్నారు. కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఇప్పటికే సెకండ్ క్లాస్ రిజర్వేషన్ వెయిటింగ్ లిస్ట్‌కు చేరుకోగా, ఏసీ బోగీల్లో ఖాళీలున్నట్లు అధికారులు తెలిపారు.

## ఢిల్లీ సీఎంగా రేఖా గుప్తా ప్రమాణ స్వీకారం..



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ రాజధాని ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా ప్రమాణ స్వీకారం చేశారు. ఢిల్లీ రామ్ లీలా మైదానంలో రేఖా గుప్తాతో లెఫ్టినెంట్ గవర్నర్ ప్రమాణం చేయించారు. డిప్యూటీ సీఎంగా పర్వేశ్ వర్మ ప్రమాణ స్వీకారం చేయగా.. ఆయనతోపాటు మరో ఐదుగురు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యేలు ఆశిష్ సూద్, మంజిన్దర్ సింగ్ సిర్సా, రవీంద్ర రాజ్, కపిల్ మిశ్రా, పంకజ్ సింగ్ మంత్రులుగా ప్రమాణం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కేంద్ర హెూంమంత్రి అమిత్ షాతోపాటు కేంద్రమంత్రులు, ఎన్డీయే కీలక నేతలు, 20 రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరయ్యారు. మరోవైపు సినీ, పారిశ్రామిక రంగాల పలువురు ప్రముఖులు సైతం విచ్చేశారు. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో బీజేపీ కార్యకర్తలు, నేతలు సంబరాల్లో మునిగితేలుతున్నారు.

## అబ్బో.. మాజీ సీఎం భలేమాట అన్నారే.. ఆయన ఏమన్నారో తెలిస్తే..

**చెన్నై-నవభూమి:**పార్టీ పట్ల అచంచల విశ్వాసమున్న నేతలు, కార్యకర్తలంతా తన వెంటే వున్నారని అన్నాడీఎంకే బహిష్కృత నేత, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం((ఓపీఎస్) వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన సేలంలో మీడియాతో మాట్లాడుతూ.. పార్టీ నేతలంతా కలిసి పని చేస్తేనే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే విజయం సాధిస్తుందని, లేనిపక్షంలో మళ్లీ పరాజయం తప్పదన్నారు.పార్టీలో కలహాల వల్లే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు చీలిపోయాయని, అదే పార్టీ ఓటమికి కారణమైందని విశ్లేషించారు. ఇటీవల పార్టీ అధినాయకత్వం పట్ల అసంతృప్తి వ్యక్తం చేసిన మాజీ మంత్రి కేఏ సెంగోట్టయ్యన్ తనలానే ఆది నుంచి పార్టీ కోసం పని చేసిన వ్యక్తి అని కితాబునిచ్చారు. మరో మాజీ మంత్రి ఉదయమార్ తనపై చేస్తున్న విమర్శలకు సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదని ఓపీఎస్ పేర్కొన్నారు.

# 30 ఏళ్ల కిందటి కేసులో దోషిగా తేలిన వ్యవసాయశాఖ మంత్రి



**ముంబై- నవభూమి:**మహారాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి మాణిక్ రావ్ కొకాటే, ఆయన సోదరుడు సునీల్ కొటాటే.. 30 ఏళ్ల నాటి ఓ మోసం కేసులో దోషిగా తేలారు. ఈక్రమంలోనే నాసిక్ జిల్లా కోర్టు వీరిద్దరికి రెండేళ్ల జైలు శిక్ష వేసింది. అలాగే 50 వేల రూపాయల జరిమానా కూడా విధించింది. మరి 30 ఏళ్ల క్రితం అన్నా తమ్ముళ్లు ఇద్దరూ కలిసి ఏం నేరం చేశారు, ఎలా ఈ కేసులో ఇరుక్కున్నారో మనం ఇప్పుడు తెలుసుకుందాం. 1955లో నిర్మాణ్ వ్యూ అపార్ట్‌మెంట్‌లో ముఖ్యమంత్రి కోటా కింద కొకాటే సోదరులు రెండు ఫ్లాట్‌లను కొనుగోలు చేశారు. అయితే ఇందుకోసం నకిలీ డాక్యుమెంట్లు సమర్పించడమే కాకుండా.. వారికి వస్తున్న ఆదాయాన్ని చాలా తక్కువగా చూపించారని ఆరోపణలు వచ్చాయి. అసలు తమకు ఇళ్లే లేవని, ఎలాంటి ఆదాయమూ లేదంటూ వారు ఫ్లాట్లు పొందారని చాలా మంది గొడవ చేశారు. దీంతో మాజీ మంత్రి తుకారాం ధిఘోలే అదే ఏడాది కొకాటే సోదరులు అయిన మాణిక్ రావ్, సునీల్‌లపై కేసు పెట్టారు. ఈక్రమంలోనే కొకాటే సోదరులపై సెక్షన్లు 420(మోసం), 465(నకలీ పత్రాలు తయారు చేయడం), 471, 474 (సత్యాన్ని దాచడం) వంటి వాటి కింద కేసు నమోదు అయింది. ఆపై అధికారులు దర్యాప్తు చేపట్టగా... చాలా ఏళ్లుగా ఈ కేసు కొనసాగుతూనే వస్తోంది. అయితే గురువారం రోజు నాసిక్ జిల్లా కోర్టు విచారణ చేపట్టింది. ఈక్రమంలోనే అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పూనమ్ ఘోట్కే మాట్లాడుతూ.. ఈ కేసులో మొత్తం 10 మంది సాక్షులను విచారించామని చెప్పారు. కొకాటే సోదరులు నిజంగానే 1997లో ముఖ్యమంత్రి నిధి నుంచి 10 శాతం రిజర్వేషన్ కోటా కింద తప్పుడు పత్రాలతో ఫ్లాట్లు పొందారని వివరించారు. ఇలా ఇరువురి తరఫు వాదనలు విన్న న్యాయస్థానం కొకాటే సోదరులను దోషులుగా తేల్చింది. అన్నాతమ్ముళ్లిద్దరికీ రెండేళ్ల జైలు శిక్షతో పాటు 50 వేల రూపాయల జరిమానా విధించింది. అంతేకాకుండా ఎఫ్ఐఆర్ లో పేర్కొన్న మరో ఇద్దరిని నిర్దోషులుగా విడుదల చేసింది. అయితే శిక్ష పడిన వెంటనే వీరికి బెయిల్ మంజూరు కాగా.. కోర్టు ఉత్తర్వులపై అప్పీల్‌కు వెళ్తున్నట్లు మంత్రి మాణిక్ రావ్ కొటాటే తెలిపారు.మరోవైపు మంత్రి మద్దతు దారులు స్పందిస్తూ.. కోర్టు తీర్పుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కొకాటే సోదరులపై రాజకీయ నాయకులు ప్రతీకార చర్యలకు పాల్పడుతున్నారని.. అందులో భాగంగానే వీరికి శిక్ష పడిందని ఆరోపిస్తున్నారు. ఈ తీర్పుపై తమ మంత్రి త్వరోలనే హైకోర్టుకు వెళ్తారని కూడా చెప్పుకొచ్చారు. చూడాలి మరి ముందు ముందు ఏం జరగనుంది అనేది.

## మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ప్రాణాలకు ముప్పు?



**ముంబై- నవభూమి:**మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే ప్రాణాలకు ముప్పు ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆయన ప్రయాణించే కారులో బాంబు పెట్టామని.. దాన్ని పేల్చేస్తామంటూ గుర్తు తెలియని వ్యక్తులు పోలీసులకు మెయిల్ చేశారు. ఈ వియం గుర్తించిన వెంటనే ఖాకీలు ఏక్‌నాథ్ షిండేను కలిసి ఆయన కారులో సోదాలు నిర్వహించారు. అంతేకాకుండా ఆయనకు ముప్పు ఉన్నందున ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. మరి పోలీసులకు ఆ కారులో బాంబు దొరికిందా లేదా తెలియాలంటే మీరి కథ చదివేయాల్సిందే.మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రాణాలు తీస్తామంటూ.. ముంబయిలోని గోరెగావ్ పోలీసులకు గురువారం రోజు మధ్యాహ్నం ఓ మెయిల్ వచ్చింది. ఆయన కారులో బాంబు పెట్టామని.. దాన్ని పేల్చబోతున్నట్లు అందులో వివరించారు. ఈ ఒక్క స్టేషన్‌కే కాకుండా జేజే మార్గ్ పోలీస్ స్టేషన్, రాష్ట్ర సచివాలయానికి కూడా ఇదే మెయిల్ పంపారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు డిప్యూటీ సీఎం ఎక్కడున్నారో తెలుసుకని మరీ పరుగులు పెట్టారు. ఆయనకు అసలు విషయాన్ని చెప్పి.. కారులో తనిఖీలు చేపట్టారు.బాంబు స్క్వాడ్ల సాయంతో ఈ సోదాలు నిర్వహించగా అందులో ఏమీ దొరకలేదు. దీంతో పోలీసులు ఆయనకు సంబంధించిన అన్ని కార్లలోనే తనిఖీలు చేపట్టారు. ఎందులో కూడా బాంబు దొరక్కపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కానీ ఆపై దర్యాప్తు చేపట్టగా ఇదంతా బూటకం అని తెలిసింది. ఈక్రమంలోనే ఆ మెయిల్ చేసింది ఎవరో తెలుసుకునే పనిలో పడ్డారు పోలీసులు.ఇదంతా ఇలా ఉండగా.. ఈ మధ్య కాలంలో దేశ వ్యాప్తంగా బాంబు బెదిరింపు మెయిల్స్ ఎక్కువ అవుతున్నాయి. గతంలో దేశరాజధాని ఢిల్లీ పాఠశాలలకు మెయిల్స్ రాగా ఈమధ్య విమానాశ్రయాలు, బ్యాంకులు, రాజకీయల నాయకులకు కూడా వస్తున్నాయి. చూడాలి మరి వీటన్నిటినీ ఆపేందుకు పోలీసులు ఏ

## 24న పీఎం కిసాన్‌నిధులు




**ప్రయాగ్‌రాజ్-నవభూమి:**రైతులకు వ్యవసాయంలో పెట్టుబడి సాయం అందించే ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం అమలు చేస్తోన్న పీఎం కిసాన్ పథకం.. 19వ విడత నిధుల విడుదలకు తేదీ ఖరారైంది. ఈ నెల 24న రూ. 2వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. బిహార్‌లోని భాగల్పూర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. 19వ విడతలో 9.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం కలగనున్నట్లు వారు తెలిపారు.

## ప్రైవేట్ పీఎస్ఎల్వీ రాకెట్‌తో ఇస్రో తొలి ప్రయోగం



**సూళ్లూరుపేట-నవభూమి:** హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హాల్), ఎల్ అండ్‌టీ సంయుక్తంగా అభివృద్ధి చేసిన పీఎసఎల్వీ రాకెట్ ద్వారా టెక్నాలజీ డిమాన్‌స్ట్రేషన్ శాటిలైట్-1 (టీడీఎస్-1) ప్రయోగం చేపట్టేందుకు ఇస్రో సన్నాహాలు చేస్తోంది. 5 రాకెట్ల తయారీ ఒప్పందం కింద ప్రైవేటు రంగం తయారు చేసిన తొలి పీఎసఎల్వీ రాకెట్ ద్వారా ఈ ప్రయోగాన్ని నిర్వహిస్తున్నట్టు ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. ఈ ఏడాది మూడో త్రైమాసికంలో టీడీఎస్-1 ప్రయో గం ఉంటు ందని చెప్పారు. ప్రైవేటు రంగం తయారు చేసిన పీఎసఎల్వీ రాకెట్ ప్రయోగాన్ని చేపట్టడం ఇస్రోకు ఇదే తొలిసారి. ఈ ప్రయోగాన్ని దేశంలో అభివృద్ధి చెందుతున్న ప్రైవేట్ అంతరిక్ష రంగానికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఈ మార్పు ద్వారా ఇస్రో తన పనిభారాన్ని తగ్గించుకోవడమే కాకుండా.. ప్రైవేట్ కంపెనీలకు అవకాశాలను ఇవ్వనుంది. టీడీఎస్-1 ఉపగ్రహ ప్రయోగంలో 35 నూతన టెక్నాలజీలను పరీక్షించనున్నారు. దీన్ని భూమికి 747 కి.మీ ఎత్తులోని సూర్య-సమకాలీన కక్ష్యలోకి చేరవేస్తారు. అనంతరం ఈ ఉపగ్రహం 12 రోజులకోసారి భూభాగాన్ని మొత్తం పరిశీలించి కీలక డేటాను అందిస్తుంది.

**ట్రంప్‌నకు గట్టి దెబ్బ.. కోడిగుడ్లు దొరక్క అమెరికన్ల అవస్థలు..!**

అమెరికా ప్రస్తుతం గుడ్ల కొరతను ఎదుర్కొంటోంది. ధర ఎంతగా పెరిగిందంటే ప్రజలు డజనుకు రూ. 860 చెల్లించాల్సి వస్తోంది. ఈ సంక్షోభం మధ్య, టర్కీ అమెరికాకు 15,000 టన్నుల గుడ్లు సరఫరా చేయాలని నిర్ణయించింది. మొత్తం 700 కంటైనర్ల గుడ్లను అమెరికాకు పంపించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే సూపర్ మార్కెట్స్, రెస్టారెంట్లు కోడ్లపై ఆంక్షలు విధిస్తున్నారు.

## నెట్టింట కుంభమేళా మహిళల స్నానాలు, బట్టలు మార్చుకునే వీడియోలు.. రూ.3 వేలకు విక్రయం



**ప్రయాగ్‌రాజ్-నవభూమి:** ఉత్తర్‌ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లోని మహా కుంభ్‌నగర్‌లో గంగా, యమునా, సరస్వతి నదుల కలిసే త్రివేణి సంగమం వద్ద కోట్లాది మంది భక్తులు పుణ్యస్నానాలు చేస్తున్నారు. మరో 6 రోజుల్లో మహా కుంభమేళా ముగియనుండగా.. ఇప్పటికే 55 కోట్లకుపైగా భక్తులు పుణ్యస్నానాలు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఇక ఈ మహా కుంభమేళా నిర్వహణ కారణంగా రూ.1700 కోట్లు ఖర్చు చేస్తే.. ఏకంగా రూ.3 లక్షల కోట్ల ఆదాయం సమకూరినట్లు ఇటీవలె ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. ఇక ప్రభుత్వానికి మాత్రమే కాకుండా ప్రైవేటు వ్యక్తులు కూడా ఈ మహా కుంభమేళా సందర్భంగా ఏదో ఒక పని చేసుకుని సంపాదిస్తున్నారు. అయితే కొందరు అక్రమ మార్గాల్లో డబ్బు సంపాదనకు అలవాటు పడ్డారు. కుంభమేళాకు వచ్చే మహిళల వీడియోలు, ఫోటోలతో సొమ్ము చేసుకుంటున్నారు. మహా కుంభమేళా సందర్భంగా.. త్రివేణి సంగమంలో స్నానం చేసే మహిళా భక్తులు, బట్టలు మార్చుకునే వీడియోలు, ఫోటోలను తీసి.. వాటిని సోషల్ మీడియాలో విక్రయిస్తున్నారు. ఈ క్రమంలోనే టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో గ్రూపులు క్రియేట్ చేసి అమ్ముకుంటున్నారు. కొన్ని ఛానెళ్లలో చేరేందుకు రూ.1999 నుంచి రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఆ డబ్బు కట్టిన వారికే ఈ గ్రూపుల్లోని వీడియోలను యాక్సెస్ చేసే అవకాశం కల్పిస్తున్నారు. అయితే దీనిపై ఇప్పటికే ఫిబ్రవరి 17వ తేదీన తొలికేసు నమోదైంది. ఆ తర్వాత ఫిబ్రవరి 19వ తేదీన రెండో కేసు నమోదు చేశారు.

సోషల్ మీడియా మానిటరింగ్ టీమ్ ఇలాంటి ఫోటోలు, వీడియోలను గుర్తించగా.. దీనిపై కోత్వాల్ పోలీస్ స్టేషన్‌లో కేసులు పెట్టారు. ఈ క్రమంలోనే ఆ వీడియోలు అప్‌లోడ్ చేసిన అకౌంట్లను గుర్తించేందుకు సమాచారం ఇవ్వాలని మెటా సంస్థను కోరినట్లు పోలీసులు వెల్లడించారు. మహా కుంభమేళాకు సంబంధించి అభ్యంతరకరమైన, తప్పుడు సమాచారాన్ని వైరల్ చేస్తే సోషల్ మీడియాపై కఠిన చర్యలు తప్పవని యూపీ పోలీసులు తీవ్ర హెచ్చరికలు చేస్తున్నారు.మరోవైపు.. జనవరి 13వ తేదీన ప్రారంభమైన ఈ మహా కుంభమేళా ఫిబ్రవరి 26వ తేదీన మహా శివరాత్రితో ముగియనుంది. ఇప్పటికే 55 కోట్లకు పైగా భక్తులు ప్రయాగ రాజ్‌కు తరలివచ్చి.. పుణ్యస్నానాలు చేసినట్లు యూపీ అధికార వర్గాలు వెల్లడించాయి. ఇక మహా కుంభమేళాలో 6 రాజస్నానాలు ఉండగా.. ఇప్పటికే 5 పూర్తి కాగా.. ఈనెల 26వ తేదీన చివరి రాజస్నానం జరగనుంది. ఇక మహా కుంభమేళా పూర్తయ్యేనాటికి భక్తుల సంఖ్య 60 కోట్లు దాటుతుందని యూపీ సర్కార్ అంచనా వేస్తోంది.

### కుంభమేళా ట్రాఫిక్‌ను క్యాష్ చేసుకుంటున్న విద్యార్థులు..

# బైక్‌తో భారీగా సంపాదన!





**ప్రయాగ్‌రాజ్-నవభూమి:**ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతోన్న మహాకుంభమేళా ముగింపు దశకు చేరుకున్నా భక్తులు రద్దీ మాత్రం కొనసాగుతోంది. త్రివేణి సంగమంలో పుణ్యస్నానాల కోసం వస్తున్న భక్తులతో ప్రయాగ్‌రాజ్ కిక్కిరిసిపోతోంది. దీంతో రైల్వే స్టేషన్, ఎయిర్‌పోర్ట్ నుంచి సంగమ ప్రాంతానికి చేరుకోవాలంటే చుక్కలు కనిపిస్తున్నాయి. గంటల కొద్దీ ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నారు. కుంభమేళా ప్రాంతంలోకి ట్యాక్సీ, ఆటో సేవలు నిలిచిపోయాయి. ఈ ప్రతికూల పరిస్థితినే స్థానిక యుత తమకు అనుకూలంగా మార్చుకుని.. ఉపాధి పొందుతున్నారు. భక్తులకు ట్రాఫిక్ కష్టాలు తప్పేలా కాలేజీ విద్యార్థులు స్కూటర్లు, బైక్లతో ట్యాక్సీ సేవలు అందిస్తున్నారు.కేవలం అబ్బాయిలే కాదు అమ్మాయిలు కూడా బైక్‌లతో భక్తులను సంగమ ప్రాంతానికి తరలిస్తూ తాత్కాలిక ఉపాధి పొందుతున్నారు. ఒక రైడ్కు రూ.100 నుంచి రూ.1000 వరకు ఛార్జ్ చేస్తున్నారు. బైక్ ట్యాక్సీ నడుపుతోన్న పోస్ట్‌గ్రాడ్యుయేట్ స్టూడెంట్ పీటర్ మాట్లాడుతూ.. చాలా మంది కాలేజీ స్టూడెంట్లు బైక్ ట్యాక్సీ నడుపుతున్నారు. రోజుకు రూ.3000- రూ.5000 వరకు సంపాదిస్తున్నారు" అని చెప్పాడు. కుంభమేళా ముగిసిన తర్వాత మళ్లీ ఉద్యోగ ప్రయత్నాలు మొదలు పెడతానని తెలిపాడు.విజయ్ అనే లా విద్యార్థి మాట్లాడుతూ.. కుంభమేళాకు వచ్చిన యాత్రికులు గంటల తరబడి ట్రాఫిక్లో చిక్కుకుపోవడం చూసి వారికి సాయం చేయాలని నిర్ణయించుకున్నానని అన్నాడు. అయితే, కేవలం విద్యార్థులే కాదు, కొంతమంది ఉగ్యోగులు కూడా బైక్ ట్యాక్సీలు నడుపుతూ అదనపు ఆదాయం పొందుతున్నారు. సెలవుపై వచ్చిన లడఖ్‌లో విధులు నిర్వహిస్తోన్న ఆర్మీ జవాన్ లాల్ బహదూర్ కూడా ఈ బైక్ ట్యాక్సీ నడుపుతున్నాడు. ఇది తనకు, భక్తులకు లాభదాయకంగా ఉందని పేర్కొన్నారు. కుంభమేళాకు ఢిల్లీ నుంచి వచ్చిన ప్రభుత్వ ఉద్యోగి పూనమ్.. సంగమ ప్రదేశానికి బైక్ ట్యాక్సీ కోసం రూ.5000 చెల్లించానని తెలిపారు. రద్దీ ఎక్కువగా ఉంది కానీ త్రివేణి సంగమంలో స్నానం చేసి అదే రోజు తాను తిరిగి ఢిల్లీకి వెళ్లడానికి బైక్ ట్యాక్సీయే కారణమని అన్నారు. కొందరు ఈ సేవలను స్వాగతిస్తుంటే.. మరికొందరు మాత్రం అధిక ఛార్జీల వసూలు చేస్తున్నారని విమర్శిస్తున్నారు. దీంతో బైక్ ట్యాక్సీలు ఎక్కకుండా తమ లగేజీతో కాలికి పనిచెబుతున్నారు.జనవరి 13న ప్రారంభమైన మహాకుంభమేళా.. ఫిబ్రవరి 26న మహా శివరాత్రి రోజున జరిగే ఆరో రాజస్నానంతో ముగియనుంది. ఇప్పటివరకు 53 కోట్ల మందికిపైగా భక్తులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేశారు.

## ట్రంప్‌నకు గట్టి దెబ్బ.. కోడిగుడ్లు దొరక్క అమెరికన్ల అవస్థలు..!




**వాషింగ్టన్-నవభూమి:**అమెరికా ప్రస్తుతం తీవ్రమైన కోడి గుడ్ల సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. బర్డ్ ఫ్లూ వ్యాప్తి లక్షలాది కోళ్ల మరణానికి దారితీసింది. దీనివల్ల గుడ్ల ధరలు ఆకాశాన్ని అంటాయి. సూపర్ మార్కెట్లు గుడ్ల కొనుగోలుపై ఆంక్షలు విధిస్తున్నాయి. రెస్టారెంట్ యజమానులు తమ మెనూలలో మార్పులు చేయవలసి వస్తుంది.ఈ సంక్షోభం మధ్య, టర్కీ అమెరికాకు 15,000 టన్నుల గుడ్లు సరఫరా చేయాలని నిర్ణయించింది. ఈ ఎగుమతి ప్రక్రియ ప్రారంభమైంది. జూలై వరకు కొనసాగుతుందని టర్కియేస్ ఎగ్ ప్రొడ్యూసర్స్ సెంట్రల్ యూనియన్ చైర్మన్ తెలిపారు. ఈ మొత్తం సరఫరాను రెండు టర్కిష్ కంపెనీలు నిర్వహిస్తాయి. మొత్తం 700 కంటైనర్ల గుడ్లను అమెరికాకు పంపనున్నారు.2022 నుండి అమెరికాలో బర్డ్ ఫ్లూ వ్యాప్తి కొనసాగుతోంది. ఇప్పటివరకు 162 మిలియన్లకు పైగా అంటే 16.2 కోట్ల కోళ్లు, టర్కీలు, ఇతర పక్షులు దీని బారిన పడ్డాయి. ఇటీవలి కేసుల్లో అకస్మాత్తుగా పెరుగుదల నమోదు చేసుకుంది. ఇది గుడ్ల కొరతను మరింత తీవ్రతరం చేసింది. ఈ వ్యాధిని నియంత్రించడానికి వ్యవసాయ శాఖ ఒక వ్యాక్సిన్‌ను తయారు చేసే పనిలో పడింది. గుడ్ల కొరతను తీర్చడానికి, అమెరికా తుర్కియే వంటి దేశాల నుండి గుడ్లను దిగుమతి చేసుకోవలసి వచ్చింది. ఈ ఒప్పందం ద్వారా టర్కీ దాదాపు 26 మిలియన్ డాలర్లు అంటే సుమారు రూ. 216 కోట్లు సంపాదిస్తుంది. ప్రపంచంలోని టాప్ 10 గుడ్లు ఎగుమతి చేసే దేశాలలో టర్కియే ఇప్పటికే ఉంది.ఇదిలావుంటే, బర్డ్ ఫ్లూ ప్రభావం ఇలాగే కొనసాగితే, అమెరికా మరిన్ని గుడ్లను దిగుమతి చేసుకోవాల్సి రావచ్చని నిపుణులు భావిస్తున్నారు. అయితే, అమెరికా వ్యవసాయ శాఖ ప్రస్తుతం ఈ అంశంపై వ్యాఖ్యానించడం మానేసింది.

అయితే, టర్కీ నుండి వచ్చే గుడ్లు అమెరికాకు ఉపశమనం కలిగించవచ్చు, అయితే ఈ సంక్షోభం బర్డ్ ఫ్లూ వంటి ఇన్ఫెక్షన్లు మొత్తం ఆహార సరఫరాను ఎలా ప్రభావితం చేస్తాయో కూడా చూపిస్తుంది.



## స్థల పురాణం మూలాలతో తవ్వకాలు.. బయటపడింది చూసి షాక్..!

**తమిళనాడు-నవభూమి:** తమిళనాడులో చోళులు పల్లవుల పరిపాలనలో అద్భుతమైన కళాఖండాల నిర్మాణం జరిగింది. దక్షిణాదిన తమిళనాడులో ఎక్కువగా ఈ పురాతన కట్టడాలు ఆలయాలు ఎక్కువగా ఉన్న విషయం తెలిసిందే..! వేల సంవత్సరాల క్రితం జరిగిన ఆ నిర్మాణాలు ఇప్పటికీ చాలా చోట్ల చెక్కుచెదరకుండా నాటి కళా వైభవాన్ని చాటి చెబుతున్నాయి. అప్పట్లో ఎలాంటి సాంకేతికత లేకుండా జరిగిన నిర్మాణాలు ఇప్పటికీ అబ్బురపరుస్తూ ఉంటాయి. తమిళనాడులో ఇటీవల కాలంలో పురావస్తు శాఖ అధికారులు జరిపిన తవ్వకాల్లో చరిత్రకు సంబంధించిన ఆనవాళ్లు అనేకం బయటపడ్డాయి. చరిత్రలో తెలిపిన వివరాల ప్రకారం జరిపిన తవ్వకాల్లో వాటి అవశేషాలను గుర్తించిన ఆర్కియాలజీ అధికారులు వాటిపై ఇంకా పరిశోధనలు సాగిస్తూనే ఉన్నారు. తాజాగా ఇలాంటి పురాతన నిర్మాణాలకు సంబంధించిన సమాచారంతో తవ్వకాలు జరిపితే మరోసారి చరిత్రకు సంబంధించిన ఆనవాళ్లు బయటపడ్డాయి. తిరువళ్లూరు సమీపంలో చోళుల కాలంలో నిర్మించిన మురుగన్ ఆలయంలో ఒక సొరంగం ఉన్నట్లు పురావస్తు శాఖ అధికారులు గుర్తించారు. తవ్వకాల్లో బయటపడ్డ ఈ సొరంగంపై తమిళనాడులో ఆసక్తిగా మారింది. తిరువళ్లూరుకు సమీపంలో ఉన్న పట్టరైపెరుమంతూర్‌లో కులుత్తుంగ చోళరాజుల పాలనలో నిర్మించిన ప్రాచీన మురుగన్ ఆలయం ఉంది. ఈ ఆలయం పదవ శతాబ్దానికి చెందినదిగా స్థలపురాణంలో ఉంది. తిరువళ్లూరు జిల్లాతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ముఖ్యమైన రోజులలో ఈ ఆలయం భక్తులతో కిటకిటలాడుతుంది.



## ఇంటర్ విద్యలో సంస్కరణలు అవసరం

జాతీయ క్రైమ్ బ్యూరో లెక్కల ప్రకారం భారతదేశంలో విద్యార్థుల ఆత్మహత్యల్లో తొమ్మిది శాతం ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే జరుగుతున్నాయి. వీటిలో మెజారిటీ విద్యార్థులు ఇంటర్మీడియట్ చదువుతున్నవారే కావడం గమనార్హం. నేషనల్ క్రైమ్ బ్యూరో రికార్డ్స్(2022) ప్రకారం విద్యార్థుల ఆత్మ హత్యల్లో మహారాష్ట్ర, తమిళనాడు, మధ్యప్రదేశ్ తొలి మూడు స్థానాల్లో ఉండగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు 10, 11 స్థానాల్లో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు అధిక శాతం మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. దీనికి ప్రధాన కారణం ఇంటర్మీడియట్ విద్యారంగం కార్పొరేట్ శక్తుల కబంధహస్తాల్లో ఉండడమే. వారి ప్రభావం వల్ల గత మూడు దశాబ్దాలలో ఇంటర్మీడియట్ విద్యలో ఎటువంటి సంస్కరణలూ జరుగలేదు. కార్పొరేట్ శక్తుల స్వార్థ ప్రయోజనాల కోసం విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారు.

రాష్ట్రంలో ప్రతి సంవత్సరం ఆత్మహత్యలకు గురి అవుతున్న విద్యార్థులలో అత్యధిక శాతం ఇంటర్ విద్యార్థులే అని గణాంకాలు చెబుతున్నాయి. ఇంటర్మీడియట్ ఫలితాలు వెలువడిన ప్రతీసారి విద్యార్థుల ఆత్మహత్యల వార్తలు ఆందోళన కలిగిస్తూనే ఉన్నాయి. ఇంటర్‌లో చేరే విద్యార్థులు కోర్సు మొదలయిన రోజు నుంచి ఫలితాలు వచ్చే వరకు రెండు సంవత్సరాల పాటు నిరంతర ఒత్తిడిలో ఉంటారు. దీనికి కారణం బోర్డు పరీక్షలు, కార్పొరేట్ శక్తులు, తల్లిదండ్రుల ఒత్తిడి. దేశంలో కేవలం ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో, తమిళనాడులో మాత్రమే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పరీక్షలు జరుగుతున్నాయి. మిగతా రాష్ట్రాల్లో కేవలం అంతర్గత మూల్యాంకనం ద్వారా మాత్రమే విద్యార్థి అభ్యసన సామర్థ్యాలను నమోదు చేస్తారు. మొదటి సంవత్సరం పరీక్షల్ని తొలగిస్తే విద్యార్థులపై ఒత్తిడి తగ్గి, మొదటి ఏడాది సిలబస్‌లో కీలక అంశాలపై పట్టు సాధించడంతో పాటు వాటి ఆధారంగా రెండో ఏడాది సబ్జెక్టులపై పట్టు సాధించి, జాతీయస్థాయి పరీక్షలలో రాణించే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కూడా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే సమయం, సౌలభ్యం దొరుకుతుంది. అధ్యాపకులు కూడా పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసేందుకు వెసులుబాటు ఉంటుంది. అదేవిధంగా జాతీయ బోర్డు, ఇతర రాష్ట్రాల బోర్డులు కేవలం 12వ తరగతి పరీక్షలు మాత్రమే నిర్వహిస్తున్నందున వారితో సారూప్యత ఏర్పడుతుంది.

కానీ, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు తొలగిస్తే విద్యార్థులు, అధ్యాపకులలో మొదటి సంవత్సరంపై శ్రద్ధ తగ్గి, కేవలం రెండవ సంవత్సరంపై మాత్రమే దృష్టి పెడతారని కొందరు విద్యావేత్తల అభిప్రాయం. మొదటి సంవత్సర ఇంటర్నల్ పరీక్షలు, మూల్యాంకనం పకడ్బందీగా నిర్వహించడం ద్వారా దీనిని అధిగమించవచ్చు. అదే విధంగా జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలలో రెండు సంవత్సరాల సిలబస్ నుంచి సమాన సంఖ్యలో ప్రశ్నలు ఉంటాయని విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా వారిని ప్రోత్సహించాలి.

ప్రభుత్వమే ఇంటర్మీడియట్ తర్వాత విద్యార్థులు రాసే పోటీ పరీక్షల కోసం ప్రత్యేకంగా కోచింగ్ సెంటర్లను నిర్వహించడం, ప్రభుత్వ రంగంలో ఇంటర్మీడియట్ విద్య బలోపేతానికి చర్యలు తీసుకోవడం, మొదటి సంవత్సర పరీక్షలు రద్దు చేయడం వంటి చర్యలు తీసుకోవాలి. ఇంటర్మీడియట్ విద్యలో సంస్కరణలు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

# పదో తరగతి విద్యార్థులారా.! పారాహుషార్!!



విద్యార్థి జీవితంలో 10వ తరగతి పరీక్షలకు ఒక ప్రత్యేకత ఉంది. చదువు ప్రయాణంలో ఇదే మొదటి జంక్షన్, మైలురాయి. కావున ప్రత్యేక శ్రద్ధ అవసరం. మీ జీవితంలో మొదటిసారి పబ్లిక్ పరీక్షలను రాయబోతున్న మీకోసం కొన్ని ముఖ్య విషయాలు. వీటిని చదివి అర్థం చేసుకుని ప్రవర్తిస్తే ఇక మంచి ఫలితాలే! సందేహం లేదు. మీ పిల్లలకు ఇంకా కొన్ని రోజులు మాత్రమే ఉన్నాయి. ఇప్పటి నుండి అయినా ప్రణాళికాబద్ధంగా ప్రవర్తిస్తే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చు.

**పరీక్షలకు ముందు (ప్రస్తుతం ):**

ఏ పరీక్షలకైనా మంచి ఫలితాల కోసం త్రిపి (3పి) ఫార్ములాను పాటించండి. అది 1. ప్లానింగ్ 2.ప్రిపరేషన్ 3. ప్రెజెంటేషన్

ప్లానింగ్ లో సిలబస్ ఏంటి? ఏ పుస్తకాలు రిఫర్ చేయాలి? కరెక్ట్ రిలేటెడ్ లిటరేచర్ ఏంటి?మొదలగు రీడింగ్ మెటీరియల్ విషయాల్లో స్పష్టత కలిగి ఉండడమే ప్లానింగ్. చదవాల్సిన పుస్తకాల విషయంలో స్పష్టత అవసరం.

రెండో దశ అయిన ప్రిపరేషన్ పై పూర్తి దృష్టి సారించాలి. పరీక్షలకు ప్రిపేర్ అయ్యే సమయంలో వేటి పైనా మీ దృష్టి సారించకుండా కేవలం చదివే అంశాలు, విషయాలపైనే దృష్టి సారిస్తూ ప్రిపేర్ అయ్యే సమయంలో ఆత్మవిశ్వాసంతో సాధించాలనే మనోధైర్యంతో నిజాయితీగా శ్రమించాలి. శ్రమయేవ



జయతే కదా!

**ఇక పరీక్షలకు సిద్ధపడే సమయంలో...**

చక్కని ప్రశాంత వాతావరణంలోనే చదవండి.

రాయబోవు పరీక్ష గురించి పూర్తి సమాచారాన్ని తెలిసి ఉండండి.

పరీక్ష పత్ర నమూనా గూర్చి పూర్తి అవగాహన కలిగి ఉండండి.

చదివే క్రమంలో కంటెంట్ మేర సమయ విభజన చేస్తూ చదవండి.

ఒకేసారి గంటలకొద్దీ చదవకుండా బ్రేక్ ఇవ్వండి.

చదివే సమయంలో ఏవేని సందేహాలు వస్తే వెంటనే నివృత్తి చేసుకోండి.

సిలబస్ పై,పూర్వ ప్రశ్నాపత్రాలపై పూర్తి అవగాహన కలిగి ఉండండి.

**పరీక్ష రాయబోవు సమయంలో...**

మనసును ప్రశాంతంగా ఉంచుకుంటూ పరీక్షకు అవసరమగు సామాగ్రిని ముందే సిద్ధం చేసుకోండి. ఉదా.హాల్ టికెట్, పాడ్, పెన్నులు మొదలగునవి.

పరీక్ష రోజు మితంగా చక్కని పోషక విలువలు ఉండే ఆహారాన్ని స్వీకరించండి.

పరీక్ష హాల్లోకి వెళ్లే ముందే టాయిలెట్ కు వెళ్లి రండి.

మీకు కేటాయించిన స్థలంలో ప్రశాంతంగా కూర్చోండి.

పరీక్ష పత్రం ఇవ్వగానే నిదానంగా, ప్రశాంతంగా, ఆసాంతం చదవండి.

పరీక్ష పత్రంలో ఏ ఏ ప్రశ్నలకు పర్ఫెక్ట్ గా జవాబులను రాయగలరో ముందే గుర్తించండి.

ప్రశ్నలను,సెక్షన్లను,వాటి మార్పులను గమనిస్తూ సమయ విభజన చేసుకోండి.ఇక రాయడం ప్రారంభించండి.

చక్కగా జవాబులు రాయగలం అనుకునే ప్రశ్నలను మొదటగా జవాబులను రాయండి.

ఫస్ట్ ఇంప్రెషన్ ఇస్ ద బెస్ట్ ఇంప్రెషన్ కాబట్టి చక్కని దస్తూరి రాతతో సమయపాలనతో జవాబులను రాయండి.

ప్రశ్నలకు క్లియర్ కట్టుగా జవాబులను రాయండి.సోది రాయవద్దు.

టెన్షన్‌ల అనిపిస్తే ఒకసారి, కళ్ళను మూసుకుని,పూర్తి ఊపిరిని పీల్చుకొని గాలిని వదలండి.మంచి నీరును తాగండి.రిలాక్స్ అవ్వండి.

పరీక్షకు సంబంధం లేని ఏ రకమైన సామాగ్రిని వెంట తీసుకు వెళ్ళకండి.

ఈసారి మీకు 12/24 పేజీల జవాబు బుక్ లెట్‌ను ఇవ్వబడుతుంది. దానిలోనే చక్కని రాతతో నిర్మలంగా రాయండి.

అన్ని ప్రశ్నలకు జవాబులను రాయండి.క్రమంగా సెక్షన్లు వారీగా రాయండి.చివరగా రాసిన జవాబులను వాటి ప్రశ్నల సంఖ్యను ఒకసారి చెక్ చేసుకోండి.

బుక్లెట్ కు అనుసంధానంగా బిట్ పేపరు, గ్రాఫ్,మ్యాప్‌లను దానికి జత చేయండి.సరి చూడండి.

అన్ని ఒకసారి చూసుకున్న తర్వాతనే జవాబు బుక్ లెట్‌ను ఇన్విజిలేటర్‌కు ఇవ్వండి.

పరీక్ష సాంతం పూర్తయిన తర్వాత బయటకు వచ్చిన అనంతరం ఒకసారి గట్టిగా ఊపిరి పీల్చుకుని, రాసిన ప్రశ్నలు మరియు జవాబులను గూర్చి ఒకసారి ఆలోచిస్తే ప్రశాంతత లభిస్తుంది.తదుపరి పరీక్షకు రెట్టింపు ఉత్సాహంతో సిద్ధం కండి.

ఈ విధంగా ప్రణాళికా బద్దంగా,పూర్తి ఆత్మవిశ్వాసంతో మీరు పరీక్షలకు సిద్ధపడాలి. ఎవరో సహాయం చేస్తారు? ఏదో ఒకటి రాయవచ్చులే! అనుకోవడం అజ్ఞానమే అవుతుంది. స్వయంగా ప్లాన్ ప్రకారం పూర్తిస్థాయిలో ప్రిపేర్ అవుతూపోతే ఏ పరీక్షలనైనా అతి సులభంగా ఎదుర్కోవచ్చు. ఎవరి జీవితాలకు,భవిష్యత్తుకు వారే జవాబుదారులనే సత్యాన్ని గమనిస్తూ,ప్రణాళిక బద్ధంగా సిద్ధపడుతూ, ఉత్తమ ఫలితాలు సాధించి మీ తల్లితండ్రులను,మీ గురువులను, పెద్దలను సంతోషపరిచే బాధ్యత మీదే!

కనుక ఇక పరీక్షల సిద్ధపాటును విజ్ఞతతో ప్రారంభించండి. ఆల్ ది బెస్ట్.


**డాక్టర్ యం.ప్రభుదయాల్,**
**మాజీ సెనెట్ మెంబర్ - కాకతీయ యూనివర్సిటీ,**
**మండల విద్యాశాఖాధికారి - కొత్తగూడెం.**


# ‘ దేశభాషలందు తెలుగు లెస్స ’



దేశభాషలందు తెలుగు లెస్స ! అని శ్రీకృష్ణదేవరాయులు మన తెలుగు భాషను కీర్తించారు. ఇంతటి ఘనకీర్తి కలిగిన తెలుగు భాషలో వ్రాసిన గ్రంధాలు ఒకప్పుడు సామాన్యులకు అర్థంకాని గ్రాంథిక భాషలో ఉండేవి. కాని ఇప్పుడు గ్రంధాలన్నీ వాడుక భాషలోనే వ్రాయబడుతున్నాయి. దీనికి ఒక మహనీయుడు నడిపిన ఉద్యమమే కారణం. ఆయనే గిడుగు రామ్మూర్తి పంతులు. గిడుగు అనగానే మనకు స్ఫురించేది వాడుకభాష గురించి చేపట్టిన ఈ మహోద్యమమే! ఈ ఉద్యమం ఫలితంగానే నేడు మనం పాఠశాలల్లో, సమాచార ప్రసార సాధనాల్లో, సాహిత్యంలో వ్యావహారిక భాషను ఉపయోగిస్తున్నాం. గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుకభాషలోకి తీసుకువచ్చి నిత్య వ్యవహారిక భాషలో ఉన్న అందాన్నీ, వీలునూ తెలియజెప్పిన మహనీయుడు. కావ్యాలు, గ్రంధాలు, పాఠ్యాంశాలు గ్రాంధికభాష నుండి బయటపడి వ్యవహారిక భాషలో రచనారంగం మార్పుకు మూల పురుషుడు ఈయనే !

**వాడుక భాషోద్యమ పితామహుడు !**
**గ్రాంథికమ్ము నెత్తిన పిడుగు !**
**వ్యవహార భాషోద్యమ స్థాపక ఘనుడు !**
**తేట తేనియల తెల్లని పాల మీగడ గిడుగు !**
**కూరి తెలుగు భాషకు గొడుగు గిడుగు !**
**తెలుగులో వ్యావహారిక భాషోద్యమానికి మూలపురుషుడు !**
**బహుభాషా కోవిదుడు !**
**చరిత్రకారుడే గాక చరిత్రను సృష్టించినవాడు !**

జననం:1863 ఆగష్టు 29న శ్రీకాకుళం జిల్లాలోని జీవనది వంశధార ఒడ్డున గల పర్వతాలపేటలో జన్మించారు. దీనికి ఆవల ఒడ్డున ఆ ప్రాంత ప్రజలు దక్షిణ కాశీగా పిలిచే శ్రీముఖలింగం పుణ్యక్షేత్రం కొలువై ఉంది.1879 లో మెట్రిక్యులేషన్‌లో ఉత్తీర్ణులైన తరువాత 1880లో ముప్పై రూపాయల జీతం మీద పర్లాకిమిడి రాజావారి పాఠశాలలో ఫస్తుఫారంలో చరిత్ర ఉపాధ్యాయుడిగా కుదిరారు. ఇక్కడ కళాశాలకు కూడా బోధించే సౌకర్యం ఉండే మూలాన కళాశాల తరగతులకు పాఠాలు చెప్పే అవకాశం వచ్చింది. అక్కడే 1911 సంవత్సరం వరకు 30 యేళ్లు అధ్యాపకునిగా పనిచేసి పదవీవిరమణ చేశారు. అంతకు కొద్ది సంవత్సరాల ముందే ఆధునికాంధ్ర భాషాసంస్కరణ వైపు అతని దృష్టి మళ్ళింది.

**వ్యావహారిక భాషోద్యమం పుట్టుక:**

1907 లో ఉత్తరకోస్తా జిల్లాల పాఠశాలల తనిఖీ అధికారిగా వచ్చిన జె ఎ యేట్స్ అనే బ్రిటిష్ అధికారికి నిత్యజీవితంలో ప్రజలు మాట్లాడే వ్యవహారిక భాషకు విభిన్నంగా పాఠ్యపుస్తకాలలో భాష ఎందుకు ఉందనే సంశయాన్ని నివృత్తి చేసుకునేందుకు విశాఖపట్నంలో ఎ వి ఎన్ కళాశాలలో ప్రధానాధ్యాపకులయిన పి టి శ్రీనివాస అయ్యంగారిని కలిశారు. ‘ దీనికి సమాధానం గురజాడ, గిడుగు రామ్మూర్తి పంతులు మాత్రమే తెలియజేయగలరని ‘ తెలిపారు. యేట్స్ గిడుగు రామ్మూర్తిని కలిసి చర్చించారు. విద్యా విధానములో అన్యాయం జరుగుతున్నదని గిడుగు గుర్తించారు. గిడుగు, గురజాడ, శ్రీనివాస అయ్యంగారు, యేట్స్ ఆలోచనల వల్ల వ్యవహారిక భాషా ఉద్యమం మొదలుపోనుకుంది.



తెలుగు భాషలో వచ్చిన ఈ చారిత్రాత్మకమైన మార్పుకు ప్రధాన కారణం గిడుగు రామమూర్తి సారధ్యంలో నడిచిన వ్యావహారిక భాషోద్యమం. ఇది గ్రాంథిక భాషకు, వ్యవహారిక లేదా వాడుక భాషకు మధ్య జరిగిన భాషోద్యమం. అప్పటి ప్రభుత్వ పరీక్షల బోర్డు కార్యదర్శి 1912 - 13 సం.లో స్కూలుఫైనల్‌లో వ్యాసరచన కావ్యభాషలో లేదా ఆధునికభాషలో గాని రాయవచ్చునని ఒక ప్రభుత్వ ఉత్తర్వు జారీచేశారు. ఆధునిక భాషకు లక్ష్యంగా చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ తెలుగురీడరును, ఏనుగుల వీరాస్వామయ్య రచించిన కాశీయాత్ర చరిత్రను ఉదహరించాడు. ఈ మార్పుల వల్ల తెలుగు సాహిత్యానికి అపకారం జరుగుతుందని పండితుల్లో భయం కలిగి మద్రాసులో జయంతి రామయ్య పంతులు అధ్యక్షతన ఏర్పడ్డ“ఆంధ్ర సాహిత్య పరిషత్తు” , వావిలికొలను సుబ్బారావు, వేదం వేంకటరాయ శాస్త్రి లాంటి పండితులు గ్రాంధికాన్ని బలపరిచారు. వీరు తెలుగు ప్రాంతం అంతటా సభలు పెట్టి వ్యాసరచన పరీక్షలో ప్రభుత్వం ఇచ్చిన స్వేచ్ఛను ఉపసంహరించాలని పెద్ద ఎత్తున ఉద్యమం లేవదీసారు. 1925సం.లో తణుకులో వ్యవహారిక భాషను ప్రతిఘటించిన ఆంధ్ర సాహిత్య పరిషత్తు సభలో గిడుగు నాలుగు గంటల పాటు ప్రసంగించి గ్రంథాల్లోని ప్రయోగాల్ని ఎత్తిచూపివ్యావహారిక భాషా వాదానికి అనుకూలంగా సమితిని తీర్మానింపజేసారు. సాహితీ సమితి, నవ్యసాహిత్య పరిషత్తుల్లాంటి సంస్థలు కూడా గిడుగు వాదాన్ని బలపరచాయి. గిడుగు రామమూర్తి ఊరూరా తిరిగి ఉపన్యాసాలిస్తూ గ్రాంథికంలో ఏ రచయిత భావాత్మకంగా రాయలేడని నిరూపించారు. 1919లో గిడుగు “తెలుగు” అనే మాసపత్రికను స్థాపించి తన శాస్త్రీయ వ్యాసాలతో, ఉపన్యాస పాఠాలతో అవిశ్రాంతంగా పోరాటం సాగించారు. కాని ఆ పత్రిక ఒక ఏడాది మాత్రమే నడిచింది. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి, తల్లావజుల శివశంకరశాస్త్రి, కందుకూరి వీరేశలింగం, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, వజల చినసీతారామశాస్త్రి లాంటి కవులు, పండితులు వ్యవహారిక భాషావాదం వైపు మొగ్గు చూపారు. 1919 ఫిబ్రవరి 28న రాజమహేంద్రవరంలో కందుకూరి వీరేశలింగం అధ్యక్షులుగా, గిడుగు కార్యదర్శిగా “వర్తమానాంధ్ర భాషా ప్రవర్తక సమాజం” స్థాపించారు. గిరిజన ప్రాంతాలలో ఉండే సవరల భాష నేర్చుకొని వాళ్ళకు చదువు చెప్పాలనే కోరిక ఆ రోజుల్లోనే అతనికి కలిగింది. తెలుగు, సవరభాషలు రెండూ వచ్చిన ఒక సవర వ్యవహర్తను ఇంట్లోనే పెట్టుకొని సవర భాష నేర్చుకున్నారు. “దక్షిణముండా” భాషకు చెందిన సవరభాషా వ్యాకరణాన్ని, సవర - ఆంగ్లం నిఘంటువులను రచించారు. గిడుగు రామమూర్తి 1940 జనవరి 15వ తేదీన ప్రజామిత్ర కార్యాలయంలో పత్రికా సంపాదకుల సభలో వ్యావహారిక భాషా వ్యాప్తికి పత్రికలు చేస్తున్న కృషిను అభినందించారు. కాని ప్రభుత్వ విద్యాశాఖవారు, విశ్వవిద్యాలయాలు గ్రాంథికాన్ని వదిలిపెట్టక పోవటానికి బాధపడ్డారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ ‘ దేశభాష ద్వారా విద్య బోధిస్తే కాని ప్రయోజనం లేదు. శిష్టజన వ్యావహారికభాష లోకంలో సదా వినబడుతూ వుంటుంది. అది జీవంతో కలకలలాడుతూ ఉంటుంది. గ్రాంథిక భాష గ్రంథాలలో కనబడే భాషేగాని వినబడే భాష కాదని ప్రసంగాలలో వ్యవహారిక ప్రయోగిస్తూ తిట్టుకొన్నా, సరసాలాడుకున్నా ఎంత హాస్యాస్పదంగా ఉంటుందని, గ్రాంథిక భాష యెడల నాకు ఆదరము లేకపోలేదని, ప్రాచీనకావ్యాలు చదువవద్దనీ విద్యార్థులకు నేర్పవద్దనీ నేననని, కాని ఆ భాషలో నేడు రచన సాగించడానికి పూనుకోవడం వృథా అంటున్నానని, నిర్దుష్టంగా గ్రాంథికంలో ఎవరునూ రాయలేరని, రాసినా రాసేవారితో పాటు వినేవారికి కూడా కష్టమేనని “ తెలిపారు. ఇంకా ‘ గ్రాంథికంలో వ్రాసే వారు ఏమి చేస్తున్నారు? భావం తమ వాడుక భాషలో రచించుకొని గ్రాంథికీకరణం చేస్తున్నారు. అది చదివేవారు, వినేవారు తమ సొంత వాడుక మాటలలోకి మార్చుకొని అర్థం చేసుకొంటున్నారు. ఎందుకీ వృథాప్రయాస? స్వరాజ్యం కావాలని, ప్రత్యేకాంధ్రరాష్ట్రము కోసం పోరాడుతున్నామని, ఇటువంటి పరిస్థితులలో మన ప్రజలకు, సామాన్య జనులకు ఏ భాష ద్వారా జ్ఞానం కలుగచేయవలసి ఉంటుందో, ఏ భాషలో గ్రంథరచన సాగించవలసి ఉంటుందో ఆలోచించండి ! మీచేతులలో పత్రికలున్నవి. పత్రికల ద్వారా మీరు ఎంతైనా చేయగలరు ‘ అని విన్నవించారు.

సత్కారాలు:1934లో అప్పటి ప్రభుత్వం కైజర్ ఎ హింద్ బిరుదు ఇచ్చి గౌరవించింది. 1913 లో ప్రభుత్వం రావు సాహెబ్ బిరుదు ఇచ్చింది. 1938సం.లో ఆంధ్ర విశ్వకళాపరిషత్తు కళాప్రపూర్ణతో గౌరవించింది. గిడుగు రామమూర్తికి అభినవ వాగమశాసనుడు అని బిరుదు కూడా ఉంది.

చివరి రోజులు:1936 నుండి తన వృద్యాప్య జీవితాన్ని రాజమహేంద్రవరంలో గడిపారు. 22 జనవరి 1940 న తుదిశ్వాస విడిచారు.


**జనక మోహన రావు దుంగ**
**ఫోన్ : 8247045230**


## అమ్మ భాషే అమృతం!



మన భాష మన గౌరవం,
మన ఆస్తి, మన అస్తిత్వం
విశ్వాన్ని సంభాషించాలంటే
మాతృభాష ధారణచేయాలి.

భాష మనహక్కు, బాధ్యత
జాతి ప్రాముఖ్యత, ప్రాణం
మాతృభాషను మరవద్దు
పరభాషను ద్వేషించవద్దు.

మాతృభాషను ప్రేమించాలి
పరభాషనూ ఆదరించాలి
మాతృభాషపై పట్టుంటేనే
ప్రపంచాన్ని జయించగలవు.

అమ్మభాష లోనే తీయదనం
అందులోనే మధురామృతం
పొట్టకూటికి పరాయి భాషను
కిరాయికి తెచ్చినా తప్పులేదు.

అమ్మ ఎవరికయినా అమ్మే
కాని కన్నతల్లి ప్రేమ ప్రత్యేకం
భాష ఏదైనా, ఎల్లలుండవు
ఐనా మాతృభాషే అమృతం.

ప్రతి అక్షరానికో అర్థంఉంది
భాషకొక పరమార్థం ఉంది.
మాతృభాషే మన ప్రపంచం
పరాయిభాష ఖాళీ కంచం.

మన భాష మనకు చైతన్యం
మన సాంస్కృతిక వైభవం
మాతృభాషా దినోత్సవానే
కనబడుతుంది దాని ప్రాభవం.


భాషను రక్షించుకుంటేనే
జాతి సురక్షితంగా ఉంటుంది
మాతృభాష మరచిన జాతి
జగాన మిగలడం కష్టమే !!

(ఫిబ్రవరి 21 అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం)


**- యండి.ఉస్మాన్ ఖాన్**


## దేశంలోనే మొట్టమొదటి ఎత్తయిన స్వర్ణగోపురం కలిగిన ఆలయంగా యాదగిరిగుట్ట

భక్తి



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ స్వర్ణ విమానావిష్కరణకు మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాలు స్వస్తివాచనం, విష్వక్సేనారాధన, పుణ్యాహ వాచనం, రక్షాబంధనం పూజలతో మహాకుంభ సంప్రోక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, మృత్సంగ్రహణం, యాగశాల ప్రవేశం, అఖండ దీప ప్రజ్వలన, అంకురార్పణ, ద్వార తోరణం ధ్వజ కుంభారాధన, అంకురార్పణ హోమం జరుగుతుంది. హోమాలు, జపాలు, హవనాలు, వేదాలు, పారాయణాలతో పాంచనారసివుడి ఆలయంలో ఆధ్యాత్మికత ఉట్టి పడుతోంది. మరో నాలుగు రోజుల పాటు వానమామలై మఠం 31వ పీఠాధిపతి మధుర కవి రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో 108 మంది ఋత్వికులతో పంచకుండాత్మక యాగం జరుగుతుంది.దేశంలోనే మొట్టమొదటి ఎత్తయిన స్వర్ణగోపురం కలిగిన ఆలయంగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం నిలువనుంది. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ‘విమాన గోపురం’ బంగారు పూతను ఆవిష్కరించడానికి ఐదు రోజుల ‘ కుంభాభిషేకం ‘, ప్రతిష్టాపన ఉత్సవం బుధవారం ప్రారంభమైంది. పూర్తయిన తర్వాత, యాదగిరిగుట్ట ఆలయం దేశంలోనే ఎత్తైన బంగారు పూతతో కూడిన విమాన గోపురం అవుతుంది. ఇది టిటిడి 33 అడుగుల నిర్మాణంతో పోలిస్తే 55 అడుగుల ఎత్తు ఉంటుంది. కాగా ఈ నెల 23న ఉదయం 11.54 గంటలకు 108 కలశాలతో సుదర్శన లక్ష్మీ నారసింహ దివ్య స్వర్ణ విమాన గోపుర మహాకుంభాభిషేక ప్రతిష్ఠామహోత్సవం నిర్వహించనున్నారు. ఈ సంప్రోక్షణ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు హాజరుకానున్నారని ఆలయ అధికారులు చెబుతున్నారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరు కావడానికి అనుమతి కోరుతూ ఆలయ పరిపాలన విభాగం ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసింది. స్వర్ణమయమైన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పంచతల విమాన గోపురం బంగారు తొడుగులతో స్వామివారి ప్రతిమ దేదీప్యమానంగా వెలుగుతూ భక్తులకు ఆకర్షణీయంగా కనువిందు చేయనుంది. దాదాపు రూ. 70 కోట్ల వ్యయంతో జరిగిన బంగారు పూత పనిలో దాదాపు 66 కిలోల బంగారం ఉపయోగించినట్లు తెలిసింది.



# నవతార



## ఎండకు చర్మం కమిలితే...

ఎండకు కమిలిపోయిన, రంగు మారిన చర్మం సహజసిద్ధ మెరుపును సంతరించుకోవడం కోసం కలర్ కరెక్టర్‌ను ఉపయోగించాలి. సన్ ట్యాన్‌కు గురైన ప్రదేశంలో పసుపు టోన్ కలిగిన కలర్ కరెక్టర్‌ను చర్మంలో కలిసిపోయేలా అద్దుకోవాలి. నుదురు, ముక్కు, చెక్కిళ్లు సన్‌ట్యాన్‌కు ఎక్కువగా గురవుతూ ఉంటాయి. ఆయా ప్రదేశాల్లో కలర్ కరెక్టర్‌ను అద్దుకుని, ఆ తర్వాతే మేకప్ మొదలుపెట్టాలి.

కన్‌సీలర్..రంగు మారిన చర్మం మీద సన్నని గీతలు కూడా ఏర్పడతాయి. కాబట్టి వాటిని దాచడం కోసం చర్మపు రంగు కంటే తేలిక రంగులో ఉండే కన్‌సీలర్‌ను ఎంచుకోవాలి. ఈ కన్‌సీలర్‌ను తడిపి పిండిన బ్యూటీ బ్లెండర్ సహాయంతో చర్మం మీద అద్దుకోవాలి.

ఫౌండేషన్..ఎండకు కమిలిన చర్మం మరింత సున్నితంగా మారుతుంది. కాబట్టి చురుకైన రసాయనాలుండే ఫౌండేషన్లకు దూరంగా ఉండాలి. అలాగే చర్మాన్ని తేమగా ఉంచే ఫౌండేషన్లను మాత్రమే వాడుకోవాలి. అందుకోసం మాయిశ్చరైజర్, ఎస్‌పిఎఫ్ కలిగిన ఫౌండేషన్‌నే ఎంచుకోవాలి. మరీ ముఖ్యంగా వేసవిలో ముదురు రంగు ఫౌండేషన్లనే వాడుకోవాలి.

# సాహసమే శ్వాసగా

కలలు అందరూ కంటారు... సాహసం, సహనం ఉన్న మీనాక్షి దాస్ లాంటి వారు మాత్రమే వాటిని నెరవేర్చుకోగలుగుతారు. దాదాపు ఏడాది కాలంలో... అరవై నాలుగు దేశాల్ని ఆమె బైక్ మీద చుట్టేశారు అసోం రాష్ట్రానికి చెందిన 41 ఏళ్ల ఈ ఫిట్‌నెస్ ట్రైనర్... ఇప్పుడు మరో యాత్రకు సిద్ధమవుతున్నారు. భీకరమైన వాతావరణాలు, వీసా కష్టాలే కాదు... ఎందరో అపరిచితుల ప్రేమను, ఆతిథ్యాన్ని చవి చూశానంటున్న మీనాక్షి తన ప్రయాణం గురించి చెబుతున్న సంగతులివి.





"బైక్ నడపడం నేర్చుకుంటానంటే ఎప్పుడూ వద్దనే నాన్న... నా ఆసక్తిని గుర్తించి తన కైనెటిక్ హొండా నడపడం నేర్పారు. అప్పుడు నాకు పదహారేళ్ళు. మొదటిసారి గువాహటి వీధుల్లో బైక్ నడుపుతున్నప్పుడు... గొప్ప స్వేచ్ఛ లభించిన అనుభూతి. అప్పటి నుంచి బైక్ నా జీవితంతో విడదీయలేని భాగం అయిపోయింది. అస్సామీ మహిళగా... ఈశాన్య భారత దేశమంతా చుట్టేయాలని ఉండేది. చదువు, ఫిట్‌నెస్ ట్రైనర్‌గా వృత్తి బాధ్యతలతో ఆ ఆలోచన క్రమంగా మరుగున పడిపోయింది. పెళ్ళయిన తరువాత, నా భర్త వేదాంతకు కూడా బైక్ ట్రిప్స్ సరదా కావడంతో... ఆయనతో కలిసి అరుణాచల్‌ప్రదేశ్, మేఘాలయ రాష్ట్రాల్లో తిరిగి వచ్చాను.

ఆ రోడ్లలో, మలుపుల్లో ప్రయాణం ఆహ్లాదాన్నే కాదు, భయాన్ని కూడా కలిగించింది. ఏదో ఒక రోజు నేనొక్కదాన్నే పర్యటనలు చెయ్యాలనుకొనేదాన్ని. కొన్నేళ్ళపాటు నా జీతంలో దాచుకున్న డబ్బుతో... 2019లో సొంతంగా నా మొదటి బైక్ కొనుక్కున్నాను. కొన్ని నెలల తరువాత... ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ప్రదేశంలో ఉన్న మోటారబుల్ రహదారి 'ఉమ్లింగ్ లా పాస్'లో బైక్ మీద ప్రయాణం చేశాను. ఈ మార్గంలో యాత్ర చేసిన రెండవ మహిళను నేనే.

**ఆ మూడూ కుదరలేదు...**

ఉమ్లింగ్ లా పాస్ అనుభవం నాకు ఉత్సాహాన్నిచ్చింది. కరోనా ఆంక్షలు ముగిసిన తరువాత... 2022లో నేపాల్‌కు సోలో రైడ్ చేశాను. "మగ తోడు లేకుండా ఈ తిరుగుళ్ళేమిటి?" అని నోళ్ళు నొక్కుకున్నవారు చాలామంది ఉన్నారు. నేను అవేవీ పట్టించుకోలేదు. కొత్త సాహసాలు చేయాలని మనసు ఉవ్విళ్ళూరుతూ ఉండేది. వివిధ దేశాల్ని బైక్‌లో చుట్టెయ్యాలనే ఆలోచన వచ్చింది. ఒక మహిళ పేరిట 50 దేశాల్లో... బైక్ మీద పర్యటించిన ప్రపంచ రికార్డు ఉందని విన్నాను. నేను 67 దేశాల్లో ప్రయాణించి, ఆ రికార్డును బద్దలుగొట్టడంతోపాటు, మహిళా సాధికారతను చాటి చెప్పాలని నిశ్చయించుకున్నాను. నా భర్త, కుటుంబం కూడా అంగీకరించారు. 2023 డిసెంబర్ 17న నేపాల్‌కు బైక్‌లో వెళ్ళి, అక్కడినుంచి ముంబై చేరుకున్నాను. నా బైక్‌ను దుబాయ్ పంపించి, నేను కూడా అక్కడికి విమానంలో వెళ్ళాను. అక్కడి నుంచి నా యాత్ర ప్రారంభమయింది. 2024 డిసెంబర్ 24న... స్వదేశం చేరుకోవడంతో పూర్తయింది. ఈ ప్రయాణంలో... 372 రోజుల్లో... 64 దేశాలు పర్యటించాను. మయన్మార్, ఒమన్, ఇరాక్ దేశాల్లో కూడా ప్రయాణిస్తే... నా 67 దేశాల లక్ష్యం నెరవేరేది. కానీ భద్రతాపరమైన ఆక్షల కారణంగా... ఆ దేశాల్లో ప్రవేశానికి అనుమతి దొరకలేదు.

**ఉద్వేగం ఆపుకోలేక ఏడ్చేశాను...**

ఇది అంత సులువుగా, సజావుగా సాగిన ప్రయాణం కాదు. మొదటి సమస్య నిధులు. ఈ మొత్తం యాత్రకు రూ.54 లక్షలు అవసరమవుతుందని అంచనా వేశాను. ఇది ఈశాన్య భారతం నుంచే కాదు, మొత్తం మన దేశం నుంచి స్థాపించే ప్రపంచ రికార్డు కాబట్టి, ప్రజలు సాయం చేస్తారని విశ్వసించాను. స్పాన్సర్ల కోసం వెతికాను. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, క్రీడా, పర్యాటక మంత్రిత్వ శాఖలకు విజ్ఞాపనలు చేసుకున్నాను. అందరూ హామీలు ఇచ్చారు, కానీ ఎవరి నుంచీ ఒక రూపాయైనా అందలేదు. దీనితో మా పొలాన్ని తాకట్టు పెట్టాను. మిగిలిన మొత్తం కోసం క్రౌడ్ ఫండింగ్ కోసం ప్రయత్నించాను. ఒక వ్యక్తి రూ. 10 లక్షలు ఇచ్చి ప్రోత్సహించారు. అలా నా ఖాతాలో రూ.20 లక్షలు చేరాయి. కీలకమైన వీసాలు తీసుకోవడానికి అది సరిపోతుందని భావించి, నా యాత్రను చేపట్టాను. ఇక ప్రయాణాల్లో ఎదురైన ఇబ్బందుల గురించి చెప్పాలంటే... యమన్, ఒమన్ మధ్య ఉద్రిక్తతల కారణంగా దారి మార్చుకోవాల్సి వచ్చింది. నన్ను, నా బైక్‌ను ఫెర్రీలో తీసుకువెళ్ళడానికి సిద్ధపడిన ఒక ఎన్జీవో... ఆఖరి నిమిషంలో వెనక్కి తగ్గడంతో... కతార్‌కు బైక్‌తో సహా విమానంలో వెళ్ళాల్సి వచ్చింది. దానికి అదనంగా దాదాపు మూడు లక్షలు ఖర్చయ్యాయి. ఇక తీవ్రమైన ఇసుక తుపాను కారణంగా... 13 రోజులు జోర్డాన్‌లో చిక్కుకుపోయాను. అక్కడ ప్రియాంక అనే మహిళ నాకు ఆశ్రయం ఇచ్చారు. అక్కడినుంచి బయలుదేరినప్పుడు... అయిదు వందల డాలర్లు ఒక కవర్లో పెట్టి ఆమె ఇచ్చినప్పుడు.. ఉద్వేగంఆపుకోలేక ఏడ్చేశాను.

**కష్టమైనా... ఆపాలనుకోలేదు...**

ఇక కొన్ని దేశాల్లో తీవ్ర స్థాయిలో వీసా కష్టాలు కూడా ఎదురయ్యాయి. ఈ యాత్ర కోసం ఎన్నో వదులుకోవాల్సి వచ్చింది. డబ్బు ఆదా చేయడం కోసం నాలుగు నెలలపాటు మధ్యాహ్నం భోజనం చేయలేదు. వర్షాలు, మంచు కారణంగా చిన్న అనారోగ్యాలకు కూడా గురయ్యాను. మా నాన్న అయిదేళ్ళ క్రితం చనిపోయారు. వృద్ధాప్యంలో ఉన్న మా అమ్మకు, బోర్డ్ ఎగ్జామ్స్ రాస్తున్న మా అమ్మాయికి, నా భర్తకు దూరంగా ఉండడం బాధగా అనిపించేది. ప్రయాణాల్లో వారు గుర్తుకు వచ్చినప్పుడు ఏడ్చేదాన్ని. నా వేదనలన్నీ నా ముఖానికి ధరించిన హెల్మెట్‌కు తెలుసు. కానీ ఎంత కష్టమైనా... ఈ ప్రయాణాన్ని ఆపాలని ఎప్పుడూ అనుకోలేదు. ఇది కేవలం నా కోసం కాదు, ఎగతాళికి గురైన ప్రతి ఒంటరి మహిళ కోసం చేసే ప్రయాణం అనుకున్నాను. నేను వెళ్ళాల్సిన దూరాలు ఇంకా చాలా ఉన్నాయి. మిగిలిన మూడు దేశాలతో పాటు.... త్వరలోనే రష్యా, అమెరికాల్లో సాహస యాత్రలకు సిద్ధమవుత న్నాను. ఈసారి నా భర్త కూడా నాతో ప్రయాణంలో భాగస్వామి అవుతారు.

# పిల్లల్లో జ్ఞాపకశక్తికి...

పిల్లలు చదువులో రాణించాలంటే వారిలో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరగాలి. కొన్ని ఆహార పదార్థాలతో వాటిని పెంచుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అవేంటంటే...

పిల్లల్లో జ్ఞాపకశక్తికి...

ప్రతిరోజూ నీళ్లలో అయిదు బాదం పప్పులను నానబెట్టి, పొట్టు తీసి పిల్లలచేత తినిపించాలి. దీనివల్ల శరీరానికి ఇ విటమిన్, మెగ్నీషియం, ఆరోగ్యకరమైన కొవ్వులు లభ్యమై మెదడు చురుకుగా పనిచేస్తుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది

ఉదయం లేదా సాయంత్రం సమయాల్లో ఒక అరటిపండు తినిపిస్తే పిల్లలకు తక్షణమే శక్తి లభిస్తుంది. నేచురల్ షుగర్స్, పొటాషియం తగు మోతాదులో అంది ఆలోచనా శక్తి కూడా పెరుగుతుంది.

పిల్లలు బడి నుంచి రాగానే నాలుగు వాల్‌నట్ గింజలు తినిపిస్తే మంచిది. వీటిలో ఉండే మెగ్నీషియం, కాల్షియం, ఐరన్, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ లాంటివి మెదడు పనితీరుని వేగవంతం చేసి గుర్తుపెట్టుకునే సామర్థ్యాన్ని పెంచుతాయి.

సాల్మన్, మాకరెల్, సార్డైన్, ట్యూనా లాంటి చేపలతో తయారు చేసిన వంటకాలు తినిపించాలి. వీటిలోని ఫ్యాటీ యాసిడ్ సమ్మేళనాలు మెదడుని ప్రభావితం చేస్తాయి.

రోజూ పడుకునేముందు ఒక గ్లాసు పాలు తాగిస్తే మెదడుకి విశాంతి లభిస్తుంది. పాలలోని ప్రోటీన్లు, ఇతర పోషకాలు... మెదడు సరైన క్రమంలో ఎదిగేందుకు తోడ్పడతాయి. స్వచ్ఛమైన నెయ్యిని ఆహారంలో చేర్చడం వల్ల జ్ఞాపకశక్తి వృద్ధి పొందుతుంది.

కోడిగుడ్లు, పాలకూర, బచ్చలి కూర, దానిమ్మ గింజలు, గుమ్మడి గింజలు, అవిసె గింజలు, యాపిల్, నారింజ, పల్లీలను తరచూ తినిపిస్తూ ఉంటే పిల్లల మెదడు చురుకుగా పనిచేయడమే కాకుండా జ్ఞాపకశక్తి



# మనీ ప్లాంట్ బాగా పెరగాలంటే ఇలా చేయండి



మనీ ప్లాంట్ లేకుండా ఏ ఇళ్లు ఉండదు. దాదాపు ప్రతి ఇంట్లోనూ ఉంటుంది. ఈ మొక్క ఇంట్లో ఉంటే సంపద పెరుగుతుందని చాలా మంది నమ్ముతారు. మనీ ప్లాంట్ పచ్చగా ఉంటే ఇంట్లో అమ్మవారి ఆశీస్సులు కూడా ఉంటాయని అంటారు. దీన్ని ఆరుబయట మాత్రమే కాకుండా కొంతమంది ఇంటి లోపల కూడా ఉంచుతారు. మనీ ప్లాంట్ నేలలో, నీటిలో కూడా పెరుగుతుంది. అయితే, కొన్నిసార్లు మనీ ప్లాంట్ ఎండిపోతుంది. అలా మొక్క ఎండిపోకుండా ఉండాలంటే కొన్ని సులభమైన చిట్కాలు ఉన్నాయి. వాటి ద్వారా మొక్కను కాపాడుకుందాం..

**నీటి పరిమాణంపై నిఘా ఉంచండి**

మనీ ప్లాంట్లకు పెద్దగా జాగ్రత్త అవసరం లేదు. అయితే, కొన్నిసార్లు కొంతమంది దానికి ఎక్కువ నీరు పోస్తారు. ఇంటి లోపల, ఆరుబయట నాటిన మనీ ప్లాంట్లను వివిధ మార్గాల్లో సంరక్షించాలి. ఇంటి లోపల ఒక కుండలో నాటితే, పై అంగుళం నేల ఎండిపోయినప్పుడు మాత్రమే దానికి నీరు పెట్టాలి. మీరు ఒక సీసాలో మనీ ప్లాంట్ నాటినట్లయితే, ప్రతి 10 నుండి 15 రోజులకు ఒకసారి దాని నీటిని మార్చాలి.

**ఎక్కువ సూర్యకాంతికి గురికాకుండా చూడాలి**

మనీ ప్లాంట్లకు ప్రతిరోజు సూర్యరశ్మి అవసరం లేదు. ఉదయం సూర్యకాంతి పడే ప్రదేశంలో దానిని ఉంచవద్దు. ప్రతిరోజూ సూర్యకాంతికి గురిచేయడం వల్ల అది దెబ్బతింటుంది. మీరు వారానికి ఒకసారి ఉదయం సూర్యకాంతిలో ఒక గంట పాటు ఉంచవచ్చు.

**మూడు నెలలకు ఒకసారి ఎరువులు వేయండి**

మనీ ప్లాంట్ నాటేటప్పుడు మీరు వేసే ఎరువులు దాదాపు మూడు నెలల పాటు నిలువ ఉంటాయి. దీనికి పెద్దగా ఎరువులు అవసరం లేదు. మీరు ప్రతి మూడు నెలలకు కలుపు తీస్తుంటే, ఒకసారి ఎరువులు వేయండి. మీరు దీనిలో ఆవు పేడను ఉపయోగించవచ్చు. ఇది దీనికి చాలా మంచిది.

**మనీ ప్లాంట్ బాగా పెరగడానికి**

మనీ ప్లాంట్ బాగా పెరగాలంటే మొక్కను నాటేటప్పుడు నేల, కుండ పరిమాణం మొదలైన వాటిపై శ్రద్ధ వహించాలి. మనీ ప్లాంట్లను వేగంగా పెంచడానికి మనీ ప్లాంట్ నాచు కర్రలను ఉపయోగించండి. నాచు కర్రలను ఉపయోగిస్తే వేర్లు ఎండిపోకుండా ఉంటాయి. మనీ ప్లాంట్ నాటడానికి 8 నుండి 10 అంగుళాల కుండను ఉపయోగించండి. దాని పెరుగుదలకు, ఒకటి నుండి రెండు గంటలు తగినంత సూర్యరశ్మిని ఇచ్చి, నీటితో పిచికారీ చేయాలి. నీటిని చల్లడం వల్ల మొక్కల బాగా పెరుగుతుంది.

**కోత కూడా ముఖ్యం**

ఇతర చెట్ల మాదిరిగానే, మనీ ప్లాంట్‌ను కత్తిరించడం కూడా చాలా ముఖ్యం. మనీ ప్లాంట్‌ను కత్తిరించకపోతే, అది పెరుగుతూనే ఉంటుంది. ఇది దాని రూపాన్ని పాడు చేస్తుంది. ముఖ్యంగా, మనీ ప్లాంట్ ఆకులు ఎండిన, పసుపు కలర్ లోకి వచ్చిన ఎప్పటికప్పుడు వాటిని తొలగించాలి.

# కురచ కుర్తాల్లో కులాసాగా

కురచగా ఉండే కుర్తాలను జీన్స్, లెగ్గింగ్స్, జెగ్గింగ్స్‌తో కలిసి ధరించవచ్చు.

కాటన్, సింథటిక్ వస్త్రాలతో తయారయ్యే ఈ చిట్టిపొట్టి కుర్తాలు ఆకర్షణీయంగా ఉండడంతో పాటు, ఆధునికంగానూ కనిపిస్తాయి

సౌకర్యానికి పెద్ద పీట వేసే కురచ కుర్తాలను పొడవాటి లెహంగాతో కలిపి ధరించవచ్చు

సాయంకాలపు వేడుకలు, స్నేహితులతో కాలక్షేపాలకు ఈ కుర్తాలు భలే అనువుగా ఉంటాయి

హుందాగా కనిపించాలనుకునేవాళ్లు కూడా ఈ కుర్తాలను ఎంచుకోవచ్చు

లతలు, పువ్వుల డిజైన్లు ఉన్న కుర్తాలు, జీన్స్‌తో కలిపి ధరించి, ఎత్తు మడమల చెప్పులు వేస్తే చూడముచ్చటగా ఉంటుంది

చికన్ వర్క్ కుర్తాల్లో పొట్టివి కూడా ఉంటాయి. ఇవి కాలేజీ అమ్మాయిలకు చక్కగా నప్పుతాయి. సినిమాలు, షికార్లకు ఈ రకం కుర్తాలు అనువైనవి

అదనపు హంగులు ఇలా...

మట్టితో తయారయ్యే టెర్రకోటా ఆభరణాలు ఈ తరహా దుస్తులకు నప్పుతాయి.

భుజానికి వేలాడే బ్యాగ్ చక్కగా నప్పుతుంది.

చదునైన చెప్పులు, ఎత్తు మడమల చెప్పులూ రెండూ బాగుంటాయి

భారీ నెక్లెస్‌లూ, కడాలూ లాంటివి ధరించకపోవడమే మేలు.











## నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. టాప్ 5 లాసింగ్ స్టాక్స్



**ముంబై-నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం కూడా మరోసారి నష్టాల్లో ముగిశాయి. ఈ క్రమంలో ప్రధాన సూచీలైన 30 షేర్ల బీఎస్ఈ సెన్సెక్స్ 203.22 పాయింట్లు తగ్గి 75,735 వద్ద ముగిసింది. మరోవైపు నిఫ్టీ 50 కూడా 19.75 పాయింట్లు తగ్గి 22,913.15 స్థాయికి చేరుకుంది. ఇదే సమయంలో బ్యాంక్ నిఫ్టీ 236 పాయింట్లు నష్టపోయి 49,334 స్థాయికి చేరుకోగా, నిఫ్టీ మిడ్ క్యాప్ 100 సూచీ మాత్రం వీటికి విరుద్ధంగా 637 పాయింట్లు లాభపడి 51,163 స్థాయికి చేరింది. ఈ క్రమంలో పలువురు మదుపర్లు నష్టపోగా, మరికొంత మంది మాత్రం లాభపడ్డారు. ఈ క్రమంలో బ్యాంక్, మారుతి సుజుకి, టెక్ మహీంద్రా, టాటా కన్స్యూమర్స్, టెక్ సంస్థల స్టాక్స్ టాప్ 5 నష్టాల్లో ఉండగా, శ్రీరామ్ ఫైనాన్స్, , భారత్ ఎలక్ట్రిక్, అదానీ పోర్ట్స్ సంస్థల స్టాక్స్ టాప్ 5 లాభాల్లో ఉన్నాయి. నిఫ్టీ 50లోని 50 స్టాక్‌లలో 28 లాభాలతో ముగిశాయి.

నిఫ్టీ ఆటో, నిఫ్టీ , మెటల్, రియాల్టీ, మీడియా సూచీలు ఒక శాతానికి పైగా లాభాలతో ముగియగా, బ్యాంక్ నిఫ్టీ, నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఐటీ, ఫార్మా, ప్రైవేట్ బ్యాంక్ సూచీలు 0.75 శాతం వరకు నష్టపోయాయి. ప్రపంచ మార్కెట్లలో నెలకొన్న మిశ్రమ ధోరణుల నేపథ్యంలో స్టాక్ మార్కెట్ సూచీలు పడిపోయినట్లు నిపుణులు చెబుతున్నారు.

## భారత ఫార్మాకు ట్రంప్ సుంకాల ముప్పు



**న్యూఢిల్లీ-నవభూమి:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో బాంబు పేల్చారు. యూఎసలోకి దిగుమతయ్యే ఔషధాలు, సెమీకండక్టర్లపై 25 శాతం లేదా అంతకంటే అధిక సుంకం విధిస్తానని, ఆపై సుంకాన్ని మరింత పెంచుకుంటూ పోతానని హెచ్చరించారు. అదే గనక జరిగితే, భారత ఫార్మాస్యూటికల్స్ రంగం, ప్రధానంగా హైదరాబాద్‌కు చెందిన ఔషధ కంపెనీలపై అధిక ప్రభావం పడనుంది. దేశీయ ఫార్మా సంస్థల జనరిక్ ఔషధాలకు అమెరికా అతిపెద్ద మార్కెట్ కావడమే అందుకు కారణం.. ఫార్మా ఎగుమతుల ప్రోత్సాహక కౌన్సిల్ (ఫార్మెక్సిల్) లెక్కల ప్రకారం..2023-24 ఆర్థిక సంవత్సరంలో భారత ఫార్మా కంపెనీలు అమెరికాకు 870 కోట్ల డాలర్ల (ప్రస్తుత మారకం విలువ ప్రకారం రూ.75,690 కోట్లు) ఔషధాలను ఎగుమతి చేశాయి. ఫార్మా ఎగుమతుల్లో అమెరికా వాటాయే 31 శాతంగా ఉంది.

**అమెరికా వినియోగదారులకే నష్టం: ఫార్మెక్సిల్**

అమెరికా చర్య ఆ దేశ వినియోగదారులకే నష్టమని ఫార్మెక్సిల్ అభిప్రాయపడింది. "అమెరికా టారిఫలతో తక్షణ ప్రభావమేమీ ఉండదు. ఒకవేళ సుంకం విధిస్తే, దిగుమతుల భారం పెరగడం వల్ల అమెరికా వినియోగదారులకే నష్టం. ప్రస్తుతం ఇండస్ట్రీ ఈ విషయంలో వేచి చూసే ధోరణిలో ఉంది. సాధారణంగా మన కంపెనీలు అత్యంత ఖరీదైన పేటెంట్ డ్రగ్స్‌కు జనరిక్ వెర్షన్లను యూఎసకు సరఫరా చేస్తుంటాయి" అని ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ రాజ భాను అన్నారు. ప్రముఖ రీసెర్చ్ కంపెనీ ఐక్యూవీఐఏ ప్రకారం.. 2022లో అమెరికాలో డాక్టర్లు పేషెంట్లకు రాసిచ్చిన జనరిక్ ఔషధాల్లో దాదాపు సగం భారత కంపెనీలు సరఫరా చేసినవే. తద్వారా యూఎస్ హెల్త్‌కేర్ సిస్టమ్ ఆ ఏడాదిలో 21,900 కోట్ల డాలర్లు (రూ.19.05 లక్షల కోట్లు) ఆదా చేయగలిగిందని భాను అన్నారు. 2013-22 మధ్యకాలంలో ఏకంగా 1.3 లక్షల కోట్ల డాలర్లు (రూ.113 లక్షల కోట్లు) ఆదా జరిగిందన్నారు. వచ్చే ఐదేళ్లలో అమెరికా మరో 1.3 లక్షల కోట్ల డాలర్లు ఆదా చేసుకోగలిగే అవకాశం ఉందన్నారు.

**ప్రస్తుత సుంకం సున్నా**

అమెరికా ప్రస్తుతం భారత్ నుంచి దిగుమతి చేసుకునే ఔషధాలపై ఎలాంటి సుంకం విధించడం లేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2,900 కోట్ల డాలర్ల విలువైన ఔషధాలను అమెరికా సహా ఇతర దేశాలకు ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాజ భాను తెలిపారు. ఆర్థిక సంవత్సరంలో గడిచిన 10 నెలల్లో (ఏప్రిల్-జనవరి) ఫార్మా ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 7.84 శాతం వృద్ధితో 2,430 కోట్ల డాలర్లకు చేరుకున్నాయన్నారు.

అమెరికా ఎగుమతి చేస్తున్న ఔషధ కంపెనీలు..సన్ ఫార్మా: దేశంలో అతిపెద్ద ఔషధ కంపెనీ సన్ ఫార్మాస్యూటికల్‌కు 2023-24 ఆర్థిక సంవత్సర ఆదాయంలో 32 శాతం అమెరికా మార్కెట్ నుంచే సమకూరింది. మన ఔషధాలపై ట్రంప్ అదనపు సుంకాలు విధిస్తే, ఆ భారాన్ని వినియోగదారుల పైకి బదిలీ చేయకతప్పదని కంపెనీ ఎండీ దిలీప్ సంఘ్వీ అన్నారు. సన్ ఫార్మా 100 దేశాలకు ఔషధాలను ఎగమతి చేస్తోంది. కంపెనీ వార్షికాదాయంలో ఎగుమతుల వాటాయే 72.7 శాతంగా ఉంది.డాక్టర్ రెడ్డీస్: హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ రెడ్డీసకు ఉత్తర అమెరికానే అతిపెద్ద మార్కెట్. 2023-24 ఆర్థిక సంవత్సర అమ్మకాల్లో ఈ మార్కెట్ వాటాయే 47 శాతంగా ఉంది. కంపెనీ ఈ మార్కెట్‌కు అధికంగా ఆంకాలజీ, ఇమ్యూనాలజీ థెరపీలకు సంబంధించిన జనరిక్ ఔషధాలను సరఫరా చేస్తుంది. 2022-23తో పోలిస్తే వీటి విక్రయాలు 28 శాతం పెరిగాయి.అరబిందో ఫార్మా: హైదరాబాద్‌కు చెందిన అరబిందో ఫార్మాకు గత ఆర్థిక సంవత్సరంలో అమెరికా మార్కెట్ నుంచి ఆదాయం వార్షిక ప్రాతిపదికన 24 శాతం వృద్ధితో రూ.13,867 కోట్లకు పెరిగింది. కంపెనీ మొత్తం రెవెన్యూలో ఈ మార్కెట్ వాటాయే 48 శాతంగా ఉంది. అంతేకాదు, కంపెనీకిదే అతిపెద్ద మార్కెట్ కూడా.నాట్కో ఫార్మా: గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మొత్తం ఆదాయంలో 78 శాతం అంతర్జాతీయ వ్యాపారం ద్వారానే సమకూరింది. సంస్థకు అతిపెద్ద ఎగుమతి మార్కెట్లలో అమెరికా ఒకటి. ఈ దేశానికి కంపెనీ కేన్సర్ సహా పలు జనరిక్ ఔషధాలను ఎగమతి చేస్తోంది.దివీస్ లేబరేటరీస్: గత ఆర్థిక సంవత్సరానికి అమెరికా మార్కెట్లో దివీస్ అమ్మకాలు రూ.1,310 కోట్లుగా నమోదయ్యాయి. కంపెనీ మొత్తం ఆదాయంలో ఈ వాటా 17.1 శాతంగా ఉంది. సంస్థకు యూరప్ తర్వాత అతిపెద్ద మార్కెట్ అమెరికాయే.సిప్లా: గత ఆర్థిక సంవత్సరంలో సిప్లా ఆదాయంలో 30 శాతం ఉత్తర అమెరికా మార్కెట్ నుంచే సమకూరింది. కంపెనీకిది రెండో అతిపెద్ద మార్కెట్ కూడా. అమ్మకాలపరంగా అమెరికాలోని టాప్-15 ఔషధ కంపెనీల్లో సిప్లా ఒకటి.

బయోకాన్: 2023-24 ఆర్థిక సంవత్సరానికి బయోకాన్ ఆదాయంలో 44 శాతం అమెరికా మార్కెట్ నుంచే లభించింది. కంపెనీకిదే అతిపెద్ద మార్కెట్. ఈ కంపెనీ యూఎస్‌కు అధికంగా కీళ్లవాతం, కేన్సర్ చికిత్సలో ఉపయోగించే సంక్లిష్ట బయోలాజిక్స్‌కు కాపీ అయిన బయోసిమిలర్స్‌ను ఎగమతి చేస్తుంటుంది. ఐక్యూవీఐఏ ప్రకారం.. 2022లో అమెరికాలో అమ్ముడైన బయోసిమిలర్స్‌లో 15 శాతం భారత కంపెనీలు సరఫరా చేసినవే.లుపిన్: 2022-23 ఆర్థిక సంవత్సరానికి లుపిన్ మొత్తం విక్రయాల్లో ఉత్తర అమెరికా మార్కెట్ వాటా 30 శాతంగా ఉండగా.. 2023-24లో 37 శాతానికి పెరిగింది. కంపెనీకి చెందిన యాంటీ రెట్రోవైరల్ తోపాటు శ్వాసకోస సమస్యలకు సంబంధించిన జనరిక్ ఔషధాలకు పెరిగిన డిమాండ్ పెరగడం ఇందుకు తోడ్పడింది.గ్లెన్‌మార్క్ ఫార్మా: కంపెనీకి ఉత్తర అమెరికా రెండో అతిపెద్ద మార్కెట్. 2023-24లో సంస్థ ఆదాయంలో 26 శాతం ఈ మార్కెట్ నుంచే లభించింది.జైడస్: అమెరికాకు జైడస్ 200కు పైగా జనరిక్ ఔషధాలను ఎగుమతి చేస్తోంది. కంపెనీకిదే అతిపెద్ద మార్కెట్ కూడా. గత ఆర్థిక సంవత్సర ఆదాయంలో 46 శాతం ఈ మార్కెట్ నుంచే సమకూరింది.

**ఒత్తిడిలో ఫార్మా షేర్లు**

ట్రంప్ సుంకాల హెచ్చరికతో భారత ఫార్మా రంగ కంపెనీల షేర్లు ఒత్తిడికి లోనయ్యాయి. డాక్టర్ రెడ్డీస్ స్టాక్ 2.63 శాతం క్షీణించగా.. జైడస్ లైఫ్ సైన్సెస్ 2.47 శాతం, అరబిందో ఫార్మా 2.41 శాతం, లుపిన్ 1.75 శాతం, సన్ ఫార్మా 1.46 శాతం, సిప్లా 1.21 శాతం, గ్లెన్‌మార్క్ 0.71 శాతం నష్టపోయాయి. నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ 0.71 శాతం తగ్గింది.

## ఈ పంట ఒక్కసారి వేస్తే చాలు.. రిస్క్ ఉండదు.. ఏడాది పొడుగునా రెట్టింపు లాభాలు..



**న్యూఢిల్లీ-నవభూమి:** సాధారణంగా ప్రతి రైతు ఎదుర్కొనే ప్రధాన సమస్య. పండించిన పంటను మార్కెట్ చేసుకోలేక పోవడం లేదా పంట చేతికొచ్చే సమయానికి డిమాండ్ పడిపోవడం. దీనికి తోడు అకాల వర్షాల బాధలు ఉండనే ఉంటాయి. అందుకే ఏ పంట వేయాలా అనే సందేహం ఎప్పుడూ వెంటాడుతూ ఉంటుంది. కానీ, వ్యవసాయదారులు ఒక్కసారి ఈ పంట వేస్తే చాలు. పెద్దగా రిస్క్ లేకుండానే ఏటా రెట్టింపు లాభాలు అందుకోవచ్చు.

ఇది వరకటితో పోలిస్తే ప్రస్తుతం వ్యవసాయం చేయడం చాలా సులభతరంగా మారింది. అందుకే కరోనా తర్వాత చాలామంది లక్షల జీతం వచ్చే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదులుకుని మరీ టెక్ సాగు చేస్తూ కోట్లు సంపాదిస్తున్నారు. వ్యవసాయంలో ఆధునిక పరికరాలను సరిగ్గా వినియోగించడం తెలిస్తే ఈ రంగంలో ఉన్నంత ఆదాయం ఇంకెక్కడా దొరకదు. పంట పండించడమే తప్ప మార్కెటింగ్ చేతకాక చాలామంది రైతన్నలు దళారుల చేతిలో మోసపోతుంటారు. ఈ పంట ఒక్కసారి వేశారంటే ఏ సీజన్‌లో అయినా కష్టానికి తగ్గ ప్రతిఫలం తప్పక చేతికొస్తుంది. వర్షం ఎక్కువగా కురిసినా.. తక్కువగా కురిసినా అస్సలు ఇబ్బంది ఉండదు. ముఖ్యంగా పల్లెల్లో ఉండే నిరుద్యోగులకు ఇదొక మంచి అవకాశం.పెద్ద చదువులు చదివినా నేటితరం వ్యవసాయం చేసేందుకు మొహమాటం పడటం లేదు. నైన్ టూ ఫై ఉద్యోగాల కంటే ఒత్తిడి లేకుండా సొంతూళ్లో తల్లిదండ్రుల వద్దే ఉంటూ సాగు చేసుకోవాలని భావిస్తున్నారు. స్మార్ట్ వ్యవసాయం చేస్తూ తోటివారు ఈ రంగంవైపు అడుగులు వేసేలా స్ఫూర్తి నింపుతున్నారు. పంటలు ఎంచుకోవడంలో చూపించే నేర్పరితనమే వారి విజయానికి ప్రధానకారణం. అలాంటివాటిలో మునగ సాగు (%ఐతీబఎర్‌అఎ ఖీఘతీఎఱఅస్త్ర%) కూడా ఒకటి. ఆరోగ్యానికి మునగ కాయలతో పాటు ఆకులు ఎంతో మేలు చేస్తాయి. నగరాలు, పట్టణాల్లో ఏడాది పొడవునా వీటికి మంచి డిమాండ్ ఉంది.

ఎట్టుబడికి మూడింతల లాభాలు..మునగ శాస్త్రీయ నామం మోరింగా ఒలిఫెరా. ఈ చెట్టులోని ప్రతి భాగం అమూల్యమైనదే. ఇది ఆహారంగా మాత్రమే కాదు. ఆయుర్వేదపరంగానూ ఎన్నో ప్రయోజనాలున్నాయి. మరో ప్రత్యేక ఏంటంటే, దీన్ని బంజరు నేలలో కూడా సాగు చేయవచ్చు. ఒక్కసారి నాటామంటే నాలుగేళ్ల పాటు పొలాన్ని దున్నాల్సిన అవసరం రాదు. పెద్దగా పట్టించుకోవాల్సిన పని లేదు. విత్తి వదిలేస్తే చాలు. పుష్కలంగా ఏడాది పొడవునా కాపు వస్తూనే ఉంటుంది. మునగఆకులు, కాయలను నిత్యం తినేవారు ఉండటంతో మార్కెట్లో డిమాండ్ ఎల్లప్పుడూ ఉంటుంది. పంటల మధ్యలో వేసుకున్నా నెలకు ఎంతో కొంత ఆదాయం వస్తుంది. పూర్తి స్థాయిలో అంటే ఒకటి లేదా అరెకరాలో సాగు చేసినా చాలు. పెట్టిన పెట్టుబడికి మూడింతల లాభాలు తప్పక చేతికొస్తాయి.

## అవినాష్ ఇంటర్నేషనల్ స్కూల్ ఫర్ ఫైనాన్షియల్ స్టడీస్



**న్యూఢిల్లీ-నవభూమి:** అవినాష్ ఇంటర్నేషనల్ స్కూల్ ఫర్ ఫైనాన్షియల్ స్టడీస్, అవినాష్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ యొక్క సమగ్ర విభాగం, కామర్స్ ఎడ్యుకేషన్‌లో అత్యుత్తమ ప్రతిభకు ప్రసిద్ధి చెందింది. అసోసియేషన్ ఆఫ్ చార్టర్డ్ సర్టిఫైడ్ అకౌంటెంట్స్ పరీక్షలో అసాధారణమైన ఉత్తీర్ణత శాతాలు సాధించిన అత్యుత్తమ విద్యార్థులను సత్కరించేందుకు %ACCA% సక్సెస్ మీట్ '24 - 25ను నిర్వహించింది. ఈ కార్యక్రమం 2025 ఫిబ్రవరి 20న మధ్యాహ్నం 2 గంటల నుండి 4 గంటల వరకు నిర్వహించబడింది. శ్రీ సాజిద్ ఖాన్, డైరెక్టర్-ఇండియా, %ACCA% ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.వారి %ACCA% ప్రయాణంలో అసాధారణమైన నిబద్ధత మరియు శ్రద్ధ కనబరిచిన విద్యార్థుల విజయాలు ఈ సక్సెస్ మీట్‌లో గౌరవించబడ్డాయి. ఈ సక్సెస్ మీట్ ప్రస్తుత మరియు భావి విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా పనిచేస్తుంది. ఫైనాన్స్ - అకౌంటింగ్ కెరీర్‌లలో అకడమిక్ అచీవ్‌మెంట్ మరియు డెవలప్‌మెంట్ కోసం ప్రయత్నించమని వారిని ప్రోత్సహిస్తుంది.అవినాష్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌ను కామర్స్ గురు - డా. అవినాష్ బ్రహ్మదేవర, %M.Com., CA, CS, CMA% నడిపిస్తున్నారు మరియు ఇది ఇంటర్నేషనల్ వర్టికల్‌ను భారతదేశంలోని ప్రముఖ ఫైనాన్స్ మరియు అకౌంటింగ్ టీచింగ్ అధ్యాపకులతో పాటు డాక్టర్ శ్రీకాంతలహరి సాగి సమర్థవంతంగా నడిపిస్తున్నారు. అభ్యాసాన్ని ఆనందదాయకంగా మార్చడంపై ప్రధానంగా దృష్టి సారించి, విద్యార్థి-కేంద్రీకృత విధానంతో ఐఎస్ఎఫ్ఎస్ %ACCA, CMA వంటి అంతర్జాతీయ వృత్తిపరమైన కోర్సులను అందించడంలో అత్యంత విశ్వసనీయమైన ఇన్‌స్టిట్యూట్‌గా రూపుదిద్దుకుంది.

## గుడ్ న్యూస్ చెప్పిన బులియన్ మార్కెట్.. బంగారం, వెండి ధరలు ఇవే..



**న్యూఢిల్లీ-నవభూమి:** కొన్ని రోజులుగా వరసగా పెరుగుతున్న బంగారం ధరలు ఇవాళ (గురువారం) తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి పసిడి ధరలను పైపైకి తీసుకెళ్లాయి. అయితే నేడు (20-02-2025) గోల్డ్ ధర స్వల్పంగా తగ్గి పసిడి ప్రియులకు శుభవార్త చెప్పింది. ఇవాళ ఉదయం 06:30 గంటల సమయానికి బులియన్ మార్కెట్ (https://bullions.co.in) ప్రకారం.. దేశ రాజధాని ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర బుధవారంతో పోలిస్తే రూ.210 తగ్గి నేడు రూ.78,623కు చేరుకుంది. 24 క్యారెట్ల తులం పసిడి ధర రూ.230 తగ్గి రూ.85,770 వద్ద కొనసాగుతోంది. మరోవైపు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర నిన్న రూ.79,099 ఉండగా.. ఇవాళ రూ.220 తగ్గి రూ.78,879కు చేరింది. అలాగే 24 క్యారెట్ల ధర నిన్న రూ.86,290 ఉండగా.. రూ.240 తగ్గి రూ.86,050కు చేరింది.

వెండి ధరల పరిస్థితి ఎలా ఉందంటే..

ఇక, వెండి విషయానికి వస్తే దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర బుధవారం రూ.97,000 ఉండగా.. నేడు రూ.96,480కు తగ్గింది. ముంబైలో కేజీ వెండి నిన్న రూ.97,170 ఉండగా.. గురువారం రూ.96,650కు చేరుకుంది. ఇక, హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో నిన్న రూ.97,320 ఉన్న వెండి ధర నేడు రూ.96,800కు తగ్గింది.

ప్రధాన నగరాల్లో బంగారం (22, 24 క్యారెట్ల) ధరలు ఇవే..


పుణె- రూ.78,751, రూ.85,910
భోపాల్- రూ.78,833, రూ.86,000
భువనేశ్వర్- రూ.78,778, రూ.85,940
తిరువనంతపురం-రూ.78,998, రూ.86,180
జైపూర్- రూ.78,742, రూ.85,900
పట్నా- రూ.78,714, రూ.85,870
ముంబై- రూ.78,751, రూ.85,910
చెన్నై- రూ.78,980, రూ.86,160
బెంగళూరు- రూ.78,815, రూ.85,980
కోల్‌కతా- రూ.78,650, రూ.85,800

## ఎంజీ విండ్సర్ 15,000 ఉత్పత్తి మైలురాయిని సంబరం చేసిన జెఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా



**న్యూఢిల్లీ-నవభూమి:** ఎంజీ విండ్సర్ భారతదేశపు మొదటి ఇంటెలిజెంట్ CUV 15,000 యూనిట్ల మైలురాయి ఉత్పత్తిని దాటిందని జేఎస్ డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా ఈ రోజు ప్రకటించింది. %CUV% ఆరంభమైన నాటి నుండి వరుసగా నాలుగు నెలలు (అక్టోబర్ 2024- జనవరి 2025) బెస్ట్-సెల్లింగ్ EVగా అభివృద్ధి చెందింది, భారతదేశంలో EV విభాగం యొక్క పూర్తి అభివృద్ధికి కూడా తోడ్పడింది. ఈ సందర్భంగా, బిజు బాలేంద్రన్, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్, జేఎస్ డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా ఇలా అన్నారు, "ఎంజీ విండ్సర్ అందుకుంటున్న ప్రతిస్పందన చూసి మేము ఎంతో ఆనందించాము 15,000 ఉత్పత్తి మైలురాళ్లను దాటడానికి మాకు సహాయపడిన కస్టమర్లకు మేము కృతజ్ఞతలు తెలుపుతున్నాం. మొత్తం ధరలు ప్యాకేజింగ్‌తో కారు బయ్యర్లు CUVని విస్తృతంగా ఆనందించారు. BaaS, బైబ్యాక్ ప్రోగ్రాం జీవిత కాలం వారంటీ వంటి స్మార్ట్ కార్యక్రమాలు EVలలో వినియోగదారు ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. మేము మా పోర్ట్ ఫోలియోను వైవిధ్యపరుస్తున్న ఒదున మా కస్టమర్ల కోసం నాణ్యతతో కూడిన ఉత్పత్తులను అత్యంత వేగంగా తీసుకురావడానికి మేము కట్టుబడ్డాము.""ఫలితంగా, విండ్సర్ కోసం పెరుగుతున్న డిమాండ్ ను నెరవేర్చడానికి హలోల్ సదుపాయంలో సామర్థ్యం పెంచుతున్నాము. ఇంకా, ఎంజీ సెలక్ట్ ద్వారా కొత్త ఉత్పత్తుల కోసం సంసిద్ధతను నిర్ధారించడానికి మేము సదుపాయంలో కొన్ని సవరణలు చేపట్టాము. ఇది ఈ ఏడాది మొదటి అర్థ భాగంలో ప్రారంభమవబోతోంది. కాబట్టి, ఫిబ్రవి నెలలో ఉత్పత్తి తగ్గుతుందని మేము అంచనా వేసాము. ఈ సమయంలో మా హెూల్ సేల్స్‌లో తాత్కాలికంగా ప్రభావం చూపిస్తుందని," ఆయన అన్నారు.జేఎస్ డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా భారతదేశపు మార్కెట్ లో రెండు కొత్త ఉత్పత్తులను విడుదల చేయడం ద్వారా తమ పోర్ట్ ఫోలియోను విభిన్నంగా ఉంచనుంది. దీనిలోఎంజీ సైబర్ స్టెర్‌లు కంపెనీకి చెందిన కొత్త 'యాక్సిసబుల్ లగ్జరీ ' బ్రాండ్ ఛానల్ కింద ఎంజీ సెలక్ట్ ద్వారా విడుదల కానున్నాయి.

## గూగుల్ పేలో కూడా బాదుడు మొదలు.. ఈ చెల్లింపులకు




**న్యూఢిల్లీ-నవభూమి:** గూగుల్ పే యూజర్లకు అలర్ట్. ఎందుకంటే ఇప్పుడు జీ పే కూడా పలు రకాల బిల్స్ చెల్లింపుల సమయంలో ఛార్జీలు వసూలు చేస్తుంది. ఇప్పటికే ఫోన్ పే కూడా రీఛార్జ్ సహా పలు చెల్లింపులకు ఛార్జీలను వసూలు చేస్తుండగా.. ఈ క్రమంలో గూగుల్ పే కూడా అదే బాటలోకి వచ్చింది. దీంతో ఇప్పుడు మీరు కరెంట్ లేదా గ్యాస్ సిలిండర్ బిల్స్ వంటివి చెల్లింపు చేయాలంటే ఛార్జీలు చెల్లించాలి. డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా చేసే చెల్లింపులపై ఈ ఛార్జీలు వర్తిస్తాయి. ఈ క్రమంలో మీరు చేసే చెల్లింపులకు 0.5% నుంచి 1% వరకు ఛార్జీలను వసూలు చేస్తున్నారు. ఇది కాకుండా కూడా చెల్లించాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే గూగుల్ పే వినియోగదారులు ఇటీవల క్రెడిట్ కార్డు ఉపయోగించి విద్యుత్ బిల్లులు చెల్లించిన క్రమంలో రూ. 15 సౌలభ్య రుసుమును చెల్లించాల్సి వచ్చిందని ఓ వ్యక్తి పేర్కొన్నారు. ఈ రికవరీని Google Pay ప్రాసెసింగ్ ఫీజుగా అభివర్ణించిందని చెబుతున్నారు. ఇందులో జీఎస్టీ కూడా ఉంది. ఇది తెలిసిన నెటిజన్లు ఏకంగా 15 రూపాయల ఛార్జ్ ఏంటని ప్రశ్నిస్తున్నారు. మొదట ఉచితంగా వినియోగించుకోవచ్చని ప్రకటించిన ఈ సంస్థ, క్రమంగా ప్రజలకు అలవాటుగా మారిన తర్వాత ఫీజులు వసూలు చేస్తుందని పలువురు యూజర్లు వ్యాఖ్యానిస్తున్నారు.అయితే గూగుల్ పే ఈ ఛార్జీలకు సంబంధించి ఎలాంటి సమాచారం వెల్లడించలేదు. డబ్బు బదిలీ, మెట్రో కార్డ్ రీఛార్జ్, బీమా ప్రీమియం, రైల్వే టిక్కెట్లు, విమాన టిక్కెట్ల వంటి ఇతర సేవలకు Google Pay, UPI ఎలాంటి ఛార్జీలు వసూలు చేయడం లేదని తెలుస్తోంది. ఈ ఛార్జీలను తప్పించుకోవాలంటే ఆయా సంస్థల అధికారిక వెబ్ సైట్లు లేదా ఇంటర్ ఫేస్‌ల ద్వారా చెల్లింపులు చేస్తే వినియోగదారులు తప్పించుకునే ఛాన్సుంది. ఉదాహరణకు ఎయిర్‌టెల్ లేదా జియో వంటి రీఛార్జ్ కోసం యూజర్లు ఆయా కంపెనీల యాప్స్ నుంచి చెల్లింపులు చేసుకుంటే ఇతర ఛార్జీలు పడకుండా ఉంటాయి.

## అదానీలపై దర్యాప్తులో సాయం చేయండి



**న్యూఢిల్లీ-నవభూమి:** అదానీ గ్రూప్ ప్రధాన ప్రమోటర్లు గౌతం అదానీ, సాగర్ అదానీలపై వచ్చిన అవినీతి ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతోందని, దర్యాప్తులో భారత ప్రభుత్వ అధికారుల సహాయం అభ్యర్థించామని అమెరికన్ స్టాక్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) న్యూయార్క్‌లోని ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ కోర్టు న్యాయమూర్తి నికోలస్ గరౌఫిసకు తెలిపింది. భారత్‌లో ఉంటున్న వీరిద్దరికి ఆరోపణల అభియోగ పత్రాన్ని అందజేసేందుకు చర్యలు చేపట్టినట్టు పేర్కొంది. దీంతో ఈ కేసులో అదానీలపై దర్యాప్తును తాత్కాలికంగా నిలిపి వేస్తూ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇటీవల తీసుకున్న నిర్ణయం అమలవుతుందా, లేదా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.సోలార్ విద్యుత్ ప్రాజెక్టుల కాంట్రాక్టుల కోసం అదానీ గ్రూప్ ప్రభుత్వ అధికారులు, రాజకీయ నేతలకు 26.5 కోట్ల డాలర్ల (సుమారు రూ.2,292 కోట్లు) ముడుపులు ముట్టచెప్పిందని గత ఏడాది బైడెన్ నాయకత్వంలోని అమెరికా ప్రభుత్వం ఆరోపించి, దర్యాప్తునకు ఆదేశించింది. ఈ విషయాన్ని కప్పిపెట్టి 2021లో అదానీ గ్రూప్ అమెరికా మార్కెట్‌లో రుణ పత్రాలు జారీ చేసి నిధులు సేకరించిందని ఆరోపణ.షేర్లు ఢమాల్ : ఈ వార్తలతో అదానీ గ్రూపు కంపెనీల షేర్లు మళ్లీ బేర్ పట్టులోకి పోయాయి. 11 లిస్టెడ్ కంపెనీల్లో తొమ్మిది కంపెనీల షేర్లు బుధవారం నాలుగు శాతం వరకు నష్టపోయాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ 3.75 శాతం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 1.78 శాతం, అంబుజా సిమెంట్స్, సంఘీ ఇండస్ట్రీస్ 1.36 శాతం చొప్పున, ఏసీసీ 0.93 శాతం, అదానీ విల్‌మార్ 0.9 శాతం నష్టపోయాయి.

## డిపాజిట్ ఇన్సూరెన్స్ రూ.8-12 లక్షలకు పెంపు!?



**న్యూఢిల్లీ-నవభూమి:** బ్యాంక్ డిపాజిట్‌దారులకు మరింత రక్షణ లభించనుంది. బ్యాంక్‌ల్లో జమ చేసే సొమ్ము పై ప్రస్తుతం రూ.5 లక్షల వరకు బీమా కవరేజీ లభిస్తుండగా.. కేంద్ర ప్రభుత్వం ఈ పరిమితిని రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు పెంచే అవకాశాలున్నాయి. ఇందుకు సంబంధించి ఈ నెలాఖరులోగా అధికారిక ప్రకటన వెలువడవచ్చుని విశ్వసనీయవరాల సమాచారం. బ్యాంక్‌ల్లో, ముఖ్యంగా కో-ఆపరేటివ్ బ్యాంక్‌ల్లో అంతర్గత మోసాలు వెలుగు చూస్తుండటం.. తత్ఫలితంగా ఆ బ్యాంక్‌లు ఆర్థికంగా దివాలా తీస్తున్న కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
7 హైదరాబాద్ శుక్రవారం 21 । ఫిబ్రవరి । 2025



## రైతులకు ఇచ్చిన హామీలు ఏవి.. యూపీ బడ్జెట్‌పై అఖిలేష్ యాదవ్ కీలక వ్యాఖ్యలు..




**ప్రయాగ్‌రాజ్-నవభూమి:** ఉత్తర్ ప్రదేశ్ యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం 2025-2026 ఆర్థిక సంవత్సరానికి రూ. 8 లక్షల 8 వేల 736 కోట్ల 6 లక్షల బడ్జెట్‌ను ఈరోజు సమర్పించింది. ఇది 2024-2025 సంవత్సరపు బడ్జెట్ కంటే 9.8 శాతం ఎక్కువ కావడం విశేషం. అయితే ఈ బడ్జెట్‌పై ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి సంబంధించి అనేక హామీలు ఇచ్చినప్పటికీ, అవన్నీ నెరవేరలేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు పెరిగిపోతున్నాయి తప్ప, రైతుల సమస్యలు మాత్రం అలాగే ఉంటున్నాయని అఖిలేష్ విమర్శించారు. ఈ క్రమంలో రైతుల సంక్షేమం కోసం ఇచ్చిన హామీల గురించి ప్రస్తావించారు అఖిలేష్ యాదవ్. బీజేపీ తన మ్యానిఫెస్టోలో రాబోయే ఐదు సంవత్సరాల్లో రైతులకు నీటిపారుదల కోసం ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చింది. కానీ ఈ హామీ నెరవేర్చలేదని అఖిలేష్ యాదవ్ అన్నారు. మరోవైపు సర్దార్ వల్లభాయ్ పటేల్ వ్యవసాయ మౌలిక సదుపాయాల మిషన్ కోసం రూ. 25 వేల కోట్లను కేటాయించడం. ఈ నిధుల ద్వారా రైతుల మౌలిక సదుపాయాలు మెరుగుపడే అవకాశం ఉన్నప్పటికీ, ఈ హామీ కూడా పూర్తిగా అమలు కాలేదని అఖిలేష్ అన్నారు.

## ఇక ఏడాదికి 2 సార్లు 10, 12 తరగతుల పరీక్షలు.. ముహూర్తం ఫిక్స్!



**హైదరాబాద్-నవభూమి:** విద్యార్థులకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) గుడ్‌న్యూస్ చెప్పింది. ఇకపై ఏడాదికి రెండు సార్లు బోర్డు పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పించనుంది. అన్నీ కుదిరితే 2026 నుంచే ఈ విధానం కార్యరూపం దాల్చనున్నట్లు తెలుస్తుంది. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అధ్యక్షతన స్కూల్ ఎడ్యుకేషన్ కార్యదర్శి, సీబీఎస్ఈ, ఎన్సీఈఆర్టీ, కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (కేవీఎస్), నవోదయ విద్యాలయ సమితి (ఎన్వీఎస్) ఉన్నతాధికారులతో మంగళవారం సమావేశం జరిగింది. దీనికి సంబంధించిన ముసాయిదాను ఏర్పాటుచేయగా.. వచ్చే సోమవారం నుంచి దీనిపై ప్రజాభిప్రాయాన్ని సేకరించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇది అమలులోకి వస్తే విద్యార్థులకు పరీక్షల స్ట్రెస్ ఇక ఉండదనే చెప్పాలి. అంతేకాదు వారి స్కోర్ మరింత పెంచుకోవడానికి కూడా అవకాశం ఉంటుంది. అంతేకాకుండా 2026-27 విద్యా సంవత్సరం నుంచి గ్లోబల్ కరిక్యులమ్ కూడా అందుబాటులోకి తీసుకురావలని సీబీఎస్సీ బోర్డు యోచిస్తుంది. అంటే ప్రపంచవ్యాప్తంగా అన్ని సీబీఎస్సీ అనుబంధ స్కూళ్లలో ఒకే విధమైన సిలబస్ ఉంటుందన్నమాట. ఏడాదికి రెండుసార్లు నిర్వహించే బోర్డు పరీక్షల్లో.. విద్యార్థులు ఏ పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధిస్తే, వాటినే పరిగణనలోకి తీసుకొంటారు. ఏడాదికి రెండుసార్లు బోర్డు పరీక్షలు నిర్వహించినా.. విద్యార్థులు రెండుసార్లూ పరీక్షలకు హాజరవ్వడం తప్పనిసరికాదు. జేఈఈ మాదిరిగా 10, 12 తరగతుల విద్యార్థులు కూడా బోర్డు పరీక్షలకు రెండుసార్లు హాజరవ్వొచ్చు. ఇది పూర్తిగా విద్యార్థుల ఛాయిస్. అలాగే ఇలా ఏడాదికి రెండుసార్లు బోర్డు పరీక్షల నిర్వహించడం వల్ల విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుందని ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. సీబీఎస్ఈ పది, పన్నెండో తరగతి పరీక్షలను ప్రస్తుతం ఫిబ్రవరి-మార్చిలో నిర్వహించి మేలో ఫలితాలు వెల్లడిస్తున్నారు. ఫెయిలైన విద్యార్థులకు జూలైలో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల్లోనే ఏదైనా ఒక సబ్జెక్ట్‌లో తమ మార్కులను మెరుగుపర్చుకోవడానికి పాసైన విద్యార్థులకూ అవకాశం కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు ఈ విధానం అమలులో ఉంది. అయితే తాజా విధానం అమల్లోకి వస్తే రెండు బోర్డు పరీక్షల మధ్య నిర్ణీత కాల వ్యవధి ఉంటుంది. అండర్ గ్రాడ్యుయేషన్ (యూజీ) ప్రవేశాలపై దీని ప్రభావం ఏ మాత్రం పడకుండా నూతన విద్యా క్యాలెండర్‌ను రూపొందించే అవకాశం ఉంది. దీంతో విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమవడానికి తగిన సమయం లభిస్తుంది. ఏడాదికి 2 సార్లు బోర్డు పరీక్షలు నిర్వహించే విధానం 2026 నుంచి అమలు చేసేందుకు కేంద్రం ముమ్మర ఏర్పాట్లు చేస్తుంది.

# భారత్‌లోకి టెస్లా ఎంట్రీ. మస్క్‌పై ట్రంప్ అసంతృప్తి



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన ఈవీ దిగ్గజం టెస్లా.. త్వరలోనే భారత మార్కెట్లోకి ఎంట్రీ ఇవ్వనుంది. ఇప్పటికే భారత్‌లో నియామక ప్రక్రియ ప్రారంభించిన విషయం తెలిసిందే. షోరూంల ఏర్పాటు కోసం కూడా ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీల వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో టెస్లా ఫ్యాక్టరీ ఏర్పాటుచేయాలనే ఎలాన్ మస్క్ ప్రణాళిక 'అన్యాయమే' అని ఆయన వ్యాఖ్యానించారు. మస్క్ పక్కన ఉండగానే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఇరువురూ కలిసి ఫాక్స్ న్యూస్ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత్‌లోకి టెస్లా ఎంట్రీపై ట్రంప్ మాట్లాడారు. "ఈ ప్రపంచంలోని ప్రతి దేశం అమెరికాను వినియోగించుకోడానికి ప్రయత్నిస్తోంది. భారీ సుంకాలతో మానుంచి లబ్ధి పొందాలని చూస్తుంటారు.. దీంతో ఎలాన్ మస్క్ తన కార్లను విక్రయించడం కష్టంగా మారుతోంది. ఇందుకు ఉదాహరణ భారతే..! ఇప్పుడు ఆయన (మస్క్) భారత్‌లో ప్లాంట్ ఏర్పాటుచేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన వరకు అది మంచిదే కావొచ్చు.. కానీ, అమెరికా పరంగా ఇది చాలా అన్యాయమైన నిర్ణయమే" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీతో గతవారం జరిగిన భేటీని ట్రంప్ గుర్తుచేసుకున్నారు. ఇరువురి భేటీలో ఎలక్ట్రిక్ కార్లపై అధిక సుంకాల విషయాన్ని మోదీతో తాను ప్రస్తావించినట్లు తెలిపారు. సుంకాల సమస్యను పరిష్కరించుకోవడం సహా వీలైనంత త్వరగా వాణిజ్య ఒప్పందం కోసం భారత్, అమెరికాలు కలిసి పనిచేయాలనే నిర్ణయానికి వచ్చినట్టు వెల్లడించారు. ఇటీవల అమెరికా పర్యటన సందర్భంగా టెస్లా చీఫ్‌తో మోదీ సమావేశమైన విషయం తెలిసిందే. ఆ తర్వాత కొన్ని రోజులకే ఆ సంస్థ భారత్‌లో నియామకాలు చేపట్టింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచే కార్యకలాపాలను ప్రారంభించే అవకాశం ఉంది. అయితే, విద్యుత్ వాహనాలు తయారీ ప్లాంట్ ఏర్పాటుపై టెస్లా ఇంకా నిర్ణయం తీసుకోలేదు. భారత్‌లోని పలు నగరాల్లో షోరూమ్‌లను తెరిచేందుకు ప్లాన్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఓ నివేదిక ప్రకారం తొలి రెండు షోరూమ్‌ల ఏర్పాటుకు దేశ రాజధాని ఢిల్లీ, ఆర్థిక రాజధాని ముంబయి నగరాలను ఎంపిక చేసినట్లు నివేదిక తెలిపింది.

## ఎన్నికల్లో ఓడిపోయుంటే నా జీవితం నాశనమయ్యేది: ట్రంప్



**న్యూఢిల్లీ-నవభూమి:** అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ షాకింగ్ కామెంట్లు చేశారు. తమ దేశంతో పాటు ఇతర దేశాల అధ్యక్షులు, ప్రధాన మంత్రులను సైతం తన మాటలు, చేతలతో భయపెట్టే ఈయన.. ఎన్నికల్లో ఓడిపోతే తన పరిస్థితో ఎలా ఉండేందో వివరించారు. గత ఎన్నికల్లో ఓడిపోయి నందుకే.. గత సర్కారు తనకు చుక్కలు చూపించిందని చెప్పారు. ఇప్పుడు ఓడిపోయి ఉంటే మాత్రం తన జీవితం నాశనం అయ్యేదని.. తరచుగా కోర్టులు, కేసులంటూ తిరగాల్సి వచ్చేదన్నారు. ఆ పూర్తి వివరాలు మీకోసం. అమెరికా 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ పదవీ బాధ్యతలు స్వీకరించిన విషయం అందరికీ తెలిసిందే. అయితే రెండోసారి అధ్యక్షుడిగా అమెరికా అధికార పగ్గాలు చేపట్టినప్పటి నుంచే ట్రంప్ చాలా దూకుడుగా వ్యవహరిస్తున్నారు. అక్రమంగా తమ దేశంలోకి వలస వచ్చిన విదేశీయులను ప్రత్యేక సైనిక విమానాల ద్వారా వారి స్వస్థలాలకు పంపిస్తున్నారు. దీనిపై ఎంత వ్యతిరేకత వస్తున్నా ఏమాత్రం పట్టించుకోకుండా తన పని తాను చేసుకుపోతున్నారు. అంతేకాకుండా అనేక మందిని ఉద్యోగాల నుంచి తొలగించి.. పాలన కొనసాగిస్తున్నారు. ఓవైపు పనామా కాలువను చేజిక్కుంచుకోవాలని, గ్రీన్‌లాండ్ దీవిని కొనుగోలు చేయాలని, కెనడాను అమెరికా 51 రాష్ట్రంగా మార్చాలని ఉందంటూ వివరించారు. ఇలా ఇంత మంది కోపానికి కారణం అవుతూనే, అనేక మందిని భయభ్రాంతులకు గురి చేస్తున్న ట్రంప్ తాజాగా షాకింగ్ కామెంట్లు చేశారు. ఎవరికీ భయపడని ఆయన ఎన్నికల్లో ఓడిపోతే తన జీవితం దుర్భరంగా మారి ఉండేదని చెప్పారు. ఈ ఎన్నికల్లో ఓడిపోయి ఉంటే తన పరిస్థితి చాలా ఘోరంగా ఉండేదని ట్రంప్ వ్యాఖ్యానించారు. గత సర్కారు తనతో చాలా దారుణంగా వ్యవహరించిందని మియామీలో నిర్వహించిన ఓ సదస్సులో పాల్గొని ఆరోపించారు. అంతేకాకుండా న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కుంటూ జీవితం గడిపే పరిస్థితి వచ్చుండేదన్నారు. అలాగే ఈ ఎన్నికల్లో ఓడిపోతే.. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు చాలా ఆలోచించే వాడినని చెప్పారు. ట్రంప్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడంతో అంతా షాక్ అవుతున్నారు. ఎంతో ధైర్యంగా ఉండే ఈయన కూడా భయపడతారా అంటూ కామెంట్లు చేస్తున్నారు.

## ఢిల్లీలో సీఎంతోపాటు మంత్రులకు ఏ శాఖలు ఉన్నాయంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీ తొమ్మిదో ముఖ్యమంత్రిగా రేఖ గుప్తా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రితో పాటు మరో ఆరుగురు మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. హెూం మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్‌లో, ఆరుగురు ఎమ్మెల్యేలను మంత్రులుగా చేస్తామని ఇప్పటికే ప్రకటించారు. వారిలో పర్వేష్ సాహిబ్ సింగ్ వర్మ, కపిల్ మిశ్రా, ఆశిష్ సూద్, మంజీందర్ సింగ్ సిర్సా, పంకజ్ కుమార్ సింగ్, రవీందర్ ఇంద్రజ్ ఉన్నారు. అయితే వీరికి తాజాగా శాఖలు కూడా కేటాయించారు. ఈ క్రమంలో ఎవరికి ఏ శాఖ ఉందనే విషయాలను ఇక్కడ చూద్దాం. రేఖ గుప్తా ప్రభుత్వంలోని ఇద్దరు మంత్రులు పోస్ట్ గ్రాడ్యుయేట్లు, ఇద్దరు గ్రాడ్యుయేట్లు, ఇద్దరు ప్రొఫెషనల్ గ్రాడ్యుయేట్లు. కాగా మంజీందర్ సింగ్ సిర్సా మంత్రివర్గంలో అతి తక్కువ చదువుకున్న మంత్రి. సిర్సా 12వ తరగతి పాస్. ఇద్దరు గ్రాడ్యుయేట్ మంత్రులలో జనక్‌పురి నుంచి గెలిచిన ఆశిష్ సూద్, బవానా నుంచి గెలిచిన రవీంద్ర ఇంద్రరాజ్ సింగ్ ఉన్నారు. రవీంద్ర ఇంద్రరాజ్ సింగ్ బి.ఎ. పట్టా పొందగా, ఆశిష్ సూద్ బి.కాం. డిగ్రీ చేశారు. ప్రొఫెషనల్ గ్రాడ్యుయేట్ మంత్రులలో ముఖ్యమంత్రి రేఖ గుప్తా, వికాస్‌పురి నుంచి గెలిచిన పంకజ్ కుమార్ సింగ్ ఉన్నారు.

## దళిత వరుడు వివాహానికి గుర్రంపై ఊరేగింపుగా రావడం తప్పా..!



**న్యూఢిల్లీ-నవభూమి:** రాజస్థాన్‌లోని జలోర్ జిల్లాలోని సాంచోర్‌లో, దళిత వరుడు గుర్రంపై స్వారీ చేస్తుండగా నలుగురు యువకులు గుర్రాన్ని లాక్కున్నారు. దీని కారణంగా వివాహ ఆచారాలు ఆగిపోయాయి. పోలీసుల జోక్యంతో గుర్రాన్ని తిరిగి తీసుకువచ్చి వివాహ ప్రక్రియను పూర్తి చేశారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. రాజస్థాన్‌లో అమానుష ఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. దళిత వరుడి గుర్రపు స్వారీ సందర్భంగా వివాదం చెలరేగింది. దళిత వరుడు గుర్రంపై ఊరేగడం సహించలేకపోయారు. వెంటనే ఆ గుర్రాన్ని లాక్కెళ్లిపోయారు కొందరు దుండగులు. ఈ ఘటన జలోర్ జిల్లాలో చోటు చేసుకుంది. ని సాంచోర్‌లో నలుగురు యువకులు దళిత వరుడి గుర్రాన్ని తీసుకుని పారిపోయారు. దీని తర్వాత బాధితుడి కుటుంబం పోలీసులకు సమాచారం ఇచ్చింది. సమాచారం అందిన వెంటనే, పోలీసులతో పాటు జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చివరికి పోలీసుల సమక్షంలో వివాహ ఆచారాలు పూర్తయ్యాయి. వివాహం సమయంలో పోలీసులు అధికార యంత్రాంగం అక్కడే ఉన్నారు. సమాచారం ప్రకారం, దళిత వరుడు గుర్రంపై కూర్చుని తోరణాన్ని కొట్టబోతుండగా, నలుగురు యువకులు అక్కడికి వచ్చి వరుడిని బెదిరించింది. ఆ తర్వాత నలుగురు నిందితులు వరుడి గుర్రంతో పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిందితుడి కోసం వెతుకులాట కొనసాగించారు. ఎట్టకేలకు గుర్రాన్ని తిరిగి తీసుకువచ్చారు. దీని తరువాత, పోలీసు రక్షణలో యువకుడి వివాహం పూర్తి అయ్యింది. ఈ సంఘటన మంగళవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో జలోర్‌లోని సాంచోర్‌లో జరిగింది. సాంచోర్‌లోని హరియాలి గ్రామానికి చెందిన సురేష్ కుమార్ కుటుంబంలో వివాహ కార్యక్రమం జరిగింది. కూతురు పూజ వివాహం బలోతారా నివాసి సునీల్‌తో నిశ్చయమైంది. వివాహ ఊరేగింపు మంగళవారం రాత్రి ఆలస్యంగా హరియాలికి చేరుకుంది. సంప్రదాయం ప్రకారం, వరుడు గుర్రంపై తోరణ్‌కు వెళ్లాలి. అయితే కొందరు ముష్కరులు అప్పటికే ఆ కుటుంబాన్ని బెదిరించారు. ఆ కుటుంబం కేవలం 50 అడుగుల దూరం గుర్రంపై నడిచి ఆచారాన్ని త్వరగా పూర్తి చేసింది. రాత్రి 11:30 గంటలకు నలుగురు యువకులు అక్కడికి చేరుకున్నారు. అతను కుటుంబాన్ని దుర్భాషలాడి, గుర్రాన్ని లాక్కొని పారిపోయారు. బాధితుడి కుటుంబం పోలీసు కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇచ్చింది. సమాచారం అందిన వెంటనే, సాంచోర్, జాబ్ పోలీస్ స్టేషన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తరువాత, దౌలత్రం, జ్ఞాన్‌చంద్ యాదవ్, కాంబ్లే శరణ్ గోపీనాథ్, ప్రమోద్ కుమార్ కూడా అక్కడికి వచ్చారు. పోలీసులు నిందితుడి నుండి గుర్రాన్ని తిరిగి తీసుకువచ్చారు. పోలీసుల సమక్షంలో, వరుడిని గుర్రంపై కూర్చోబెట్టి వివాహ ఆచారాలను పూర్తి చేశారు. ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మరో ఇద్దరు నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది. వివాహం జరిగిన సమయంలో పోలీసు బలగాలు భారీ భద్రతను ఏర్పాటు చేశాయి.

## 270 కిలోల రాడ్ మెడపై పడి.. వెయిట్ లిఫ్టర్ మృతి!




**జైపూర్-నవభూమి:** రాజస్థాన్‌లోని బికనీర్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. జూనియర్ నేషనల్ గేమ్స్‌లో బంగారు పతకాన్ని సాధించిన యష్టిక ఆచార్య (17) దుర్మరణం చెందారు. మంగళవారం (ఫిబ్రవరి 18) జిమ్‌లో ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు 270 కేజీల బరువైన రాడ్ ఆమె మెడపై పడింది. ఈ క్రమంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. అయితే జిమ్ సిబ్బంది ఆమెను వెంటనే దవాఖానకు తరలించగా.. అక్కడ పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. ఈ మేరకు యువ క్రీడాకారిణి యష్టిక మృతి చెందిన విషయాన్ని నయా షహర్ ఎస్‌హెచ్‌ఓ విక్రమ్ తివారీ మీడియాకు వెల్లడించారు. జిమ్‌లో ట్రైనర్ యష్టికతో 270 కిలోల రాడ్డును ఎత్తేందుకు ప్రయత్నించాడు. అయితే ఆ బరువును యష్టిక ఆపలేకపోయింది. దీంతో వెనక్కి వాలుకుంటూ వెళ్లి పడిపోయింది. ఈ క్రమంలో రాడ్ ఆమె మెడపై పడింది. దీంతో మెడ ఎమెకలు విరిగి ఆమె మృతి చెందింది. ఈ ఘటనలో యష్టిక కింద పడిపోతున్న సమయంలో ఆమె వెనుకే ఉన్న ట్రైనర్‌కు యష్టిక తల తగిలి అతడికీ గాయమైంది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే దీనిపై యష్టిక కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయలేదని, పోస్ట్‌మార్టం అనంతరం ఆమె మృతదేహాన్ని వారికి బుధవారం అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. కాగా యష్టిక చిన్న తనంలోనే ఎన్నో ఉన్నత శిఖరాలను సాధించింది. ఆమె మరణం క్రీడా ప్రపంచంలో అంతులేని విషాదాన్ని నింపింది.

## డిప్యూటీ సీఎంకు బాంబు బెదిరింపు.. రంగంలోకి పోలీసులు




**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలో బాంబు బెదిరింపు ఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇటీవల ప్రధాని మోదీ అమెరికాకు వెళ్లిన క్రమంలో ఆయన ప్రయాణిస్తున్న విమానానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. అవి మరువకముందే తాజాగా మరొకటి వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలోనే మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే(కు బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆయన వాహనాన్ని పేల్చివేస్తానని బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం తెలుసుకున్న ముంబై పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేస్తున్నారు. దీంతో మెయిల్ చేసిన వ్యక్తి ఎవరు, ఎందుకు చేశారనే వివరాలను ఆరా తీస్తున్నారు. పోలీసులు చెబుతున్న వివరాల ప్రకారం గోరేగావ్ పోలీస్ స్టేషన్, మంత్రాలయ, జేజే మార్గ్ పోలీస్ స్టేషన్ సహా అనేక ప్రాంతాలకు ఇమెయిల్ వచ్చింది. ఆ క్రమంలో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే వాహనంపై దాడి జరిగే ఛాన్స్ ఉన్నట్లు ఇమెయిల్ మెసేజ్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు వాటిని పంపించిన వారి వివరాల గురించి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ప్రాథమిక దర్యాప్తులో నకలీ మెయిల్ కావచ్చని అధికారులు భావిస్తున్నారు. కానీ ఒకవేళ నిజం అయితే ఎలా అని, డిప్యూటీ సీఎం భద్రతను పెంచడంతోపాటు నిఘా బృందాలను అప్రమత్తం చేశారు. ఈ క్రమంలో ఇమెయిల్, చిరునామా ద్వారా బెదిరింపు మెయిల్స్ పంపించిన వారి గురించి సమాచారం సేకరిస్తున్నారు. మరోవైపు ఇటీవల డిప్యూటీ సీఎం నివాస పరిధిలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించారా అనే విషయాలను కూడా పోలీసులు తెలుసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పంపినవారిని గుర్తించడానికి సమగ్ర దర్యాప్తు జరుగుతోందని అధికారులు హామీ ఇచ్చారు. అనుమానితుల కోసం గాలింపు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలు చోటుచేసుకుంటే తెలపాలని కోరారు. దీంతోపాటు ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

## ఆ ఇంట్లో రోజూ తెల్లవారుజామున వింత శబ్దాలు




**పథనంథిట్ట-నవభూమి:** ఉరుకుల పరుగుల జీవితంలో ఎక్కువ మంది ఎదుర్కొంటున్న సమస్యల్లో నిద్రలేమి ఒకటి. చాలా మంది ప్రశాంతమైన నిద్రకు దూరమవుతున్నారు. ఫలితంగా శారీరకంగా, మానసికంగా పలు అనారోగ్య సమస్యలతో పాటు ఒత్తిడి, పనిపై సరిగా దృష్టిపెట్టలేక పోవడం వంటి వివిధ ప్రాబ్లమ్స్?ను ఎదుర్కొంటున్నారు. రాత్రిళ్లు ఛాటింగ్, వెబ్ సిరీస్ అంటూ కాలక్షేపం చేస్తూ నిద్రపోవడం లేదు. కానీ కేరళలో ఓ వృద్ధుడికి కోడి పుంజు వల్ల నిద్రపట్టడంలేదు. చివరకు అది రెండిళ్ల మధ్య వివాదానికి దారితీసింది. మరి ఆ వివాదం ఎలా పరిష్కారమైంది? కేరళలో రాధాకృష్ణ కురూప్ అనే వృద్ధుడికి కొత్త సమస్య వచ్చిపడింది. ఈ మధ్య కాలంలో ప్రశాంతమైన నిద్ర లేదు. తెల్లవారుజామున 3 గంటలైతే చాలు.. ఎంత గాఢనిద్రలో ఉన్నా గంట కొట్టినట్లు లేచి కూర్చొంటున్నారు. కారణం.. పొరుగింటి వారు పెంచుతున్న కోడిపుంజులు. కేరళలోని పథనంథిట్ట జిల్లా పల్లికల్ గ్రామవాసి అయిన రాధాకృష్ణ ఇంటి పక్కనే అనిల్‌కుమార్ నివసిస్తున్నారు. అనిల్ ఇంట్లో పెంచుకొంటున్న కోడిపుంజులు ప్రతిరోజు తెల్లవారుజాము 3 గంటలకు కొక్కొరొక్కో అంటూ కూతలు మొదలుపెడతాయి. ఈ వ్యవహారం రెండిళ్ల మధ్య వివాదానికి దారి తీసింది. ఇక లాభం లేదని అదూర్ ఆర్డీవో కార్యాలయంలో రాధాకృష్ణ ఫిర్యాదు చేశారు. అధికారుల బృందం ఆ రెండిళ్లను పరిశీలించింది. పై అంతస్తులో అనిల్ కోడిపుంజులను పెంచుతున్నారని, పొరుగింటికి ఇబ్బందికరంగా ఉన్న మాట వాస్తవమేనని వారు నివేదిక ఇచ్చారు. దీంతో అనిల్, రాధాకృష్ణలను పిలిచి చర్చించిన ఆర్డీవో పై అంతస్తులో ఉన్న పౌల్ట్రీ షెడ్డును ఇంటికి దక్షిణం దిక్కుకు మార్చాలని అనిల్‌ను ఆదేశించారు. ఇలా మార్చేందుకు అతడికి 14 రోజులు గడువిచ్చారు. ఈ వెరైటీ వివాదానికి ఇలా ఫుల్ స్టాప్ పెట్టారు.

## రేఖా గుప్తా ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆప్ ఎంపీ ప్రత్యక్షం




**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం స్థానిక రాం లీలా మైదానంలో ఏర్పాటు చేసిన భారీ వేదికపై ఆమె చేత ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సెనా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షాతో పాటు ఆ పార్టీ అగ్రనేతలే కాదు.. ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతలు సైతం హాజరయ్యారు. అయితే ఈ కార్యక్రమానికి ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యురాలు స్వాతి మలివాల్ సైతం హాజరయ్యారు. ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె.. ఢిల్లీ కాంగ్రెస్ పార్టీ చీఫ్ దేవేంద్ర యాదవ్‌తో మాట్లాడుతోన్నారు. అందుకు సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాతోపాటు మీడియాలో వైరల్ అవుతోంది.

## ట్రైన్‌లోని జనరల్ భోగీలో అనుమానాస్పదంగా రెండు బ్యాగులు..



**న్యూఢిల్లీ-నవభూమి:** మాదకద్రవ్యాల మత్తులో పడి యువత చిత్తవుతోంది. తల్లిదండ్రుల కలల్ని నెరవేర్చాల్సిన పోయి.. వారు ఊహ లోకంలో పయనిస్తూ.. మైకంలో తేలిపోతున్నారు. అవును సామీ.! గంజాయి మత్తులో పడి.. యువత భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ గంజాయి మత్తును కూకటివేళ్లతో పెకిలించాలని డిసైడ్ అయ్యాయి. ఈ క్రమంలోనే పోలీసులకు ఫుల్ పవర్స్ కూడా ఇచ్చేశాయి. తాజాగా అరక్కోణం రైల్వేస్టేషన్‌లో సుమారు 11 ప్యాకెట్లలో 22 కేజీల ఎండు గంజాయిని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) పోలీసులు పట్టుకున్నారు. చేసేందుకు ప్రయత్నించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ రోజు బుధవారం, అరక్కోణం రైల్వే స్టేషన్‌కు అప్పుడే టాటానగర్(జార?ండ్)-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ వచ్చింది. ఆ ట్రైన్‌లో ఆర్‌పీఎఫ్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇక వారికి జనరల్ కంపార్ట్‌మెంట్‌లో అనుమానాస్పదంగా రెండు టూరిస్ట్ బ్యాగులు కనిపించాయి. వాటిని చెక్ చేయగా దెబ్బకు బిత్తరపోయారు. అందులో 11 ప్యాకెట్ల గంజాయి కనిపించింది. అది సుమారు 22 కేజీలు ఉంటుందని అంచనా. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. ఆ గంజాయి ఎవరిది.? ఆ బ్యాగులు ఎవరివై ఉంటుంది.? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పాల ధర పెరిగే అవకాశం.. లీటర్‌కు రూ.5 వరకు..



**బెంగళూరు-నవభూమి:** రాష్ట్రంలో నందిని బ్రాండ్ పాల ధర పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రాష్ట్ర బడ్జెట్ సమర్పించిన వెంటనే కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ (కేఎంఎఫ్) కూడా పాల ధర పెంచే అవకాశం ఉందని తెలుస్తోంది. కనీసం లీటరుకు రూ.5 వరకు పెరిగే అవకాశం ఉందని సమాఖ్య వర్గాల ద్వారా తెలుస్తోంది. మార్చి 7న ముఖ్యమంత్రి సిద్దరామయ్య(బడ్జెట్ సమర్పించనున్నారు. ఆ వెంటనే పాలధర లీటరుకు రూ.5 పెరిగే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే బీఎంటీసీ, కేఎస్ఆర్టీసీ బస్సు చార్జీలు, నమ్మ మెట్రో చార్జీలు పెరిగిన విషయం విదితమే. తాజాగా రాష్ట్రంలోని వివిధ పాల సమాఖ్యలనుంచి ఒత్తిడి పెరగడంతో పాలధరను కనీసంగా లీటరుకు రూ.5 పెంచే అవకాశం ఉందని తెలుస్తోంది. జనవరిలో రాష్ట్రంలోని 16 పాల సమాఖ్యల అధ్యక్షులు, డైరెక్టర్‌లు, ఎండీలు, కేఎంఎఫ్ ప్రతినిధులతో పశు సంవర్ధకశాఖ మంత్రి కే వెంకటేశ్ సమావేశం నిర్వహించారు.




# తారక్ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్.. నీల్ మొదలెట్టాడు

ఎన్టీఆర్ దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. గతేడాది పూజా కార్యక్రమాలతో ఈ సినిమా మొదలైంది. అయితే ఇప్పటిదాకా సెట్స్ మీదకు వెళ్లలేదు. అయితే తాజాగా ఈ సినిమా షూటింగ్ మొదలు కాబోతుందని, ఎన్టీఆర్ లేని సన్నివేశాలు చిత్రీకరిస్తారని, వచ్చే నెల మొదటివారంలో ఎన్టీఆర్ సెట్‌లో అడుగుపెటతారని వార్తలొచ్చాయి. తాజాగా ఈ సినిమా రెగ్యులర్ షూట్ మొదలైనట్లు చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది. 'భారతీయ సినిమా చరిత్రలో ఒక మార్క్‌ని క్రియేట్ చేసేలా ఈ మట్టి ఎట్టకేలకు తన పాలనను స్వాగతించింది. ఎన్టీఆర్ – నీల్ సినిమా అధికారికంగా మొదలైంది. ప్రేక్షకులను అలరించేందుకు సరికొత్త యాక్షన్, వినోదం సిద్ధమవుతోంది" అని టీమ్ పేర్కొంది.

చిత్రీకరణకు సంబంధించిన ఫొటోలు సైతం పంచుకుంది. ఫొటోలో ప్రశాంత్ నీల్ యాక్షన్ సన్నివేశాన్ని డైరెక్ట్ చేస్తూ కనిపించారు. ఎన్టీఆర్ ఇంకా ఈ చిత్రీకరణలో భాగం కాలేదని తెలుస్తోంది. తారక్ హీరోగా నటిస్తున్న 31వ చిత్రమిది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. పీరియాడిక్ మాస్ యాక్షన్ డ్రామాగా రూపొందనుంది. రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా సందడి చేయనుంది. టొవినో థామస్ కీలక పాతలో కనిపించనున్నారు. వచ్చే ఏడాది జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుంది సినిమా.



# పెంకుటిల్లు ఎక్కిన హీరోయిన్ 'మనసుకు నచ్చింది'



'మనసుకు నచ్చింది' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన నార్త్ బ్యూటీ అమైరా దస్తూర్. ఇండస్ట్రీలో అడుగు పెట్టి దశాబ్ద కాలం దాటినా ఆశించిన స్థాయిలో గుర్తింపు దక్కించుకోలేక పోయింది. అయితే సోషల్ మీడియాలో ఈ అమ్మడు షేర్ చేస్తున్న అందమైన ఫోటోల కారణంగా వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. బాలీవుడ్‌లో 2013లో సినీ కెరీర్‌ను ప్రారంభించిన ఈ అమ్మడు ఆ తర్వాత టాలీవుడ్లో మనసుకు నచ్చింది, రాజుగాడు సినిమాల్లో నటించింది. ఆ రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిచాయి. దాంతో టాలీవుడ్‌లో పెద్దగా ఆఫర్లు సొంతం చేసుకోలేక పోయింది. కానీ హిందీలో మాత్రం ఈ అమ్మడు వరుసగా సినిమాలు చేసే అవకాశాలు దక్కించుకుంది. ఇసాక్ సినిమాతో బాలీవుడ్‌లో పరిచయం అయిన అమైరా దస్తూర్ ఆ తర్వాత మిస్టర్ ఎక్స్ సినిమాలో నటించింది. కాలకండి, రాజ్మా చావల్, జడ్జిమెంటల్ హై క్యా, ప్రస్థానం, కోయి జానేనా సినిమాల్లో హీరోయిన్‌గానే కాకుండా కొన్ని సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగానూ నటించింది. పలు సినిమాలు మంచి విజయాన్ని సొంతం చేసుకున్న ఈమెకు మాత్రం గుర్తింపు రాలేదు. బాలీవుడ్ ఫిల్మ్ మేకర్స్ ఈ అమ్మడిని లైట్ తీసుకున్నారు. ఎన్నో సినిమాల్లో తన అందంతో అలరించిన అమైరా సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందాల ఆరబోత చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. తాజాగా పెంకుటిల్లు ఎక్కడం ద్వారా వార్తల్లో నిలిచింది. ఫోటో షూట్ కోసం అమైరా దస్తూర్ ఏకంగా పెంకుటిల్లు ఎక్కింది. లోయర్ యాంగిల్‌లో అమైరా దస్తూర్ ఫోటోలను క్లిక్ చేశారు. ఈ స్థాయి అందం కేవలం ఈ అమ్మడికే సాధ్యం అంటూ కొందరు కామెంట్స్ చేస్తూ ఉంటే, వావ్ ఈమె అందానికి ఫిదా అయ్యాం అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. గతంలో ఎన్నో సార్లు ఆకట్టుకునే అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేసిన అమైరా దస్తూర్ ఈసారి మరింత విభిన్నంగా ఉందంటూ నెటిజన్స్ ఈ ఫోటోలను తెగ లైక్ చేసి కామెంట్ చేస్తున్నారు. వైట్ డ్రెస్‌లో ఇంతటి అందంగా ఉన్న అమైరా దస్తూర్‌ను ఎందుకు ఫిల్మ్ మేకర్స్ పట్టించుకోవడం లేదు... ఈమె అందంకు, ప్రతిభకు తగ్గట్లుగా ఎందుకు ఆఫర్లు రావడం లేదు అంటూ కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముందు ముందు అయినా ముద్దుగుమ్మ అమైరా దస్తూర్‌కి మంచి సినిమాల్లో ఆఫర్లు రావాలని, సినిమాల్లో కాకున్నా వెబ్ సిరీస్‌ల్లో అయినా ఈ అమ్మడు నటించాలని నెటిజన్స్, ఫాలోవర్స్ కోరుకుంటున్నారు. ఇంత అందంగా ఉన్న అమైరా దస్తూర్ మరో పదేళ్ల పాటు ఇండస్ట్రీ ఉండేందుకు అర్హురాలు అంటూ ఈ ఫోటోలకు కొందరు కామెంట్ చేస్తున్నారు.

# 'మజాకా' బ్యూటీ కోరికలు ఇలా ఉన్నాయ్!

తెలుగు హీరోయిన్ రీతు వర్మ గురించి పరిచయం అవసరం లేదు. సొగసరి ఇప్పటికే తెలుగు, తమిళ్ లో చాలా సినిమాలు చేసింది. 'ప్రేమ ఇష్క్ కాదల్' తో ఎంట్రీ ఇచ్చిన రీతూ చాలా తెలుగు సినిమాలు చేసింది. అటుపై కోలీవుడ్ లోనూ చాలా సినిమాల్లో నటించింది. కానీ రీతూకు ఇంకా టాలీవుడ్ లో రావాల్సినంత గుర్తింపు రాలేదు. ఖాళీ లేకుండా సినిమాలైతే చేస్తుంది గానీ ఫేమస్ కాలేకపోతుంది. ప్రస్తుతం తెలుగులో 'మజాకా' చిత్రంలో నటిస్తోంది. ఇందులో యంగ్ హీరో సందీప్ కిషన్‌కి జోడీగా నటిస్తుంది. సినిమాలో అమ్మడు కాస్త రొమాంటిక్ గానూ కనిపించనుందని ప్రచారంలో ఉంది. హీరోతో లిప్ లాక్ లు వేసినట్లు వినిపిస్తుంది. అయితే తాను పోషించాలనుకుంటోన్న పాత్రలు, డ్రీమ్ రోల్స్ ఇంకా అలాగే మిగిలిపోయాయని ప్రచారంలో భాగంగా రివీల్ చేసింది. నా సినీ ప్రయణాం పట్ల చాలా సంతోషంగా ఉన్నాను. ఎందుకంటే నేను నటి అవ్వాలని ఎప్పుడూ అనుకోలేదు. ఇప్పుడు అనుభవిస్తోన్న జీతితమంతా నేను అనుకోకుండా సినిమాల్లోకి రావడంతోనే సాధ్యమైంది. ఆ రకంగా నేను అదృష్టవంతురాలినే. నటిగా చాలా సినిమాల్లో భాగమయ్యాను. వాటిలో గుర్తుంచుకునే కొన్ని పాత్రలున్నాయి. కానీ నాకంటూ కొన్ని డ్రీమ్ రోల్స్ ఉన్నాయి. యాక్షన్ ప్రాధన్యమున్న చిత్రాలు చేయాలని ఉంది. అలాగే పీరియాడిక్ చిత్రాలు..యువరాణి పాత్రల్లో నటించాలన్నది ఎప్పటి నుంచో ఉన్న కోరిక. 'మజాకా'తో కామెడీ సినిమా కూడా చేస్తున్నా. ప్రస్తుతం తెలుగులో ఓ మల్టీస్టారర్ సినిమా చేస్తున్నా'అని తెలిపింది. అయితే ఆ మల్టీస్టారర్ వివరాలు మాత్రం రీతూ రివీల్ చేయలేదు. అలాగే 'శ్రీకారం' ఫేం కిషోర్ దర్శకత్వంలో ఓ వెబ్ సిరీస్ కూడా చేస్తున్నట్లు రివీల్ చేసింది.



# కుంభమేళాలో స్నేహారెడ్డి - ఫ్యామిలీతో దేవరకొండ



విజయ్ దేవరకొండ ఇటీవలే ప్రపంచంలోని అతిపెద్ద ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా మహాకుంభ్ 2025లో పూజలు ఆచారాల్లో పాల్గొన్న సంగతి తెలిసిందే. తనతో పాటు తల్లి మాధవి దేవరకొండ, అల్లు అర్జున్ భార్య స్నేహ రెడ్డి సహా సన్నిహితులు, కుటుంబ సభ్యులు కూడా ఈ ఆధ్యాత్మిక యాత్రలో ఉన్నారు. ముఖ్యంగా అల్లు అర్జున్ భార్య స్నేహారెడ్డితో విజయ్, అతడి కుటుంబం కలిసి ఉన్న ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అయింది. విజయ్ ఒక సాధారణ భక్తుడిలా మెడలో పూల దండతో కనిపించగా, ఇతరులు సాధారణ దుస్తుల్లో కనిపించారు. స్నేహ రెడ్డి సాంప్రదాయ దుస్తుల్లో కనిపించారు. దేవరకొండ ప్రయాగ్ రాజ్ లోని కుంభమేళా నుంచి ఫోటోలను తన సోషల్ మీడియాలో షేర్ చేయగా వైరల్ అయ్యాయి. గంగ, యమునా, సరస్వతి నదుల త్రివేణి సంగమంలో తాను తన తల్లి పవిత్ర స్నానం చేస్తున్న ఫోటోలను విజయ్ పోస్ట్ చేశారు. 2025 కుంభమేళా – మన పూర్వీకుల మూలాలను గౌరవించడానికి, కనెక్ట్ అవ్వడానికి ఒక ప్రయాణం. నా ప్రియమైన గ్యాంగ్ తో ఇక్కడికి వచ్చానని విజయ్ అన్నారు. దేవరకొండ తన మూలాలతో కనెక్ట్ అవ్వడానికి, పెద్దలను గౌరవించడానికి ఒక మార్గంగా దీనిని అభివర్ణించారు. త్రివేణి సంగమంలో స్నానం చేసిన అనంతరం విజయ్ మరో ఆధ్యాత్మిక ప్రదేశం కాశీని కూడా సందర్శించాడు. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. తదుపరి విజయ్ జెర్సీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలోని పాన్-ఇండియన్ యాక్షన్ డ్రామా కింగ్‌డమ్‌లో నటిస్తున్నాడు. ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఇటీవల విడుదలైన ఈ సినిమా టీజర్ సానుకూల బజ్‌ను సృష్టిస్తోంది. హిందీ, తెలుగు, తమిళ భాషలలో వరుసగా రణబీర్ కపూర్, జూనియర్ ఎన్టీఆర్, సూర్య నేపథ్యంలో వాయిస్‌ని అందించారు. కింగ్‌డమ్ వార్ నేపథ్యంలో హై ఆక్టేన్ యాక్షన్ డ్రామా కథతో రూపొందుతోంది. తన ప్రజలను రక్షించడానికి బయల్దేరే రక్షకుడి పాత్రలో విజయ్ దేవరకొండ నటిస్తున్నారు. ఈ చిత్రం రెండు భాగాలుగా తెరకెక్కుతోంది. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు.

# మోక్షు బాబు డెబ్యూ.. ఇంకా ఎంత కాలం?



టాలీవుడ్ సీనియర్ హీరో బాలకృష్ణ వారసుడు మోక్షజ్ఞ సినీ ఎంట్రీ కోసం.. అటు నందమూరి అభిమానులు.. ఇటు సినీ ప్రియులు ఎంతో వెయిట్ చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే మోక్షు బాబు డెబ్యూ మూవీ అనౌన్స్మెంట్ వచ్చినా.. ఇంకా సెట్స్ పైకి వెళ్లలేదు. పూజా కార్యక్రమాలు కూడా జరగలేదు. జస్ట్ ఓ పోస్టర్‌తో ప్రకటన మాత్రమే వచ్చింది. హనుమాన్ మూవీతో ఒక్కసారి లైమ్ లైట్ లోకి వచ్చిన ప్రశాంత్ వర్మ.. మోక్షజ్ఞ డెబ్యూ మూవీని తెరకెక్కించనున్నట్లు అనౌన్స్మెంట్ వచ్చిన విషయం తెలిసిందే. అది జరిగి ఆరు నెలలు దాటుతున్నా.. ఇంకా ఎలాంటి అప్డేట్ లేదు. దీంతో ప్రాజెక్ట్ ఆగిపోయిందని ఆ మధ్య సోషల్ మీడియాలో ఊహాగానాలు చక్కర్లు కొట్టాయి. ఆ తర్వాత ప్రశాంత్ వర్మ కాదని.. మోక్షజ్ఞ డెబ్యూ డైరెక్టర్ ఈయనే అంటూ పలువురు పేర్లు కూడా వినిపించాయి. బాలయ్య స్వయంగా పరిచయం చేస్తారని కూడా టాక్ వచ్చింది. కానీ ఇప్పుడు నెట్టింట క్రేజీ అప్డేట్ చక్కర్లు కొడుతోంది. ప్రశాంత్ వర్మ మూవీతో మోక్షు బాబు ఎంట్రీ ఇస్తారని.. కానీ కాస్త టైమ్ పడుతుందని తెలుస్తోంది. ఎందుకంటే ప్రశాంత్ వర్మ.. ఇప్పుడు జై హనుమాన్ మూవీ పనులతో బిజీగా ఉన్నారు. గత ఏడాది సంక్రాంతికి వచ్చిన బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచిన హనుమాన్ మూవీకి సీక్వెల్‌గా ఆ సినిమా తెరకెక్కుతోంది. ప్రస్తుతం జై హనుమాన్ మూవీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కన్నడ స్టార్ హీరో రిషబ్ శెట్టి సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రశాంత్ వర్మ మోక్షజ్ఞ మూవీ స్టార్ట్ చేయనున్నారని తెలుస్తోంది. ఇప్పటికే ఆ విషయాన్ని బాలయ్యకు చెప్పగా.. ఆయన ఓకే చెప్పేశారట. దీంతో ఇప్పుడు జై హనుమాన్‌ను పూర్తి చేస్తున్నారు ప్రశాంత్. అదే సమయంలో మోక్షు బాబు.. యాక్టింగ్‌తోపాటు వివిధ విభాగాల్లో ట్రైనింగ్ తీసుకోనున్నారని సమాచారం. మొత్తానికి మోక్షు డెబ్యూ మూవీకి సంబంధించిన అప్డేట్ రావడంతో నందమూరి ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అయిపోతున్నారు. అయితే జై హనుమాన్ పూర్తవ్వడానికి మరికొన్ని నెలల సమయం కచ్చితంగా పడుతుంది. ఎందుకంటే అది చాలా పెద్ద ప్రాజెక్ట్. 2025 చివరికల్లా పూర్తి చేయాలని ప్రశాంత్ వర్మ ఫిక్స్ అయ్యారట. దీంతో మోక్షు ఫస్ట్ మూవీ 2026లోనే రిలీజ్ అవ్వనున్నట్లు తెలుస్తోంది. మరి చూడాలి ఏం జరుగుతుందో..

# సారీ చెప్పిన రోహిత్.. చేతులు జోడించి..



**న్యూఢిల్లీ–నవభూమి:** భారత కెప్టెన్ రోహిత్ శర్మ క్షమాపణలు చెప్పాడు. సారీ అంటూ చేతులు జోడించి వేడుకున్నాడు. చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా భారత్–బంగ్లాదేశ్ మధ్య జరుగుతున్న తొలి మ్యాచ్‌లో ఇది చోటుచేసుకుంది. హిట్‌మ్యాన్ సారీ చెప్పింది మరెవరికో కాదు.. స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్‌కే. బంగ్లా బ్యాటింగ్ సమయంలో అక్షర్ వరుసగా రెండు బంతుల్లో 2 వికెట్లతో జోరు మీదున్నాడు. 9వ ఓవర్‌లో తంజిద్ హసన్ (25), ముష్ఫికర్ రహీం (0)ను బ్యాక్ టు బ్యాక్ పెవిలియన్‌కు పంపించాడు అక్షర్. ఆ తర్వాతి బంతికి జేకర్ అలీని కూడా దాదాపుగా ఔట్ చేయబోయాడు. అయితే రోహిత్ తప్పిదంతో హ్యాట్రిక్ మిస్ చేసుకున్నాడు అక్షర్. జేకర్ ఇచ్చిన క్యాచ్‌ను స్లిప్స్‌లో నిల్చున్న రోహిత్ జారవిడిచాడు. చేతుల్లోకి వచ్చిన క్యాచ్‌ను నేలపాలు చేశాడు. ఈజీ క్యాచ్‌ను వదిలేయడంతో టీమ్ ఆటగాళ్లంతా నిరాశలో కూరుకుపోయారు. హిట్‌మ్యాన్ కూడా కోపం తట్టుకోలేకపోయాడు. తప్పు చేశానంటూ నేలను గట్టిగా కొట్టాడు. అనంతరం ఎలాగోలా సంభాళించుకున్నాడు. హ్యాట్రిక్ వచ్చేసిందని ఎంతో ఆశగా చూసిన అక్షర్ నిరాశలో కూరుకుపోవడంతో అతడికి సారీ చెప్పాడు రోహిత్. చేతులు జోడించి అతడి వైపు చూస్తూ క్షమాపణలు చెప్పాడు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. కాగా, బంగ్లాదేశ్ ప్రస్తుతం 21.5 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 84 పరుగులతో ఉంది. జేకర్ అలీ (24 నాటౌట్), తౌహిద్ హృదయ్ (26 నాటౌట్) ఇప్పుడు క్రీజులో ఉన్నారు.

# భారత్-పాక్ మ్యాచ్.. గెలవాలంటే అదొక్కటే మార్గం అంటున్న షోయబ్



**న్యూఢిల్లీ–నవభూమి:** భారత్ వర్సెస్ పాకిస్థాన్.. క్రికెట్‌లో టాప్ ఫైట్స్‌లో మొదటి వరుసలో నిలిచే పోరు ఇది. ఈ చిరకాల ప్రత్యర్థులు బరిలోకి దిగి కొదమసింహాల్లా కొట్లాడుతుంటే చూడాలని ప్రతి అభిమాని కోరుకుంటాడు. ఇరు దేశాల మధ్య సుదీర్ఘ కాలంగా ఉన్న వైరికి తోడు గ్రౌండ్‌లోకి దిగితే ఆఖరి వరకు పోరాడే తీరు, ఓటమిని ఒప్పుకోని తత్వం ఈ మ్యాచులపై ఎక్కడలేని ఆసక్తిని రేపుతాయి. అలాంటిది ఐసీసీ ఈవెంట్స్‌లో తలపడితే ఎగ్జయిట్‌మెంట్ ఏ రేంజ్‌లో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఫిబ్రవరి 23న ఈ రెండు హేమాహేమీలు తాడోపేడో తేల్చుకోనున్నాయి. ఈ నేపథ్యంలో పాక్ లెజెండ్ షోయబ్ అక్తర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. నో ఆప్షన్!..భారత్–పాక్ మ్యాచ్‌కు ముందు అక్తర్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు. టీమిండియా మీద నెగ్గాలంటే దూకుడు ఒక్కటే మార్గమని.. అటాకింగ్ అప్రోచ్‌తో మెన్ ఇన్ బ్లూను కట్టిపడేయాలని తమ దేశ ఆటగాళ్లకు సూచించాడు అక్తర్. న్యూజిలాండ్‌తో తొలి మ్యాచ్‌లో ఓడిన పాక్ సెమీస్‌కు వెళ్లాలంటే భారత్ మీద తప్పక గెలవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో రిజ్వాన్ సేనకు పలు సూచనలు చేశాడు అక్తర్. భారత్ చాలా బలమైన జట్టు అని.. ఆ టీమ్‌ను ఓడించాలంటే అగ్రెసివ్‌గా ఆడటం తప్ప వేరే ఆప్షన్ లేదని సజెషన్ ఇచ్చాడు.

# బంగ్లాతో మ్యాచ్.. ప్లేయింగ్ 11లో వాళ్లకు చాన్స్ ఇవ్వని రోహిత్

**న్యూఢిల్లీ–నవభూమి:** చాంపియన్స్ ట్రోఫీ 2025లో భారత ప్రయాణం మొదలైంది. తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో తలపడుతోంది రోహిత్ సేన. ఈ మ్యాచ్‌లో టాస్ నెగ్గిన బంగ్లా తొలుత బ్యాటింగ్ చేయాలని డిసైడ్ అయింది. అయితే ఈ మ్యాచ్ లో భారత్ వైవిధ్యమైన ప్లేయింగ్ ఎలెవన్‌తో వెళ్లడం చాలా మందికి ఆశ్చర్యాన్ని కలిగిం చింది. కెప్టెన్ రోహిత్ శర్మ, శుబ్‌మన్ గిల్ ఓపెనర్లుగా టీమ్‌లో ఉండటం కామనే. ఆ తర్వాత విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా మిడిలార్డర్ బాధ్యతలు చూసుకోవడం ఊహించిందే. స్పిన్ ఆల్‌రౌండర్లుగా రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ ఎంపిక కూడా గెస్ చేసినవే. కానీ చివరి ముగ్గురు ఆటగాళ్ల ఎంపికలో టీమ్ మేనేజ్ మెంట్ ట్విస్ట్ ఇచ్చింది. భారత ప్లేయింగ్ ఎలెవన్‌లో అనూహ్యంగా యంగ్ పేసర్ హర్షిత్ రాణా చోటు దక్కించుకున్నాడు. వైట్‌బాల్ క్రికెట్‌లో చాన్నాళ్లుగా రాణిస్తూ వస్తున్న లెఫ్టార్మ్ సీమర్ అర్ష్‌దీప్ సింగ్ జట్టులో తప్పక ఉంటాడని అంతా భావించారు. ఎడమచేతి వాటం పేసర్ కాబట్టి కూర్పులో వైవిధ్యం ఉంటుందని అనుకున్నారు. కానీ అతడ్ని కాదని యువ బౌలర్ రాణాను తీసుకున్నారు. రాణా వస్తే షమి ఉండడని అనుకుంటే అతడికి కూడా ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు కల్పించింది టీమ్ మేనేజ్‌మెంట్. ప్రధాన స్పిన్నర్‌గా వరుణ్ చక్ర వర్తిని తీసుకోవడం పక్కా అని వార్తలు వచ్చాయి. అయితే సారథి రోహిత్ బాగా నమ్మే కుల్దీప్ యాదవ్ ప్లేయింగ్ 11లోకి ఎంట్రీ ఇచ్చాడు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**